
# కథామంజరి


## పది కథల సమాహారం



మే 2026

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

**మే 2026**

సంపుటి : 7 ♦ సంచిక : 5



కథామంజరి

మే 2026 సంచికకి

ఆర్థిక సహకారం అందించిన

**డా. గండికోట రఘురామారావు** గార్కి

(చర్మవ్యాధి వైద్యులు, విశాఖపట్నం)

జన్మదిన శుభాకాంక్షలు

మరియు

కృతజ్ఞతలు

# కథామంజరి

## స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీ, జులై 2026

కథామంజరి ఏడవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహించబడే
ఈ కథల పోటీకి కథలను ఆహ్వానిస్తున్నాం!

ప్రథమ బహుమతి ₹ 5000/- ◆ ద్వితీయ బహుమతి ₹ 3000/- ◆ తృతీయ బహుమతి ₹ 2000/-
10 ప్రత్యేక బహుమతులు ₹ 1000 /- చొప్పున

**- నిబంధనలు -**

- స్వేచ్ఛా ఇతివృత్తంతో కథ నిడివి 1200 పదాల కంటే మించరాదు.
- కథను వర్డ్ ఫార్మాట్‌లో యూనికోడ్‌లో టైపుచేసి పంపవలెను. పిడియఫ్ ఫార్మాట్‌లో పంపే కథలు అనుమతించబడవు.
- కథతో పాటు - కథ స్వీయరచన అని, మరే ఇతర పత్రికలకు పంపలేదని, సాంఘిక మాధ్యమాలలో గాని, బ్లాగులలో గాని ప్రచురణ/ప్రసరణ జరగలేదని, సుస్పష్టంగా తెలియజేస్తూ హామీపత్రం జత చేయవలెను.
- పోటీకి వచ్చిన కథలలో కొన్నిటిని సాధారణ ప్రచురణకు కూడా ఎంపిక చేసుకుని, వీలువెంబడి ప్రచురణ చేయడం జరుగుతుంది. అలా ప్రచురణకు తీసుకునే కథలను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి పంపడం జరగదు. దయచేసి రచయితలు "పోటీలో బహుమతులు పొందకపోతే తమ కథలను తిప్పి పంపమని కోరుతూ" ఎటువంటి అభ్యర్థనలు మాకు పంపవలదు. ఈ విషయం ప్రత్యేకంగా గమనించవలసిందిగా కోరుతున్నాం.
- కథ హామీపత్రంలో "జన్మదిన సంచిక కథల పోటీకి" అని వ్రాయవలెను.
- మీ కథలు 31 మే 2026 తేదీ లోగా మాకు చేరునట్లు *submit@kathamanjari.in* కి మెయిల్ చేయవలెను.

రచయితలందరు ఈ కథల పోటీలో ఉత్సాహంగా పాల్గొని,
పోటీని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాం.



# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నండూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**

# కథామంజరి శ్రావ్యసంచిక



## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు
- పసుమర్తి వల్లీకృష్ణ గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| వినదగునెవ్వరు చెప్పిన .. | ix |
| కథాపుస్తక విశ్లేషణ | xii |


## కథలు


| | | |
|---|---|---|
| జీవనతరంగాలు | జాస్తి రమాదేవి | 1 |
| కొత్త ఆలోచన | తోట సుబ్రహ్మణ్యం | 7 |
| బహుమతి | డా. మజ్జి భారతి | 14 |
| నాన్న నీ మనసే వెన్నా... | సూరిశెట్టి వసంత కుమార్... | 20 |
| మారిన నేల - మారని మనసు | డా. లక్ష్మి రాఘవ | 25 |
| శాలువా | కోనే వెంకట నాగ ఆంజనేయులు | 31 |
| తింగరి తిక్క కుదిరింది! | మాచిరాజు కామేశ్వర రావు | 36 |
| మేకతల్లి త్యాగం | శ్రీమతి ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి | 38 |
| నన్ను క్షమించొద్దు! | డా. మద్దాళి ఉషా గాయత్రి | 41 |
| జైలునుండి దేశసేవకుడి శవం బయటకెళ్లింది | కీ. శే. సోమంచి యజ్ఞన్న శాస్త్రి | 48 |


Cover Page Credit : Shri PSN Murthy



# కథాకీయం

కథలు చెప్పడమనే ప్రక్రియకు ప్రపంచవ్యాప్తంగా, ప్రతీ ఏటా మార్చి 20 తేదీని కథా దినోత్సవంగా జరుపుకుంటారు! 1990లో ఈ స్టోరీ టెల్లింగ్ డే.. స్వీడన్ దేశంలో ఆరంభమయింది. తర్వాత ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. అయితే.. మిగతా కొన్ని దినోత్సవాల్లా ఈ స్టోరీ టెల్లింగ్ డే అంత ప్రాముఖ్యతను, గుర్తింపును పొందలేదు. ఇక మన దేశంలో ఈ మాట కూడా ఎప్పుడూ వినబడలేదు. నిజానికి కథల ద్వారా విజ్ఞానాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను, సమకాలీన స్థితిగతులు, ప్రజల జీవనవిధానాలు.. ఇలా చాలా విషయాలను ఒక తరం నుంచి మరొక తరానికి అంద చేయబడతాయి. ఇది మనిషి మనుగడకు అత్యవసరమైనది! ఈ దినోత్సవానికి ప్రతీ ఏడు ఒక 'అంశం' (థీమ్) కూడా ప్రకటించి, ఆ అంశం మీద వచ్చే కథలను మౌఖికంగా చెప్పడాన్ని ఓ ఉత్సవంగా జరుపుకుంటారు.

ప్రపంచ దేశాల కథాసాహిత్యం మాట ఎలా వున్నా సరే.. మన దేశంలో కథాసాహిత్యం విభిన్నమైనదని చెప్పాలి. మన దేశంలో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన 22 భాషలే కాకుండా.. వందల్లో ఇతర భాషలు, యాసలు ఉన్నాయి. ప్రతీ భాషలోనూ సాంప్రదాయ కథలు, ఇతిహాస కథలు, దేశచరిత్రకు సంబంధించిన కథలే కాకుండా.. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి కథలు కేవలం మన దేశానికి పరిమితమయినవే చాలా ఉన్నాయి. అయినా సరే, ఈ కథా దినోత్సవాన్ని.. మన దేశంలో ఏ సంస్థ జరిపినట్లు దాఖలాలు లేవు. అసలు అలాంటి ఓ 'దినం' ఉన్నదనే విషయం కూడా ఎవరికి తెలిసినట్లు లేదు.

అయితే ఈ విషయంలో మన తెలుగువారు గర్వంగా చెప్పుకునేటట్టు.. గత నాలుగైదు సంవత్సరాలుగా మార్చి 20 తేదిన, అమెరికాలో ఉన్న 'బి+విత్ భాస్కర్' అనే సంస్థ వారు ఈ "వరల్డ్ స్టోరీ టెల్లింగ్ డే" ని చాలా ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మార్చి 21, 22 తేదిలలో, విరామం లేకుండా, ఏకధాటిగా 26 గంటల పాటు ఈ ఉత్సవాన్ని అంతర్జాలంలో నిర్వహించారు. ఇరవై దేశాల నుంచి నూటముప్పైకి పైగా మన తెలుగు కథలు వినిపించారు. మధ్య మధ్యలో ఆ కథల మీద, లబ్ధప్రతిష్టులు విశ్లేషణలు కూడా చేసారు. ఈ ఏడాది సూచించిన అంశం "చీకటిలో వెలుగు" మీద కొత్తగా కథలు వ్రాసి చదివినవారు కొందరు, ఆ అంశం మీద గతంలో వచ్చిన కథలను చదివినవారు కొందరు.. అలా మొత్తం మీద ఏకాహంలా తెలుగు కథలను ప్రపంచవ్యాప్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది తెలుగు కథాప్రియులు ఈ కార్యక్రమాన్ని నేరుగా ప్రత్యక్ష ప్రసారంలో చూసి ఆనందించారు. ఇంతటి ఘనమైన కార్యక్రమాన్ని, అమెరికాలో డల్లాస్ నుండి, ఓ నెల ముందు నుంచి పకడ్బందీగా ప్రణాళిక వేసి, ముందుండి నిర్వహించిన శ్రీ రాయవరం భాస్కర్‌గారు, దేశ విదేశాల్లోని ఉన్న కొంతమంది మిత్రబృందం.. ఆయన ముందు వెనుక నిలబడి అద్భుతంగా కథని నడిపారు. వీరందరికీ కథామంజరి జేజేలు పలుకుతూ.. తప్పకుండా వచ్చే సంవత్సరం కథామంజరి కూడా 'మేము సైతం..' వారితో నడవగలమని తెలియచేస్తున్నాం!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**డా. మద్దాళి ఉషాగాయత్రి**

తెలుగు కథారచయితలలో.. నటులుగా, సంగీత కళాకారులుగా, గాయకులుగా, చిత్రకారులుగా, వక్తలుగా.. ఇలా ఇతర కళల పట్ల ఆసక్తితో పాటు ఆ రంగాల్లో కూడా పేరు తెచ్చుకున్నవారు ఉన్నారు. అలాగే కొందరు కళాకారులు.. తనకున్న పరిజ్ఞానంతో కలం పట్టుకుని, తనకున్న కళకు సంబంధించిన వ్యాసాలు రాసేవారు ఉన్నారు. ఎందరో కళాకారులలో.. తీర్చిదిద్దే గురువులుగా అడుగులు వేసినవారు ఉన్నారు. కాని ముఖ్యంగా నాట్యకళలో ఆరితేరిన కళాకారుల్లో కథారచయితలు చాలా అరుదుగా ఉంటారు. ఆ అరుదైన వారిలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన నాట్య కళాకారిణి, కథా రచయిత్రి, బహుముఖ ప్రతిభాశాలి డా. మద్దాళి ఉషాగాయత్రి గారు. తెలుగునాటే కాదు.. దేశ విదేశాలలో పరిచయం అక్కర్లేని నృత్యకిన్నరే కాదు.. కథా కిన్నెర కూడా!

డా. ఉషాగాయత్రి గారికి చిన్నతనం నుంచే కళల పట్ల ఆసక్తి ఉండేది. చిన్నతనంలోనే.. భరత కళాప్రపూర్ణ శ్రీ వేదాంతం జగన్నాథశర్మ, శ్రీ వై.యస్. శర్మ గార్ల దగ్గర శాస్త్రీయనృత్యం కూచిపూడిలో శిక్షణ తీసుకున్నారు. చిన్నతనంలోనే ప్రదర్శనలు ఇస్తూ, చాలా పురస్కారాలు అందుకున్నారు. అలా నాట్యంతో ఎదుగుతూ, మరోవైపు కామర్సు డిగ్రీ చేసిన తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఉద్యోగంలో చేరారు. తర్వాత కాలంలో నృత్యంలో మాస్టర్స్ డిగ్రీ, కూచిపూడి నాట్యంలో పి.హెచ్.డి. చేసారు. అయితే ఇవన్నీ శిక్షణ, స్వయంకృషితో సాధించినవి. కాని, చిన్నతనంలోనే కథలు వ్రాయాలనే తపనతో, స్కూల్లో చదువుతున్నప్పుడే కలం పట్టుకుని చిన్న చిన్న ప్రయత్నాలు చేసారు. అయితే తనకున్న పరిజ్ఞానం, అవగాహన సరిపోదనీ, వాటిని సాధించాలంటే పుస్తకాలు చదవాలనీ గ్రహించి.. ముందు అటువైపు దృష్టి సారించారు. ప్రముఖుల పుస్తకాలు పదే పదే చదివారు. చదివినప్పుడు.. ప్రతీ పదాన్ని, ప్రయోగాన్ని గమనించి.. కథావస్తువు ఎంపిక, కథనం, ఎత్తుగడ, ముగింపు వంటి లక్షణాలని ఒడిసి పట్టుకున్నారు. అయినా సరే, వ్రాసిన కథలను పత్రికలకు పంపే ధైర్యం చేయలేదుట! చివరికి భయపడుతూనే, స్వాతి మాసపత్రికకు పంపిన తొలి కథ “భయం” ప్రచురణకు నోచుకోవడంతో.. మరి వెనక్కు చూడలేదు.

బ్యాంకులో ఉద్యోగం, మరోవైపు నాట్య ప్రదర్శనలు ఇస్తూ.. ఎంతో బిజీగా ఉన్నా సరే, డా. గాయత్రిగారు కథారచనలకి పూర్తి న్యాయం చేసారనే చెప్పాలి. వ్రాసిన కథల్లో స్త్రీవాదం కనబడుతుంది. స్త్రీల శ్రమకు తగిన గుర్తింపు, వారి నైపుణ్యాలకు విలువ ఇవ్వాలనే సందేశం వీరి కథల్లో ప్రస్ఫుటంగా కనబడుతుంది. అలాగే కుటుంబ నేపథ్యం, సామాజిక అంశాలను తన కథల్లో నేర్పుగా జోడించి, చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా, సాఫీగా చెప్పిన విధానం.. సాహితీ పెద్దల మన్ననలను పొందింది. ప్రముఖ రచయిత్రి శ్రీమతి యద్దనపూడి సులోచనారాణిగారి సాహితీప్రభావం డా. గాయత్రిగారి రచనలలో కనబడుతుంది. ఆ స్ఫూర్తితో తన మొదటి కథాసంపుటి “భారతనారీ వర్ధిల్లు” ను వారికే అంకితం ఇచ్చారు. డా. ఉషాగాయత్రి గారి తండ్రి సాహిత్యం వైపు ప్రోత్సాహం ఇస్తే, తల్లి కళల పట్ల మక్కువ కలగడానికి దోహదపడ్డారు. రెండు దశాబ్దాలు బ్యాంకులో ఉద్యోగం చేసి, తర్వాత స్వచ్ఛందంగా పదవీవిరమణ చేసి, తర్వాత తన సమయాన్ని పూర్తిగా నాట్యం


కోసమే వెచ్చించి, కృషితో ఆ రంగంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. తన ఏభై ఎనిమిదో ఏట నాట్యశాస్త్రంలో పి.హెచ్.డి. పట్టా అందుకున్నారు. తర్వాత కాలంలో నాట్య ప్రదర్శనలు ఇస్తూ, కథా రచనలు సాగిస్తూ, రెండు కథా సంపుటాలు "కడదాక కలిసి", "అమ్మమ్మగారి కాశీ యాత్ర" విడుదల చేసారు.

డా. గాయత్రిగారి అటు పుట్టింటివారు, ఇటు మెట్టింటివారు సాహిత్యం, కళల పట్ల గౌరవం, మక్కువ ఉన్నవారే! ఆ నేపథ్యంలో అటు, ఇటు కూడా ఎనలేని ప్రోత్సాహం లభించింది. డా. గాయత్రిగారి భర్త శ్రీ మద్దాళి రఘురామ్‌గారు కూడా సాహితీ కళారంగాల్లో పేరు పొందినవారే. ప్రముఖ సాంస్కృతిక సంస్థ "కిన్నెర ఆర్ట్ థియేటర్" కార్యదర్శిగా గత ఐదు దశాబ్దాలుగా సేవలు అందిస్తూ, మరోవైపు కవిగా, వ్యాస రచయితగా కలంతో సాహిత్య సృష్టి చేస్తున్నారు. అంతేకాదు.. కిన్నెర సంస్థ ద్వారా ఇప్పటి వరకు సుమారు నూట ఏభై పుస్తక ప్రచురణలు చేసారు.

ఇలా అపూర్వమైన ఓ బహుముఖ ప్రజ్ఞాశాలిని పరిచయం చేయడానికి.. కథామంజరి అడిగిన వెంటనే సహకరించి మాకు ప్రోత్సాహం అందించిన డా. ఉషాగాయత్రి గారికి, శ్రీ రఘురామ్‌గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం! ఆ దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అటు నాట్యరంగంలోనూ, ఇటు సాహితీరంగంలోనూ సేవలు అందిస్తూ, ఈ తరం వారికి మార్గదర్శకులుగా వెలుగొందాలని కోరుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

## కథాపుస్తక పరిచయం





### గోరపిట్ట

శ్రీకాకుళం అంటే ఉద్యమాలు, ఉత్తరాంధ్ర మాండలికం గుర్తుకు వస్తాయి. ఆ నేపథ్యంలో సువర్ణముఖిగారి కలం నుండి జాలువారిన ఈ 13 కథల సమాహారం వెల రు.120/-.

**ప్రతులకు**

సిక్కోలు బుక్ ట్రస్ట్,
MIG 100, హౌసింగ్ బోర్డు కాలనీ,
జిల్లా పరిషత్ ఎదురుగా,
**శ్రీకాకుళం – 532001**
✆ 99892 65444



# కథా మార్గదర్శి

## కీ.శే. సోమంచి యజ్ఞన్న శాస్త్రి

ప్రవాసాంధ్రలో తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చి, అక్కడ మన భాష మనుగడకు, మన భాషకు గుర్తింపు కోసం, తెలుగు సంప్రదాయాలను నిలుపుకోవడం కోసం కృషిచేసిన, చేస్తున్నవారికి మార్గదర్శిగా చెప్పుకోదగ్గ మహామనిషి, అందులో మహారాష్ట్ర తెలుగు జాతికి ఎనలేని గుర్తింపు, గౌరవం తీసుకొచ్చి సుసంపన్నం చేసిన అవిస్మరణీయమైన మహోన్నత వ్యక్తి.. కథకులు కీ.శే. సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారు.

3, నవంబర్ 1913లో, ఏలూరులో సీతారామయ్య, వరలక్ష్మి దంపతులకు జన్మించిన యజ్ఞన్నగారు ఉన్నత విద్యనభ్యసించి ముంబైకి చేరుకున్నారు. 1945లో 'బృహన్ముంబై మహానగర్ పాలిక' లో చేరి, డిప్యూటి కమీషనర్ స్థాయికి ఎదిగారు. తన జీవితంలోని విలువైన మూడుదశాబ్దాలను మున్సిపల్ కార్పోరేషన్ సేవలో వెచ్చించారు. ఆయన తన హయాంలో ముంబైలో విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారు.

ప్రాథమికంగా యజ్ఞన్నగారు సాహితీవేత్త! ముంబైలో పరిపాలనా పరంగా, నిర్మాణపరంగా ఆయనను 'ఆర్కిటెక్ట్' అని, సాహిత్యపరంగా ఆయనను 'స్కల్ప్టర్' అని పిలిచేవారు. విశేషమేమంటే.. ఆయనకు తెలుగు భాషన్నా, తెలుగు సాహిత్యమన్నా ఎనలేని అభిమానం. తెలుగు సంస్థల్ని బాగా ప్రోత్సహించేవారు. కానీ, కమీషనర్‌గా పక్షపాతం వహించకూడదు గనుక, అన్ని భాషల, ప్రధానంగా దక్షిణ భాషల, సంఘాలపై సమదృష్టిని పాటించేవారు.

సాహిత్యపరంగా యజ్ఞన్నశాస్త్రిగారు అంతర్జాతీయస్థాయి తెలుగు రచయిత అని చెప్పుకోవాలి. ప్రముఖ అభ్యుదయ రచయిత శ్రీ అబ్బూరి రామకృష్ణారావుగారి మార్గదర్శకత్వంలో నాటక రచనలు చేయడం ఆరంభించిన యజ్ఞన్నశాస్త్రిగారు గంభీరమైన సామాజిక సమస్యల మీద, నవ్వులు వెదజల్లేలా నాటకాలను రచించారు. యజ్ఞన్న శాస్త్రిగారి రచనలలో హాస్యరసం ఎక్కువగా ఉన్నా, మనిషిని సీరియస్‌గా ఆలోచనల్లోకి దింపే సామాజిక సమస్య.. కథావస్తువుగా ఆ రచనల్లో కనబడుతుంది. తన అభిరుచికి అనుగుణంగా రచనాశైలిని కూడా అలవరచుకున్నారు. యజ్ఞన్నశాస్త్రిగారి ఏ నాటకమైనా సులభంగా రంగస్థలం మీద ప్రదర్శనాయోగ్యంగా ఉంటుంది!

యజ్ఞన్నశాస్త్రిగారు సుమారు ఇరవై మంచి నాటకాలు, అదే సంఖ్యలో కథలు వ్రాసారు. చాలా కథలను, వ్యాసాలను తెలుగు నుండి ఇంగ్లీష్‌లోకి అనువాదం చేసేవారు. ఆ రోజుల్లో ఆయన రాసిన ఆర్టికల్స్ 'ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా' లో ప్రచురితం అయ్యేవి. అది ఒక తెలుగు రచయితకు లభించిన గౌరవప్రదమైన స్థాయి అని చెప్పాలి. ముంబై తెలుగు రచయితలెవ్వరికీ అంతటి గౌరవం ఇంతవరకు దక్కలేదు. ఆయన కొన్ని ఇంగ్లీష్ నాటకాల ఆధారంగా తెలుగు నాటకాలు రాశారు. ముఖ్యంగా జాన్ గాల్స్‌వర్దీ, మారిస్ మాటర్లింక్, నికోలాయ్ గగోల్, జార్జ్ బెర్నార్డ్ షా లాంటి వారి రచనలను తెలుగీకరించారు. సామాజిక అంశాలను వ్యంగ్యాత్మకంగా, మానవీయకోణంలో ఆయన చేసిన రచనల వలననే ఆయన ఆంధ్ర నాటకరంగంలో 'విశిష్టమైన వ్యక్తి' గా నిలిచారు. ఆ రోజుల్లో లక్నోలో జరిగిన అభ్యుదయ రచయితల సమావేశానికి కూడా హాజరయ్యారు. 1992లో తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు 'కీర్తి పురస్కారం' ఇచ్చి గౌరవించింది.


'సోమంచి యజ్ఞన్న శాస్త్రిగారి రచనల మీద పలువురు పరిశోధనలు చేసి వివిధ విశ్వవిద్యాలయాల నుంచి పి.హెచ్.డి. లను పొందారు. 'ఆయన రచనలకు రావాల్సినంత పేరు వచ్చిందో లేదో చెప్పలేమనీ, ఆయన ముంబై కేంద్రంగా రాయడం వల్లే తగినంతగా పేరు రాలేదనే' అభిప్రాయం చాలామందిలో ఉన్నా, యజ్ఞన్న శాస్త్రిగారు మాత్రం పేరు కోసం ఏ పని చేయలేదనే చెప్పాలి. ముంబైలో తెలుగు స్కూళ్లు విస్తరించడానికి ఆయన చేసిన కృషికి హద్దులు లేవనే చెప్పాలి. అక్కడ ఆంధ్ర మహాసభ స్థాపనలో ప్రముఖ పాత్ర వహించి, తద్వారా తెలుగు సంస్కృతిని పెంచే ఎన్నో కార్యక్రమాలను యజ్ఞన్న శాస్త్రిగారు నిర్వహించారు. ముంబై ఆంధ్ర మహాసభ వార్తలకు ప్రాధాన్యత ఇస్తూ 'మహాంధ్ర' అనే త్రైమాసిక పత్రికను స్వీయ సంపాదకత్వంలో యజ్ఞన్నశాస్త్రిగారు వెలువరించేవారు. ఈ పత్రికలో నాటి ప్రఖ్యాత రచయిత, రచయిత్రుల కథలు, నాటకాలు, కథనాలు విరివిగా ప్రచురింపబడ్డాయి. యజ్ఞన్న శాస్త్రిగారు రాసిన 'తెలుగు మరాఠీ భాషల సంబంధ బాంధవ్యాలు' అనే ఆర్టికల్ ఇప్పటికీ టార్చ్ బేరరే! ఆయన రాసిన 'రామయ్య బాబాయి అంతిమ యాత్ర' అనే దీర్ఘ కవిత సంచలనం సృష్టించింది ఆ కాలంలోనే!

పరిపాలనాదక్షుడిగా, పరిపక్వమైన రచయితగా సోమంచి యజ్ఞన్న శాస్త్రి గారు ముంబై తెలుగువారికి చేసిన సేవలు నేటికీ అనితర సాధ్యం. ఆయన చేసిన సేవలు, రచనలు ఎప్పటికి ముంబై తెలుగువారే కాదు, యావత్తు తెలుగుజాతి గుర్తుంచుకోవాలి. అంతటి ప్రతిభాశాలి అయిన కీ.శే. సోమంచి యజ్ఞన్న శాస్త్రి గారిని "కథా మార్గదర్శి" గా స్మరించుకుంటూ, అంజలి ఘటిస్తున్నాం.

**కథామంజరి బృందం**

---

## కథాపుస్తక పరిచయం




### ఆకలి

కలకత్తా నుంచి 30 సంవత్సరాలలో 17 కథలు వ్రాసి, వాసికెక్కిన రచయిత కేశవ్‌గారు. 17 కథల ఈ సంపుటి వెల రు. 120/-.

**ప్రతులకు**

సిక్కోలు బుక్ ట్రస్ట్,
MIG 100, హౌసింగ్ బోర్డు కాలనీ,
జిల్లా పరిషత్ ఎదురుగా,
**శ్రీకాకుళం – 532001**
✆ 99892 65444



# కథా పరిచయం

## మెడికో శ్యామ్‌గారి రచన : 'ఇది మా కథ'

మెడికో శ్యామ్‌గారి కథ చదివితే ఆయన ఏం రాసారు, దేని గురించి రాసారో, ఎలా రాసారో అన్ని కోణాలూ పాఠకుడిని ఆలోచింపచేసేవే! ఆయన రాసిన కథల సంకలనాలు 'షామియానా', 'సరాగమాల', రెండు వెలువడ్డాయి. రాసిన కథలు కొన్నే. అయితే అన్నీ పాఠకుల మనసులో నిలిచిపోయేవే. కథా విశ్లేషకుల కలాలకు పదును పెట్టేవే. చాలా మటుకు కథలు డెబ్భై, ఎనభైలలో రాసినవే. ఆయన్ని ఎందుకు రాయలేదని ఎవరైనా అడిగితే, "రాయాలని అనిపించలేదు, రాయలేదు" అనే సమాధానం. ఈమధ్య రాస్తున్నవి కొన్ని కథకుడి కథలు, కొన్ని వ్యాసాలు. ఆయన ఆధునిక సాహిత్య చరిత్రను ఔపోసన పట్టిన విశ్లేషకుడు కూడా. ఎందరో రచయితల సాహిత్య కృషి ఏమిటి, సాహితీ సంబంధిత వ్యక్తిగత విషయాలేమిటి.. వంటివి ఆయన కొన వేళ్ళమీద నాట్యమాడుతుంటాయి. సభలలో అందర్నీ నవ్విస్తూ, కవ్విస్తూ, మాటల మాంత్రికుడిలా సాహితీ ప్రపంచంలో తనదంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఆర్జించిన వ్యక్తి మెడికో శ్యామ్.

ఆయన రాసిన కథ 'ఇది మా కథ' ఈ మధ్య 'కథా పున్నమి' అనే సంకలనంలో చూడడం జరిగింది. ఈ కథ కూడా అప్పట్లో రాసిందే.. నాకు తెలిసినంతవరకూ! ఈ కథ సగటు దిగువ మధ్య తరగతి మనుషుల కథ. పాత్రలు తామంత తామే చెప్పే కథ. కుటుంబంలోని వారు, నాన్న, అమ్మ, అన్న, తమ్ముడు, అక్క, చెల్లెలు, ఆఖరి తమ్ముడు. తమ జీవితాల్లో ఒక రోజు ఒక సమయంలో వారందరిలో చెలరేగుతున్న అంతర్మథనం. ప్రతి ఒక్కరికీ, వారి వారి వయసు, పరిస్థితి, తీరని కోర్కెలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, జరుగుతున్న నిజజీవితాన్ని అంగీకరించలేక, ఎవరికి వారే ఎన్నుకున్న పలాయన మార్గాలు!

ఈ కథకు మొదలు, ముగింపు లేదు. ఒక సగటు కుటుంబ గాథను రచయిత పాఠకుడి ముందుంచిన తీరు, కథా శిల్పం గమనించదగ్గవి. ఇక ఈ రచయితకున్న అతి శక్తివంతమైన ఆయుధం ఆయన మాటలతో చేసే గారడీ. ఇక కథలోకి వెళ్దాం.

నాన్నకి ఇంకా కాలేజీ డ్రీమ్స్ తీరలేదు.. పాతికేళ్ళయినా! పెద్దవాడికి ఆల్కాహాలు ముట్టద్దని చెప్పలేదు, తను ముందరగా వద్దనుకుంటేగా! అలాగే రెండోవాడికి పొగ తాగొద్దని చెప్పలేదు. మూడో వాడి క్లాసు పుస్తకం మధ్య పేజీల్లో అస్సలైన సెక్సు పుస్తకం పదే పదే గుర్తొస్తూ, తనను వెన్నంటి వచ్చే జ్ఞాపకాలు! భార్యని 'ఆరిపేయవే దీపమూ' అంటే వినదుగా, బలవంతాన మోటుగా లాగేదాకా చేస్తుంది. టౌన్‌హాల్ టర్నింగులో మహా బ్రైట్ ఫెలోలా ఉండే సుమసుందరి సునందిని గుర్తొచ్చింది. ఇలాటివన్నీ మర్చిపోడానికి తనకి తను పెద్దవాడనుకోడుగా! చేతిలో ఒక్క పది రూపాయలుంది. ఏం చేయగలడు? ఎదురుగా బాటిల్స్. "తాగవోయ్, తాగవోయ్ తనివితీరా నీవు" అంటున్నాయి.

అమ్మ ఒక నిస్సహాయురాలు. ఏ జన్మలో ఖర్మమో! మొగుడికి ఇల్లూ, వాకిలీ పట్టదు. తాగడం, స్నేహితులూ! గొంతు చించుకు అరుస్తున్నా ఒక్కడూ పట్టించుకోడు. ఇంట్లో అన్నీ నిండుకున్నాయి. బియ్యం ఓ పూటకే వస్తాయి. మోర్నింగ్ షోకి

# కథా పరిచయం

వెళ్ళలేదని మూడోవాడి ఏడ్పు. సిగరెట్టు లేదని కాబోలు రెండోవాడి ఏడుపు. పౌడరు లేదని రెండోదాని ఏడ్పు. మొగుడు లేడని మొదటిదాని ఏడ్పు. కూరలు తేవాలంటే ఒక్కడు పలకడు. తనున్నన్నాళ్ళూ చేస్తుంది. తరవాత వాళ్ళే అనుభవిస్తారు. తన గురించి ఆలోచించేవారు ఒక్కరూ లేరు. తన జాతకంలో ఆదాయం ఆరు, వ్యయం పదహారు. రాజపూజ్యం ఒకటీ, అవమానం ఆరూ. బతుకంతా ఇంతే. కూరలు కొంటూండగా ఎవరో తెలిసిన మనిషి "సినిమాకి వెళ్తున్నారా?" అని ప్రశ్న. బానే ఉంది. రెండుకి కలుద్దాం.

అన్న లోకం వేరు. 'తన బిఎ పూర్తి కాదు, తనకు ఉద్యోగం రాదు. చేతిలో పైసలాడవు. నాన్న ఇవ్వడు, కనపడడు. తనదీ ఒక బతుకేనా?' ఇదీ తన పరిస్థితి.

చెత్తా చెదారం రాసి, పది పరకా సంపాదిస్తే, అమ్మ కంటపడి గుటకాయి స్వాహా అయింది. పొద్దున్నే అమ్మ రేడియో విప్పుతుంది. ఇంట్లో ఉన్న రెండు చీమపోతులూ గుమ్మంలో నిలబడడం, అద్దంలో చూసుకొని మొహానికి పౌడర్లు మెత్తేయడం! ఇష్టం లేకపోయినా ఆడతాడు పేక. బాగుండదనుకున్నా రవిగాడిచ్చిన మందు పార్టీలో వసూ రూపం తల్చుకుంటూ, దాహంతో తాగేసాడు.

తమ్ముడు బాధంతా తన హీరోతో రిలీజ్ అయిన సినిమాకి మొదటి ఆట కాకపోయినా, మొదటి రోజైనా వెళ్ళకపోతే ఎలా? సినిమాకి ఇంకో ఆకర్షణ ఫిమేల్ ఎగ్జిబిషన్‌కి ఈక్వల్‌గా మేల్ ఎగ్జిబిషన్! జేబులో పైసా లేదే! ఎవడి నెత్తిన చెయ్యేద్దాం?

అక్క పుస్తకం చదువుతున్నంతసేపూ ప్రపంచాన్ని మర్చిపోతుంది. అమ్మ కేకలు అలజడి కలిగిస్తుంది. ఏడుపొస్తుంది. ఎన్నాళ్ళిలా ఎదురు తెన్నులు? ఎవరి కోసం? తనకింక పెళ్ళి కాదు. పెళ్ళేనా పరమావధి? కాదంటే ఏది గమ్యం? తనకేది మార్గం? సముద్రమున పడిపోవడమా? ఉరి పోసుకు చనిపోవడమా? తనూ ఒకప్పుడు చెల్లెలిలాగే కలలు కనేది. ఇప్పుడు మిగిలింది మాటరాని నిశ్శబ్దం మాత్రమే.

చెల్లెలు "రాజా అందించు నీ లేత పెదవి..." అంటూ పాడుకుంటుంది, కానీ అమ్మ పాడనివ్వదు.. 'చదువుకోరాదూ' అంటూ! తనని నవలలు చదవనివ్వరు. సినిమాలు చూడనివ్వరు. షికార్లు లేనే లేవు. ఈ ఇల్లూ, ఈ వాతావరణం, ఈ మనుషులూ....ఎన్నాళ్ళిలా?

ఆఖరివాడుగా నాన్నతో హోటల్‌కి వెళ్ళేడు. అందరూ ఉంటే ఖర్చు కదా!

ఇదీ మధ్య తరగతి కుటుంబం కథ. దీనికి కారణం ఎవరు?

రచయిత మాటలలో "మేం మాత్రం కాదు. మా చుట్టుపక్కల అంతా బురద, బురదలోంచి పుట్టాం. బురదలో పెరిగాం. అసహ్యకరమైన అసభ్యకరమైన బురదలోనే మా జీవితం. 'పంకజం' లా మాలో అక్కడా అక్కడా ఒకరూ... అరా..."

ఈ కథలో విషయం చూస్తే, పాతదే. మధ్య తరగతి జీవితాలు. ఎవరికి తెలీదు? కోరికలుంటాయి అందరిలాగే. కాని అవి తీర్చుకునే అవకాశాలే ఉండవు. ఎందరో చెప్పారీ కథని. అయితే రచయిత ఈ కథ చెప్పిన విధానంలో తనదంటూ ఒక ముద్ర వేసుకుంటాడు. అంతే కాదు. తన చుట్టూ సమాజంలో మనుషుల వ్యధలను చూసి కలిగిన బాధకు అద్దం పడుతూ రాసిన కథ ఇది. రచయిత ఈ కథను ఎవరికి అంకితం ఇచ్చారో చూడండి. "సంసారాల్ని బాధతో కన్నీటితో, కాళ్ళూ

చేతులూ పెట్టి చీము, నెత్తురూ పోసి లాగించే స్త్రీలకు, వాళ్ళ అసహాయ భర్తలకు, వాళ్ళ అడవి కాచిన వెన్నెలకన్నెలకూ వాళ్ళని వరించలేని, భరించలేని పిరికివరులకూ, నిష్కారణంగా దగాపడ్డ అన్నలకూ, తమ్ముళ్లకూ... కన్నీళ్ళ రెయిన్ లోంచి ఆలోచన్ల ట్రెయిన్లోంచి...."

కథ చదువుతూన్నంత సేపూ ప్రతి వాక్యంలోనూ కుటుంబంలోని మనుషుల మనసుల్లోని అలజడి సవ్వడి వింటూనే ఉంటాం. కథనం లోని గొప్పతనమది. రచయిత వాడిన మాటల ద్వారా, పాత్రలు తమకు తెలియకుండానే పాఠకులతో వారి ఆలోచనారీతిని పంచుకుంటుంటాయి. అణచుకోలేని కోరికలతో ఏమీ చెయ్యలేని పరిస్థితుల వల్ల వచ్చే మానసిక వ్యథ పాఠకులు అనుభవించేలా రాసారు రచయిత.

**పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్**

---


## కథాపుస్తక పరిచయం




### ఈస్తటిక్ స్పేస్

జీవితాన్ని సీరియస్‌గా తీసుకుని, తన చుట్టూ జరుగుతున్న సంఘటనల గురించి లోతుగా ఆలోచించి.. తన కథల ద్వారా చైతన్యం కలిగిస్తున్న రచయిత శ్రీ దగ్గుపాటి పద్మాకర్‌గారి ఈ 17 కథల సంపుటి వెల రు.200/-

**ప్రతులకు**

సిక్కోలు బుక్ ట్రస్ట్,
MIG 100, హౌసింగ్ బోర్డు కాలనీ,
జిల్లా పరిషత్ ఎదురుగా,
**శ్రీకాకుళం – 532001**
✆ 99892 65444



# వినదగునెవ్వరు చెప్పిన ..

బుల్ బుల్ పిట్ట ముఖచిత్రంతో ఏప్రిల్ సంచిక కథామంజరి.. సరిగ్గా అర్థ రాత్రి కావడానికి పావు గంట ముందు అంతర్జాలంలో వాలింది. అనువాద చక్రవర్తి డా .అయోధ్యారెడ్డిగారు విశిష్ట అతిథిగా, వివిబి రామారావు గారు కథామార్గదర్శిగా ముస్తాబై పాఠకుల వద్దకు చేరింది. శాయి రాచకొండగారి కథాపరిచయం మధు పెమ్మరాజుగారి 'ఇనుప తెర' ఎప్పటిలాగే అలరించింది. ఇక ఇప్పటి నుండి నా కళ్ళు 'దోరేదార్' కొరకు వెదుకుతాయి.

పదికథల సమా'హారం'లో మొదటి పూస కర్లపాలెం హనుమంతరావుగారిది. ఆ పూస పేరు 'లవ్ అండ్ హేట్'. తన యుక్త వయస్సులో పాల్ మాష్టారుని ప్రేమించి, తన ఇంట్లో వారి వల్ల కథానాయకుడిని కామేశ్వరి పెళ్లి చేసుకుంది. అనుకోకుండా అతను వారి ప్రేమలేఖలను చూడడంతో ఇద్దరి మధ్య దూరం మొదలైంది. అప్పటికే కామేశ్వరి గర్భవతి. చివరికి విడాకులు తీసుకుంటారు. కథానాయకుడు వేరే పెళ్లి చేసుకుంటాడు. కామేశ్వరి పాల్‌తో కలిసి ఉండేదన్న విషయం.. కథ చివరలో కథానాయకుడు తన కూతురి అడ్మిషన్ కోసం ఒక స్కూల్ దగ్గరకు వెళ్లినప్పుడు పాల్ పరిచయం అయిన తర్వాత తెలుస్తుంది. అప్పుడు తెలుస్తుంది కామేశ్వరి ప్రసవంలో బాబుని కని, చనిపోయిందనీ. సరళంగా సాగిపోయిన కథ. కర్లపాలెం గారి పేరు చూడగానే బహుశా కాస్త ఎక్కువగా ఊహించానేమో... అసంతృప్తి కలిగించింది. కొచ్చెర్ల గారు వేసిన చిత్రం కథకు కుదరలేదేమో అనిపించింది.

ప్రశాంతవర్మ ఉప్పలపాటిగారి కథ అపాత్రదానం. యాచక వృత్తిని, యాచకులను మరో కోణంలో చూపిన కథ. ఈ మధ్య 'సొమ్ము దానం చేయకండి, వీలుంటే తినే పదార్థాలు దానం చేయండి' అని సోషల్ సైట్స్‌లో బాగా సర్క్యులేట్ అయింది. ఈ కథలో అసలు దానం అనేది చేయకపోవడం వల్ల కొన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పే ప్రయత్నం చేసిన కథ. చర్చకు అర్హమైన అంశం. అంశాన్ని చర్చకు పెట్టినందుకు రచయిత అభినందనీయులు.

ఎంతెంత దూరం... రాజేంద్రప్రసాద్‌గారి కథ. అనారోగ్యంతో ఉన్న ఒక ముసలతన్ని, నలుగురు కలిసి ఎత్తులు, పల్లాలు, గుట్టలు, కట్టలు దాటి మంచం మీద ఆసుపత్రి దాకా తీసుకొస్తారు. తీరా డాక్టరు చూసి చనిపోయినాడని చెప్తే తిరిగి తీసుకువెళ్తుంటారు. తీసుకెళ్ళాక అందరి మాటలు ఎలా ఎదుర్కోవాలీ, మిగిలిన కర్మకాండలు ఎలా చేయాలీ అని ఆలోచిస్తూ ఉండగానే... చనిపోయాడనుకున్న ముసలతను నెమ్మదిగా లేచి 'ఆసుపత్రి ఇంకా ఎంతదూరం' అని అడుగుతాడు. అదీ కథ.... ఇందులో అంశం ఇదేనా?? ఇంకేదైనా మిస్ అవుతున్నానా? అయ్యానా? అవునూ... ఒక పేషెంట్‌ని తీసుకుని ఆసుపత్రికి వస్తున్నప్పుడు, అతను చనిపోతే_ _ _ శవాన్ని ఆసుపత్రికి తీసుకు వస్తే పోలీసులు కేసు పెడతారా?

తరువాత రాజారామ్మోహన రావు గారి కథ 'ప్రయోజనం'. సహజీవనంలో ఉన్న ఒక జంట. పూజా, రవి. పూజ పెళ్లి చేసుకుందామని పట్టుపడుతుంది. రవి పూజ తల్లిదండ్రులకు ఉన్న స్థలాన్ని రాసి ఇస్తే చేసుకుందాం అంటాడు. 'నీకు నా

కంటే, నా ప్రేమ కంటే నీ స్వార్థమే ముఖ్యం కదా' అని పెళ్ళిని తిరస్కరిస్తుంది పూజ. స్థూలంగా అంతే! కథ మధ్యలో ఆగినట్టు లేదూ!

చెదరని చిత్తరువు... చాగంటి ప్రసాద్‌గారి కథ. బాగా రాస్తారు. కానీ... ఆ మధ్య వీరి కథ సాక్షిలో ఒకటి చదివాను. ఒక యాచకురాలి గురించిన కథ. కథ మొదట్లో ఒక వర్ణన ఉంటుంది. మెట్రో రైలు దిగి రోడ్డు పైకి వచ్చేటప్పుడు మెట్ల మీద.. మానవ అశుద్ధంలాగా ఉంది ఆమె... అన్న అర్థం వచ్చేట్టు ఉన్న వర్ణన! ఆ కథ చదివాక... ఎందుకో రచయిత మీద ఒక ఇబ్బందికరమైన భావన వచ్చింది. బహుశా ఆ కథ వీరిది కాకపోతే క్షమించండి. ఒక రచయిత వాడే ఒక్క ఉపమానం కూడా వారి మీద అంతకు ముందు ఉండే అభిప్రాయాన్ని మారుస్తుంది. ఇకపోతే ఈ కథ... శ్రీను తన ఊరికి కొత్తగా వచ్చిన ఒక అమ్మాయిని ఇష్టపడతాడు. తీరా ఆమె పెళ్ళి చేసుకుందామా అని నేరుగా అడిగే సరికి పారిపోతాడు. కొన్నేళ్ళ తరువాత తన పుట్టినరోజు నాడు మళ్ళీ ఆమెను కలవడానికి ఆ ఊరు వస్తాడు. చెప్పాల్సినదంతా చెపుతాడు. ఆమె కూడా 'నేను నిన్ను అందరి మగాళ్లలాగే అనుకున్నాను... పెళ్ళి అనగానే పారిపోయావని' అంటుంది. కానీ తన కొడుకుకు శ్రీను పేరే పెట్టుకుంటుంది.

వీటితో పాటు శేషు శర్మగారి కథ యువత కే, అలాగే మరో రెండు పిల్లల కథలు ఉన్నాయి. పిల్లల కథలలో సరైన ఎంపిక సింపుల్‌గా బాగుంది. వెంకటేష్‌గారికి అభినందనలు.

**రాంబో**

ఏప్రిల్ 2026 సంచికలో ప్రచురించిన డా. పూడిపెద్ది శేషుశర్మ గారి కథ 'యువత కె' మీద యూట్యూబ్, వాట్సప్‌లలో చాలా స్పందనలు వచ్చాయి. వాటిలో కొన్ని..

ఇప్పటి యువతకి తప్పకుండా ఇలాంటి సెంటర్లు కావాలి. ఆరోగ్యంతో పాటు, ఆలోచనలు మారాలి. ప్రతి వైద్య విద్యార్థి, ప్రతి యువత తప్పనిసరిగా ఈ కథను చదవాలి.

- *డా. శేషుశర్మ గారు చాలా అందంగా రాశారు. వారిలో చాలా ప్రతిభ ఉంది! నేటి యువత జీవనశైలిలో చాలా మూస పద్ధతిలో ఉన్నారు: చదువుకోవడం, చాలా డబ్బు సంపాదించడం, జీవితాన్ని ఆస్వాదించడం. ఇతరులకు సహాయం చేయడం గురించి చాలా తక్కువ మంది ఆలోచిస్తారు. వారిలో ఎవరైనా ఈ కథ చదివితే, ఇతరులకు మరియు సమాజానికి సహాయం చేయడం గురించిన కొన్ని ఆలోచనలైనా వారిలో తప్పకుండా చిగురిస్తాయని నేను అనుకుంటున్నాను. అయితే, చాలా చాలా తక్కువ శాతం మంది మాత్రమే ఈ ఆలోచనలను ఆచరణలో పెడతారు. అలాంటి ప్రయత్నాలలో నిమగ్నమైన ఇతరులకు కొందరు సహాయం చేయవచ్చు. కానీ, ఇతర ఆధునిక కార్యకలాపాలు మరియు వినోదాలలో ఎక్కువగా మునిగిపోయి ఉన్నందున, ఇంత గొప్ప కథలను చదవడానికి ఎంతమంది యువకులు నిజంగా ప్రయత్నం చేస్తారు? అయినప్పటికీ, ఒక్క వ్యక్తి చదివి, స్ఫూర్తి పొంది, సమాజానికి సహాయం చేసినా, అది ఇరుపక్షాలకూ ప్రయోజనకరమే. ఈ ఒక్క వ్యక్తిని ఆదర్శంగా తీసుకునే వారు ఇంకెవరైనా ఉంటారని*

ఆశిస్తున్నాను. మొత్తానికి, ఇది ఒక అద్భుతమైన కథ మరియు చదవడానికి చాలా బాగుంది. ఆస్వాదించాను. పంచుకున్నందుకు ధన్యవాదాలు.

- ఈరోజు ఉదయాన్నే మంచి కథ చదివించారు. విషయం చాలా క్లిష్టమైనది. ఇటు డాక్టర్లని పట్టుకొచ్చారు, అటు చుంచు పోటీలలో (Rat Race) మానసికంగా కృంగిపోతున్న యువతని పట్టుకొచ్చారు, ఇంకొక వైపు సమాజపు నమూనాలలో సాగిపోయే పెద్దవాళ్ళని తీసుకొచ్చారు. అంతా కలిపి మూడు పేజీలలో సమస్యలకు చిన్న పరిష్కారాన్ని ఇవ్వడం చాలా కష్టమైన విషయమే. దీన్ని డాక్టర్ శేషు గారు తను పది మందికి సహాయం చేస్తూ, పది విషయాలని ఒకేసారి చేస్తూ నిజజీవితంలో అలవాటైన నిపుణతను ఈ కథలో చూపించి పరిష్కార మార్గం కూడా చెప్పారు.
- ఈనాటి యువతని పీడిస్తున్న భౌతిక, మానసిక రుగ్మతలను ఉద్దేశించి వ్రాసిన కథ ఇది. ముఖ్యంగా డాక్టర్ వృత్తిలో చేరుతున్న యువతీ యువకుల ఆలోచనా ధోరణి చాలా బాధాకరంగా ఉంది. కోటి విద్యలు.. కూటికి కాకుండా కోట్ల కొరకే అనే తీరు కనిపిస్తోంది.


## కథాపుస్తక పరిచయం




### C బాచ్ అమ్మాయి

స్త్రీల హృదయ పాత్రల మీద చెరిగిపోని ఉక్కు పాదాల ముద్రల గుర్తులే మల్లీశ్వరి గారి కథలు.. అంటూ ఒక్క మాటలో విశ్లేషణ చేయబడిన ఈ 17 కథల సంపుటి వెల రు.100/-.

**ప్రతులకు**

సిక్కోలు బుక్ ట్రస్ట్,
MIG 100, హౌసింగ్ బోర్డు కాలనీ,
జిల్లా పరిషత్ ఎదురుగా,
**శ్రీకాకుళం – 532001**
✆ 99892 65444



# కథాపుస్తక విశ్లేషణ

## ఫీల్ గుడ్ మూవీ కథల సంపుటి 'అందమైన జీవితం'




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగిగా పదవీ విరమణ చేసిన శ్రీ సి.ఎస్. చంద్రశేఖర్‌గారి నుండి వెలువడిన కథాసంపుటి ఇది. వీరు సాహితీలోకానికి సుపరిచితులే. ఎక్కువగా ఈనాడు, సాక్షి వంటి దినపత్రికల ఆదివారం సంచికలలో వీరి పేరు ఎక్కువగా చూశాను. వీరు ఇప్పటివరకు 200 పైగా కథలు, రెండు నవలలు, 60 కవితలు రాశారు. పలు పురస్కారాలు అందుకున్నారు. వారి తల్లిదండ్రులూ, అత్తమామల పేర్ల మీదుగా సాహితీసంస్థలు నెలకొల్పి రచయితలకు పురస్కారాలు అందిస్తూ సాహితీలోకానికి ఇతోధికంగా సేవ చేస్తున్నారు.

పది పెద్దకథలు, ఏడు పోస్టుకార్డు కథలతో ఈ 'అందమైన జీవితం' అనే కథాసంపుటి రూపొందింది. చిన్న చిన్న అంశాలను కథాంశాలుగా ఎంచుకుని కథలు రాయడంలో వీరు సిద్ధహస్తులు. వీరి కథలు క్లిష్టమైన కథాంశాలతో ఉండవు. కథ చివరికి వచ్చేసరికి సుఖాంతమైన ముగింపులే ఉంటాయి. చాలా సరళమైన వాక్య సంవిధానం, ఆసక్తికరంగా ఉండే కథారంభం, అంతే సరళమైన సుఖాంతమైన ముగింపు వీరి కథల్లో ఉంటాయి.

కాపురంలో వచ్చే చిన్న చిన్న వాటిని అర్థం చేసుకోకుండా పచ్చని సంసారాన్ని బొగ్గుచేసుకునే వాళ్లకు, సంసారాల గురించి ఆలోచించాల్సిన తీరును తెలియజేసే కథ అందమైన జీవితం. దీన్నే కథాసంపుటికి టైటిల్‌గా తీసుకున్నారు.

భర్తది మంచి మనసు. అందరికీ సహాయం చేయడం మాత్రమే ఆయనకు తెలుసు. తన నుండి సాయం పొందినవారి ప్రవర్తన ఆయన మనసును కష్టపెడుతుంది. ఇది అర్థమైన భార్య ఏం చేస్తుంది అనేది "మావారి మంచితనం' అనే కథలో తెలుసుకోవాల్సిందే! మరో సాదాసీదా కథ 'నీ జతగా నడవాలని'. 'ఓ వర్షం కురిసిన రాత్రి' ట్విస్ట్ చివరలో ఉన్న ఒక చిన్నపాటి కథ.

అతను ఈ లోకంలో లేని అమ్మాయికి తన ప్రేమసందేశాలు పంపుతూ, ఏ రోజుకైనా సమాధానం వస్తుందని ఎదురుచూసేవాడు. చివరకు సమాధానం రాదని తెలిసి, తన పట్ల ఆ అమ్మాయికి ప్రేమ లేదేమో అని భావించి కన్నీరు మున్నీరు అవుతూ... సందేశాలు పంపడం ఆపేస్తాడు. తన కొడుకుపై ప్రేమే లేకపోతే మొదటి సందేశం రోజునే చెప్పి ఉంటే వాడికి ఈ బాధ ఉండేది కాదు కదా అని.. విషయం తెలుసుకోవడానికి ఆ అమ్మాయి వద్దకు అతని తల్లి వెళుతుంది. కొడుకు సందేశాలు రాసినదెవరికి? వాటిని అందుకున్నదెవరు? ఇదే 'విచిత్రబంధం' కథ! వీటికి తోడుగా మరి కొన్ని పెద్ద , చిన్న కథలు ఉన్నాయి ఈ పుస్తకంలో..

ఓ మూడు గంటలు. సమయం గడవడం లేదా? ఈ కథాసంపుటి చేతిలోకి తీసుకోండి. విసుగు పుట్టనివ్వకుండా సమయం సాగిపోతుంది! ప్రయత్నిస్తారా?

**రాంబో**

# జీవనతరంగాలు

**జాస్తి రమాదేవి**

✆ 9391555364

***ఆవిడ గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గరున్న చెట్టు కింద కూర్చున్న వాళ్ళని ఆప్యాయంగా పలకరిస్తూ, కప్పుల్లో టీ పోసి ఇస్తోంది. బిస్కెట్లు ఇస్తోంది. పేషెంట్స్ ఉన్న బెడ్స్ దగ్గరకు వెళ్ళి వాళ్ళ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటోంది. టీ, బ్రెడ్ ఇచ్చి, కూర్చుని తినమని ఆప్యాయంగా అంటోంది. ఆ మొహంలో ఇప్పుడు చిరునవ్వు స్వేచ్ఛను పొందింది. పేషెంట్ టీ తాగుతుంటే చంటిబిడ్డను ఎత్తుకుని సముదాయిస్తోంది. ఎందుకో ఆమె కేరక్టర్ చిత్రంగా ఉంది.***

ఉదయం తొమ్మిది దాటితే ఒంటరిగా ఇంట్లో మిగిలిపోతాడు జగన్నాథం !

కొడుకూ, కోడలూ ఉద్యోగాలనీ, మనవలు స్కూళ్ళనీ వెళ్ళిపోతారు. ఆదివారాలు వాళ్ళింకా బిజీగా ఉంటారు. పార్టీలనీ, గెట్టుగెదర్‌లనీ ఎవరి హడావిడిలో వాళ్ళుంటారు.

భార్య ఉన్నప్పుడు కాలం వేగంగా పరుగెత్తుతున్నట్లుండేది. ఆమె లేని లోటు అడుగడుగునా కనబడుతూనే ఉంటుంది. ఒకప్పుడు పనుంటే మార్కెట్ కి వెళ్ళొచ్చేవాడు. ఇప్పుడు వచ్చే దారిలో పెద్ద మాల్ పెట్టారని, నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయలూ, పళ్ళూ కూడా తెచ్చేసుకుంటున్నారు కొడుకూ కోడలూను.

ఎవరి పనుల్లోకి వాళ్ళు పరుగెత్తారు. జగన్నాథం ఎదురింటి గేటు వైపు చూస్తూ కూర్చున్నాడు. ఈమధ్య కాలంలో అతనికి అదో వ్యాపకం అయిపోయింది.

అతని నిరీక్షణ ఫలించి ఎదురింటి గేటు తీసిన చప్పుడైంది. ఆ ఇంట్లో కొన్ని నెలలుగా అద్దెకు ఉంటోంది ఆమె! ఒంటరిగా ఉంటోంది. ఆమె కోసం ఎవరైనా రావడం గానీ, కొన్ని రోజులు ఎటైనా వెళ్ళిరావడం గానీ తను చూడలేదు. గవర్నమెంట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేసి రిటైర్మెంట్ తీసుకుందని, ఆమెకి ఎవరూ లేరని... పనిమనిషి ద్వారా తెలిసిన సమాచారం!

ఆమె గేటు తీసుకుని బైటికి వచ్చింది. ఎప్పటిలాగే ఓ చేతిలో పెద్ద ఫ్లాస్క్, మరో చేతిలో పాలిథిన్ కవర్ లోంచి కొన్ని పేపర్ కప్పులు, కొన్ని బిస్కెట్ పేకెట్స్, బ్రెడ్ పేకెట్స్ కనబడుతున్నాయి.

ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఆవిడ నడుచుకుంటూ వెళుతుంది. అసలు ఆవిడ ఎక్కడికి వెళుతుందన్నది ఎవరూ పట్టించుకోరు. ఆమెకూడా ఎవర్నీ పట్టించుకోదు. మనిషి బక్కపలచగా గట్టిగా గాలేస్తే ఎగిరిపోయేలా ఉంటుంది. చామనచాయ రంగు. నాసిరకం చీరలు కడుతుంది. ఏ రోజూ చీరకు సరిపడే మేచింగ్ జాకెట్టు వేసుకోదు. మొహంలో నవ్వు గానీ, ఎలాంటి ఫీలింగ్ గానీ కనబడనివ్వదు.




ఎవరితో ఎలాంటి సంబంధాలు లేకుండా ఎలా బతుకుతుందో అర్థం కాదు జగన్నాథానికి!

ఆమె గేటుదాటి రోడ్డుమీద గబగబా నడుచుకుంటూ పోతోంది.

“అయ్యగారూ! గిన్నెలుంటే కాలీ సేసెయ్యండి. రేపు పనికి రానండీ. మా అత్తాళ్ళూరు ఎల్తన్నాను” కంగారు పెడుతోంది పనిమనిషి కమల. జగన్నాథం వంటగదిలోకి నడిచాడు.

"నెలకోసారి వెళుతుంటావు! కోడలు చాలా ఇబ్బంది పడుతోంది!"

"మా అత్తాళ్ళూరు ఎల్తే రేసను బియ్యం దొరుకుతాయయ్యగారూ!" కమల ఆరాటం అర్థం అయ్యాక, ఇంకేం మాట్లాడలేకపోయాడు జగన్నాథం.

అతనికి ఎదురింటామె గుర్తొచ్చింది.

"కమలా! మన ఎదురింట్లో అద్దెకుండే ఆవిడ రోజూ పెద్ద ప్లాస్కుతో ఎక్కడికి వెళ్తుంటుందో నీకు తెలుసా?"

"ఆయమ్మ దర్మాసుపత్రి కాడ ఉండేటోల్ల కోసం టీ అట్టుకెల్తుందయ్యా! ఓపాలి మా పిల్లోడికి వొల్లు బాగోక ఆసుపత్రికి తీస్కెల్లినప్పుడు సూసేను. నాక్కూడ 'టీ' ఇచ్చిందయ్యా! డబ్బులియ్యబోతే తీసుకోనేదు. ఆయమ్మ ఎవల్ల దగ్గిరా తీసుకోదయ్యా!"

కమల చెప్పింది వింటే, ఆశ్చర్యం వేసింది. డబ్బులు తీసుకోదట! ఎందుకో? ఏం ఆశించో?

మర్నాడు ఆమె బయలుదేరగానే ఇంటికి తాళం వేసి బయలుదేరాడు. తనను వెంబడిస్తున్న అతన్ని చిరాగ్గా చూసింది ఎప్పటిలాగానే!

"ఎందుకు నావెంట పడ్డారు?" నిందారోపణ చేసింది.

"నేను మీ వెంట పడ్డం ఏంటండి? ఎవరన్నా వింటే నవ్విపోతారు. ఈ రోడ్డు అందరిదీ!"

ఆమె అటుగా వెళుతున్న ఆటోని పిల్చి ఎక్కి కూర్చుంది. ఆటో కదలబోతుంటే చేయి అడ్డం పెట్టి, అతనూ ఎక్కి కూర్చుని, "గవర్నమెంట్ హాస్పిటల్‌కి పోనీ" అన్నాడు.

ఆమె కోపంగా చూస్తుంటే చెప్పాడతను, "గవర్నమెంట్ హాస్పిటల్ కూడా అందరిదీ!"

ఆమె మొహం తిప్పుకుంది.

కమల చెప్పినట్లుగానే ఆవిడ గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గరున్న చెట్టు కింద కూర్చున్న వాళ్ళని ఆప్యాయంగా పలకరిస్తూ, కప్పుల్లో టీ పోసి ఇస్తోంది. బిస్కెట్లు ఇస్తోంది. పేషెంట్స్ ఉన్న బెడ్స్ దగ్గరకు వెళ్ళి వాళ్ళ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటోంది. టీ, బ్రెడ్ ఇచ్చి, కూర్చుని తినమని ఆప్యాయంగా అంటోంది. ఆ మొహంలో ఇప్పుడు చిరునవ్వు స్వేచ్ఛను పొందింది. పేషెంట్ టీ తాగుతుంటే, చంటిబిడ్డను ఎత్తుకుని సముదాయిస్తోంది. ఎందుకో ఆమె కేరక్టర్ చిత్రంగా ఉంది.

నాలుగు రోజుల తర్వాత జగన్నాథం పార్కుకెళ్ళి తిరిగి వచ్చేసరికి, ఆమె శారదతో మాట్లాడుతూ కనబడింది. జగన్నాథం కంగారుపడ్డాడు.

"మావయ్యా! చింటూగాడికి హై ఫీవర్ వచ్చేసింది. గేటు ముందు కూర్చుని ఉన్నాడంట. సమయానికి ఆంటీ చూసారు కాబట్టి నాకు ఫోన్ చేసారు." శారద గబగబా చెబుతోంది.

ఆమె వైపు చూస్తూ "థాంక్స్" అన్నాడు. ఆమె విననట్టే వెళ్ళిపోయింది.

కాలం కొన్ని పువ్వుల్ని రాల్చుకుంటూ పోతుంది. అదే చోట చిగురులోంచి మొగ్గలు తొడుగుకుంటూ వచ్చి, వికసించి ప్రకృతికి అందాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తాయి.

చంటికి జ్వరం తగ్గింది. 'ఆవిడకి థాంక్స్ చెప్పి వద్దాం రా' అంటూ చిటని తీసుకుని ఎదురింటి వైపు నడిచాడు జగన్నాథం. తలుపులు లోపల గడియపెట్టి ఉంది. తలుపు రెండుసార్లు చప్పుడు చేస్తే, ఆవిడ వచ్చి తలుపు తీసింది. ఎదురుగా నిలబడ్డ అతన్ని చూసి 'ఏంటి?' అన్నట్లుగా ఎప్పటిలాగే చిరాగ్గా మొహం చిట్లించింది.

"థాంక్స్ చెప్పాలని" కంగారుగా అంటుంటే, "మా తాతయ్య మీకు థాంక్స్ చెప్పాలి రా అని తీసుకొచ్చాడు!" అన్నాడు చిటూ.

కంగారుగా తలూపాడు జగన్నాథం. "పర్లేదు లే!" అంటూ ఆమె చిటూ బుగ్గలు నిమిరింది.

ఇంక వెళ్ళమన్న ట్లుగా జగన్నాథం వైపు గుర్రుగా చూసింది.

చింతలతో పాటు నాలుగు అంగల్లో ఇంటికొచ్చి పడ్డాడు.

మర్నాడు ఆమె ఇంటికి తాళంకప్పదే వేళ్ళాడుతూ కనబడింది. ఆమె కనబడక ఎందుకో ఓ విధమైన బెంగ మొదలయ్యింది అతనిలో! ఆమెను గమనించడం తనకో కాలక్షేపం అయిపోయింది. నాలుగు రోజులు కునుకు పాట్లతో గడిచేయి!

ఐదో రోజు ఎదురింటి గేటు కిర్రుమని చప్పుడు చేసింది. మిట్టమధ్యాహ్నం వేళ నిద్రలో ఉన్న జగన్నాథం ఉలిక్కిపడ్డాడు. గబగబా వరండాలోకి వచ్చి చూసాడు.

ఆమే... అతనికి చాలా సంతోషంగా అనిపించింది. చూసి చాలా కాలం అయిపోయినట్లు అనిపించింది. షర్ట్ వేసుకుని గబగబా ఎదురింటి వైపు నడిచాడు. అతన్ని చూడగానే అదే చిరాకు ఆమెలో!

"ఏమైంది? నాలుగు రోజులు ఏమైపోతారు?" చనువుగా అడిగేరు.

ఓ చూపు చూసి లోపలికి వెళ్ళి దబ్బునమని తలుపేసుకుంది.

చిత్రంగా అతనికి కోపం రాలేదు. ఏడాది క్రితం ఎటో ఎగిరిపోయిన కోయిల తిరిగొచ్చి తియ్యని రాగం ఆలపిస్తుంటే గుమ్మమెంత ఆనందం!

ఆ సాయంత్రం ఆమె వచ్చిన విషయం కోడలితో ఎగ్జయిట్మెంటుగా చెప్పాడు.

"హాస్పిటల్లో ఓ అమ్మాయికి డెలివరీ అయిందట. మగవాళ్ళని ఆ వార్డులోకి అనుమతించరంట. పాపని పట్టుకోడానికి వెళ్తున్నానని నాతో ఆంటీ చెప్పింది మావయ్యా! ఆంటీకి అలవాటే ఇవన్నీ!" నవ్వుతూ చెప్పింది శారద.

"అయ్యగారూ! మా పిల్లగాల్లు బడి అయ్యేక మట్టిలో గట్టా గోలీలాట ఆడతా ఉంటారు. మీరు సదూకున్నోరు, కాలీగానే ఉంటారు కదండి! నాలుగచ్చరాలు సెప్పొచ్చు గదండి!" అని ఓసారి కమల అడిగినప్పుడు, ఆమెమీద కోపంతో ఎగిరేడు. "నేను పనీపాటా లేనోణ్ణా? ఇంకా నయం! నీతోపాటు అంట్లగిన్నెలు తోమడానికి సాయం రమ్మనలేదు!"

కమల తన కాళ్ళమీద పడిపోయింది. "సెమించండయ్యా! తెలవక వాగేను!" అంటూ చెంపలు వాయించుకుంది.

చాలారోజులు కోపంగానే చూసేడు కమలని! ఓ స్కూలు మాస్టారుగా రిటైరయి, ఇంట్లో కాలక్షేపం లేదంటూ కొట్టుకునే బదులు కమల పిల్లలకు నాలుగక్షరాలు నేర్పిస్తే తప్పేముంది? వేధించే ప్రశ్నకు సమాధానం దొరికింది.

కమల పని ముగించుకుని వెళ్తుంటే వెనక్కి పిలిచి చెప్పాడు జగన్నాథం .

"కమలా! సాయంత్రం నీ పిల్లలు బడి నుంచి ఇంటికి రాగానే తింటానికి ఏమైనా పెట్టి, నా దగ్గరికి తీసుకురా! చదివిస్తాను!"

కమల కంగారుగా చూస్తుంటే, మరోసారి నిజమే అన్నట్టు నొక్కి చెప్పాడు.

ఇప్పుడు జగన్నాథానికి సాయంత్రం కోసం ఉదయం నుండి ఎదురుచూడ్డం అలవాటుగా మారింది.

ఎదురింటి గేటు చప్పుడుకు జగన్నాథం అటు చూసాడు. ఆమె తన చేతిలో ఉన్న బరువైన టీ ఫ్లాస్క్ కింద పెట్టి, గుప్పెట బిగించి బొటనవేలు పైకి లేపి థమ్సప్ స్టైల్లో చూపిస్తూ మొదటిసారి నవ్వింది. అతనికి సంతోషంగా అనిపించింది. ఆమె ఫ్లాస్క్ చేతిలోకి తీసుకుని ముందుకు నడిచింది. అప్పుడప్పుడు అతను ఆమెతో కబుర్లు చెబుతూ గవర్నమెంట్ హాస్పిటల్‌కి తోడుగా వెళ్తాడు.

"ఎందుకీ ధర్మసేవ? కష్టంగా లేదా?" అనడిగేడు ఓసారి.

"వాళ్ళంతా నా బంధువులు! నన్ను చూడగానే సంతోషంగా పలకరిస్తారు. మర్నాడు నేనెప్పుడు వస్తానా అని ఎదురుచూస్తారు. ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు కనుక్కుంటారు. నాకు బాలేదంటే బాధపడతారు. వాళ్ళంతా ఎక్కువరోజులు ఉండిపోరు కానీ, ఎవరికుంటారు ఇంతమంది ఆత్మబంధువులు?" ఆమె ఆనందంలోంచి ఆణిముత్యాలు కళ్ళలో నాట్యం చేస్తుంటాయి. అప్పుడామె చాలా అందంగా కనిపిస్తుంది.

ఒక్కోసారి అతనిలో చిలిపితనం బైటికొస్తుంది.

"నాకు పెన్షన్ వస్తుంది. నీకూ పెన్షన్ వస్తుంది. నేను, నువ్వు ఒంటరిగా ఎందుకుండాలి?" అంటాడు.

"ఇప్పుడు నాకలాంటి ఉద్దేశాలేం లేవు!" ఆమె చిర్రుబుర్రులాడుతుంది. అతను నవ్వుకుంటాడు. ఆమె అలుగుతుంది. అతను ఐస్‌క్రీమ్‌తో బతిమాలుకుంటాడు. వర్షం వచ్చినరోజు గొడుగు పడతాడు. ఆమె విసుక్కుంటుంది. అతను వానచినుకుల్తో ఆమెని ఆట పట్టిస్తాడు.

రేపటి కలలకు తెరతీస్తూ సూర్యుడు ఉదయించే వేళ... అతను ఆమె కోసం కలవర పడుతుంటాడు. జీవితం ఇంత బాగుంటుందని అతనికీ మధ్యనే అర్థమవుతోంది.

"నాన్న ఈ మధ్య చాలా హేపీగా ఉంటున్నాడు కదా!" కోడలితో కొడుకు అనడం విన్నాడు.

కోడలి సమాధానం ఏమిటని ఎదురుచూసాడు జగన్నాథం.

"సువర్ణ ఆంటీ పరిచయం ఆయనలో మార్పు తెచ్చింది. ఆయన ఓ మంచి ఫ్రెండ్‌ని సంపాదించుకున్నారు. ఒంటరిగా ఉండటం మనిషికి చాలా దిగులుగా ఉంటుందండీ. ఇప్పుడిప్పుడే ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటున్నారు. ఆయన హేపీగా ఉండటమేగా మనక్కావాలి!" అంటోంది శారద.

"అమ్మ చనిపోయాక, ఆయన మూడీగా మారిపోయారు. ఇప్పుడిప్పుడే ఆయనలో మునుపటి నాన్న కనిపిస్తున్నారు. ఆయన హేపీగా ఉన్నారు మనకది చాలు!"

'ఎవరికుంటారు ఇంతమంది ఆత్మ బంధువులు?' ఆమె మాటలు గుర్తొచ్చాయి.

సూర్యుడు ఎప్పటిలాగే తూర్పుదిక్కులోంచి బైటికొచ్చేడు. ఆమె కనబడగానే, 'శుభోదయం' ఆమెకి వినబడేలా గట్టిగా చెప్పేడు. ఆమె చిరునవ్వుతో స్వాగతించింది.

రేపటిప్రశ్నకు సమాధానం వెతుక్కుంటోంది కాలం!

# కొత్త ఆలోచన

## తోట సుబ్రహ్మణ్యం

*మొన్నామధ్య అక్క వాళ్ళ మావగారికి అర్ధరాత్రి సడెన్‌గా గుండెల్లో నొప్పొస్తే, అత్తగారు యోర్‌కి కాల్ చేస్తే, కొన్ని నిమిషాల్లోనే వచ్చి, హాస్పిటల్‌కి తీసుకెళ్ళి వైద్యం చేయించారట. సొంత మనుషుల్లా చూసుకున్నారట. కొడుకు దగ్గర లేడనే బాధే కలగనివ్వలేదట. ఆవిడ ఫోన్ చేసి చెబుతుంటే ముందు నమ్మలేకపోయాము.*

"క్యాంపస్ ఇంటర్వ్యూ ఏమైంది?" నాన్న ఫోన్‌లో అడిగారు.

"సెలెక్ట్ అయ్యాను. ఆరుమాసాలు మనదేశంలో పనిచేసిన తర్వాత అబ్రాడ్ వెళ్ళాలట! కనీసం ఐదేళ్ళు పనిచేస్తానని సంతకం కూడా పెట్టాలన్నారు."

"పెట్టావా?"

"పెట్టలేదు."

"ఏం, ఎందుకు పెట్టలేదు? ఏ దేశానికి వెళ్ళాలన్నారేంటి?"

"యూఎస్ఏ."

"మరేమీ? నీకేమన్నా పిచ్చా? అమెరికా వెళ్ళే అవకాశాన్ని వదులుకోవడమేంటిరా?"

"అక్కడా కాళ్ళ కింద భూమి, తలపైన ఆకాశమే ఉంటుంది. మీ కాలం వాళ్ళులా అదేదో భూతలస్వర్గమనే భ్రమలో ఇప్పుడెవరూ లేరు నాన్నగారూ!"

"శాలరీ బాగుంటుంది కదా! మనదేశంలో పనిచేస్తే అంత రాదు కదా!"

నాన్నకు నేటి పరిస్థితిని ఎలా వివరించాలో తెలియడం లేదు. ఆయన ఏం తెలియని వ్యక్తి కాదు. బాగా చదువుకున్నారు. పెద్ద పెద్ద ఉద్యోగాలకు ప్రయత్నించారు. అప్పట్లో ఆయన అమెరికా వెళ్ళాలని కలలు కనేవారట. చివరకు సెకండరీ గ్రేడ్ టీచర్‌గా జీవితం మొదలుపెట్టారు. ఇప్పుడు హైస్కూల్ టీచర్‌గా రిటైర్ కాబోతున్నారు. చాలా మంది ఉపాధ్యాయుల్లానే ఉద్యోగం వచ్చిన తర్వాత జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవడం మానేసినట్లున్నారు. నేటి ప్రపంచ పరిస్థితి తెలుసుకుంటున్నట్లు లేరు. అమెరికాలో ఉన్న భారతీయులంతా ఆనందంగా జీవిస్తున్నారనుకుంటున్నారు.

“ఓ స్టార్టప్ కంపెనీ పెట్టాలనుకుంటున్నాను” తిడతారని భయపడుతూనే చెప్పాను.

“కడుపులో నీళ్ళు కదలకుండా చేసుకునే ఉద్యోగం వద్దనుకుని, ఏమవుతుందో తెలియని వ్యాపారం చేస్తానంటున్నావు. స్టార్టప్ స్టార్ట్ చేయడానికి నీ దగ్గర నాలెడ్జ్ ఉందేమో గానీ, మన దగ్గర నగదు లేదు కదా! ఎలాగో మొదలుపెట్టినా, ఫలితం తలకిందులైతే, నీ పరిస్థితేంటి? ఓ ఫెయిల్యూర్ పర్సన్‌గా ఫీలైపోయి డిప్రెషన్‌లోకి వెళ్ళిపోతే, జీవితం సర్వనాశనమైపోతుంది. నేను చెప్పవలసింది చెప్పాను. తర్వాత నీ ఇష్టం!” అన్నారు.



అదంతా నేనాలోచించాను. మా దగ్గర డబ్బు లేదు కాబట్టి, ఏదైనా కంపెనీతో టై అప్ అయ్యి, దానికి సిస్టర్ కంపెనీగా స్టార్ట్ చేయాలన్నది నా ఉద్దేశ్యం! అది అంత సులభం కాదు. అయినా ప్రయత్నించాలనుకుంటున్నాను. ఈ విషయం నాన్నకు చెబితే, ‘టైం వేస్ట్ తప్ప, ఉపయోగం ఉండదు’ అని మందలిస్తారు. అందుకే నిశ్శబ్దంగా ఉండిపోయాను.

రెండు మూడు క్షణాలు నా నిశ్శబ్దాన్ని భరించి, “బాగా ఆలోచించుకుని, మంచి నిర్ణయం తీసుకో!” అని ఫోన్ కట్ చేశారు.

నాకు నా కెరీరూ ముఖ్యమే, నా ఆశయమూ ముఖ్యమే! రెండోది సాధ్యమవాలంటే, మొదటిది బాగా బిల్డప్ చేసుకోవాలి.

ఏది మొదలుపెట్టాలన్నా డబ్బుతో ముడిపడి ఉందన్న విషయం నాకు తెలియనిది కాదు. అందుకే, మరుసటి వారం మా బ్యాచ్‌కి జరిగిన మరో క్యాంపస్ ఇంటర్వ్యూకి అటెండయ్యాను.

అనంతరం ఇంటికి వెళ్ళాను.

"ఏం నిర్ణయించుకున్నావు?" అన్న నాన్నగారి ప్రశ్నకు, రెండో ఇంటర్వ్యూ లో నేను సంపాదించుకున్న జాబ్ గురించి చెప్పాను.

ఆయన దాని వివరాలు అడిగారు.

అంతా విని, "మూడు లక్షల ప్యాకేజా? అంటే... నెలకు పాతిక వేలా? ఈరోజుల్లో ఇదొక జీతంరా? పైగా, ఇంజనీరింగ్ చేసిన వాడికి!" అంటూ ఆశ్చర్యంతో పాటు అసహనాన్ని కూడా వ్యక్తం చేశారు.

నేను నిశ్శబ్దంగా ఉండిపోయాను.

"దేశం వదిలి వెళ్ళడానికి నీకంత అభ్యంతరమేంటి? లక్షల జీతం వద్దనుకుని వేల జీతానికి పనిచేసే అవివేకిని నిన్నే చూస్తున్నాను" కోప్పడ్డారు నాన్న.

"జీతం ఎంతన్నది ఆలోచించలేదు, జీవితానికి ఎలా ఉపయోగపడుతుందని ఆలోచించాను" అన్నాను.

ఆశ్చర్యంగా చూశారు నా వైపు. నేను తల దించుకుని అక్కడ నుంచి మెల్లగా పక్కకు వెళ్ళాను.

నాన్న నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు.

సాయంత్రం ఐదుగంటలకు డాబామీద కూర్చుని ఆలోచిస్తున్నాను. నాకు రాబోయే జీతం ఖర్చులకు సరిపోతుంది. నేననుకున్నది చేయడానికి డబ్బు పోగు చేయడానికి పెద్దగా ఏం మిగలదు. కాకపోతే, నా స్టార్టప్ గురించి పెద్దపెద్ద పెట్టుబడిదారులతో మాట్లాడే అవకాశముంటుంది.

నాన్న డాబా మీదకు వచ్చారు. నేను లేచి నించున్నాను.

"కూర్చో!" అంటూ నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నారు. వెనక కుర్చీలో నేను కూర్చున్నాను.

నాన్న చెప్పడం మొదలుపెట్టారు. "జీవితానికి ఉపయోగపడుతుందన్న మాట బాగుందిరా! అవును జీవితమే బాగోవాలి. డబ్బు ఎంతొస్తుంది, ఆస్తి ఎంత సంపాదించాం అన్న వాటి కన్నా జీవితం ఎంత బాగా గడించింది, ఎంత సంతృప్తి పొందామనేవే ముఖ్యం. అమెరికాలో ఉన్న భారతీయులంతా ఆనందంగా లేరని తెలుసు. అక్కడ రోజురోజుకూ పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో ఎంత సతమతమౌతున్నారో కూడా తెలుసు..." ఇంకా ఏదో చెప్పబోతూ నా వైపు చూసి ఆగారు.

నా ముఖంలోని ఆశ్చర్యాన్ని ఆయన వేరేగా అర్థం చేసుకున్నారు. "ఓహో ద్రవ్యోల్బణమంటే అర్థం కాలేదా? అదేరా... ఇన్ఫ్లేషన్! ఇంగ్లీష్ మీడియంలో చదివినా మాతృభాషను వదిలేయకూడదు. తెలుగు పత్రికలు కూడా చదవాలి, తెలుగుపదాలను కూడా తెలుసుకోవాలి!" అన్నారు.

ఆయన అప్డేటెడ్‌గా లేరని నేనుకున్నాను కానీ, నా తరంతో సమానంగా పయనిస్తూ, మేమింకా ఏం నేర్చుకోవాలో ఆయన చెబుతుంటే... నా ఆశ్చర్యం మరింత ఎక్కువైంది. అదే ఆయనతో అన్నాను.

"సోషల్ మీడియాను ఏ తరగతి విద్యార్థులు ఎలా ఉపయోగించుకోవాలో, ఏ వెబ్‌సైట్లను టచ్ చేయకూడదో బోధించే నేను... వినియోగించుకోవలసిన సైట్లను వినియోగించుకోకుండా ఎందుకుంటాను?" అన్నారు.

నేను ఆయన్ని తక్కువ అంచనా వేసినందుకు సిగ్గుపడ్డాను. "మీరు చెప్పినట్లుగా అమెరికాలో ఇన్ఫ్లేషన్ చాలా ఎక్కువగా ఉంది. ఎంత పెద్దజీతమైనా అక్కడ ఖర్చులకు పోగా చాలా కొంచెం ఎమౌంటే సేవింగ్ చేయగలుగుతున్నారట. జీతంలో చాలా భాగం ఇంటద్దెకు పోతుందట" అన్నాను.

"అవును, మిగిలిన ఆ కొంచెం ఇక్కడకు పంపితే, ఇక్కడ ద్రవ్యోల్బణం పెరుగుదల తక్కువగా ఉంది కాబట్టి, పెద్ద మొత్తంలో సేవింగ్‌గా మారుతుంది. వేటిమీదైనా ఇన్వెస్ట్ చేస్తే మంచి ఆస్తి అవుతుంది. ఒక్క అమెరికాలోనే కాదు, చాలాదేశాల్లో ద్రవ్యోల్బణం పెరుగుదల మన దేశంతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉంది. గల్ఫ్ దేశాల్లోని యుద్ధవాతావరణం కారణంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరిగిపోయి, ప్రపంచ వ్యాప్తంగా వస్తువుల రవాణా ఖర్చు పెరుగుతోంది. తద్వారా వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. మనదేశం ఇటువంటి పరిస్థితుల ప్రభావాన్ని ఎదుర్కొంటూ కూడా ఆ పెరుగుదల మరీ ఎక్కువగా లేకుండా నిలదొక్కుగోగలుగుతోంది. రష్యా, ఉక్రెయిన్ దేశాలలో అయితే, వాటిమధ్య జరుగుతున్న యుద్ధం వల్ల ఆ పెరుగుదల చాలా ఎక్కువగా ఉంది."

ధరల పెరుగుదలే ద్రవ్యోల్బణమవుతుందని నాకు తెలియజేయడానికి ప్రయత్నించారని నాకర్థమైంది. సుమారు ముప్పై ఏళ్ళ ఉపాధ్యాయ వృత్తి అనుభవం... వీలైనప్పుడల్లా బోధించడానికి ప్రయత్నిస్తుందని కూడా తెలుసుకున్నాను.

"అందుకే, అమెరికా వెళ్ళాలనుకోలేదు నాన్నగారూ! అక్కడ మనవాళ్ళు అనిశ్చిత పరిస్థితులను చాలా ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉద్యోగభద్రత లేకపోవడం ప్రధాన సమస్యగా ఉంది" అన్నాను. తెలుగు నాక్కూడా బాగానే తెలుసు అన్న భావనను చూపించడం అనుకోకుండా జరిగిపోయింది.

"ఏమైనప్పటికీ అక్కడ ఉద్యోగం చేస్తున్న వారు... ఇక్కడ ఆస్తులు కూడబెడుతున్నారన్నది నిజం. దాని వల్ల మనదేశ ఫారిన్ ఎక్స్ఛేంజి నిల్వలు పెరిగి, మన రూపాయి విలువ పడిపోకుండా ఉండడానికి దోహదపడుతోందన్నది కూడా వాస్తవం. పుణ్యం, పురుషార్థం రెండూ కలిసొస్తున్నట్లు ఉంది కదా!"

"అందులో బ్రెయిన్ డ్రైన్ జరగడం కూడా ఉంది కదాండీ! తద్వారా దేశం నష్టపోతోంది. మన మేధావులు మన దేశంలోనే ఉండి, వారి మేధస్సును ఇక్కడే పెట్టుబడిగా పెడితే... వారు, వారితో పాటు దేశమూ అభివృద్ధి చెందవచ్చన్నది నా అభిప్రాయం" అన్నాను.

"ఇంతకీ నీ స్టార్టప్ కంపెనీ ఏంటి?" నాన్నగారు ఆత్రుతగా అడిగారు.

"ఇంకా ఫుల్ ప్లెడ్జడ్‌గా అనుకోలేదు, తర్వాత చెబుతానండీ!" అన్నాను.

సక్సెస్ అయ్యేవరకూ చెప్పడానికి జంకుతున్నానని ఆయనకు అర్థమైందని ఆయన ముఖకవళికలు చెబుతున్నాయి. “స్విగ్గీ, జొమోటాలాంటివే సక్సెసయ్యాయి. ఎటువంటి విపత్కర పరిస్థితులూ వాటి విజయాన్ని అడ్డుకోలేకపోయాయి. దేశ ఆర్థికాభివృద్ధిలో స్వల్పంగానైనా వాటి భాగస్వామ్యాన్ని చూపెట్టగలుగుతున్నాయి. మొదట విన్నప్పుడు హాస్యాస్పదమైన ఆలోచనగా అనిపించింది కానీ, బాగా సక్సెసైంది. కాబట్టి, దేన్నీ తక్కువ అంచనా వేయలేం!” అంటూ లేచి, కిందికి బయలుదేరారు.

ఆయన మాటలు నాలో కాన్ఫిడెన్స్‌ని పెంచాయి. అంతేగాక, ఆయన సపోర్ట్ కూడా లభించిందన్న ఆలోచన నాకు చాలా ఆనందాన్ని కలిగించింది.

తర్వాత నేను కూడా కిందికి వెళ్ళాను. అమ్మ చాలా ఆప్యాయంగా, “భోంచేస్తావా?” అని అడిగింది. అమ్మ ఎప్పుడూ ప్రేమగానే అడుగుతుంది. కానీ ఈరోజది ఎక్కువ కనిపించింది.

నేను నా గదికి వెళుతుంటే, “మీ నాన్న నీ తెలివితేటలకు తెగ మురిసిపోతున్నారు, ఏం చేయబోతున్నావేంటి?” అంది.

“ఒక్కమాటలో చెప్పేది కాదు, తర్వాత చెబుతాన్లే!” అన్నాను.

“ఆయనకే చెప్పలేదట, నాకు చెబుతావేంట్లే!” అంటూ వంటగది వైపు నడిచింది.

“అది కాదమ్మా...” అంటుండగా అమ్మ అప్పటికే వెళ్ళిపోయింది.

ఆ రాత్రి ముగ్గురం కలిసి ఆనందంగా భోంచేశాం! నేనేదో సాధించబోతున్నానన్న నమ్మకం అమ్మానాన్నల ముఖాల్లో కనిపించింది.

‘వారి నమ్మకాన్ని నిలబెట్టుకోగలనా?’ అన్న కొత్త భయం నాలో మొదలైంది.

రెండు రోజుల తర్వాత బయలుదేరి హైదరాబాద్‌కు వెళ్ళి, ఉద్యోగంలో చేరాను.

★★★

సంవత్సరం గడిచింది. మధ్యలో ఒక్కసారి మాత్రమే ఇంటికి వెళ్ళగలిగాను.

రోజూ నాన్న ఫోన్ చేస్తారు. స్పీకర్‌లో పెట్టి, అమ్మానాన్నా ఇద్దరూ మాట్లాడతారు.

ఒకరోజు మాట్లాడుతూ “ఏదో యోర్ సంస్థట. ఒక అమ్మాయి, అబ్బాయి వచ్చారు. మా ఆరోగ్య విషయాలన్నీ అడిగి తెలుసుకున్నారు. చాలా ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. నెలకు రెండుసార్లు వస్తారట. అవసరమైనప్పుడు బ్లెడ్ టెస్టులు నిర్వహించి రిజల్ట్స్ వాట్సాప్ చేస్తారట. చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు మందులు ఆ సంస్థే పంపుతాదట. మేము వాడే రోజువారి మందులు నెలనెలా వారే తెచ్చి ఇస్తారు. ఏ సమయంలో ఫోన్ చేసినా వచ్చి మెడికల్ అసిస్టెన్స్ కలిగిస్తారట. అదొక డ్యూటీలా కాకుండా, కుటుంబ సభ్యుల్లా ఆత్మీయంగా నిర్వహిస్తారట. టెస్టులకు, మందులకయిన డబ్బులే కాకుండా, నెలకొకసారి గాని, సంవత్సరానికి ఒకసారి గాని చందా కట్టవలసి ఉంటుంది. నెలకు రెండుసార్లు కన్నా ఎక్కువ సార్లు వాళ్ళు రావలసి వస్తే, మూడోసారి నుంచి ఒకసారికి ఇంతని సర్వీస్ ఛార్జీ ఉంటుందట” నాన్న చెప్పారు.

“అవున్రా ప్రవీణా! చాలా బాగా చూస్తున్నారట. మొన్నామధ్య అక్కావాళ్ళ మావగారికి అర్ధరాత్రి సడెన్‌గా గుండెల్లో నొప్పొస్తే, అత్తగారు యోర్‌కి కాల్ చేస్తే, కొన్ని నిమిషాల్లోనే వచ్చి, హాస్పిటల్‌కి తీసుకెళ్ళి వైద్యం చేయించారట. సొంత మనుషుల్లా చూసుకున్నారట. కొడుకు దగ్గర లేడనే బాధే కలగనివ్వలేదట. ఆవిడ ఫోన్ చేసి చెబుతుంటే ముందు నమ్మలేకపోయాము. తర్వాత... కాకినాడ సిటీ కాబట్టి, అక్కడ ఆ సేవలందిస్తున్నారనుకున్నాం. ఇప్పుడు మన ఊరికి కూడా పాకింది ఆ సంస్థ! మన పక్క వీధిలో రామచంద్రం అంకుల్‌కి కూడా అటువంటి పరిస్థితే వస్తే, చాలా బాగా చూసుకున్నారని తెలిసింది. చందా మరీ ఎక్కువేమీ కాదు. అందుకే, సంవత్సర చందా కట్టేశాం!” అమ్మ గుక్క తిప్పుకోకుండా చెప్పేసింది.

“అవునమ్మా! తెలంగాణాలో కూడా అది బాగా విస్తరించింది. పక్కరాష్ట్రాలకు కూడా ఎక్స్పాండ్ చేయబోతున్నారు. ఆ సంస్థకు డబ్బు ముఖ్యం కాదు, ప్రేమ పంచడమే ముఖ్యం!” నేనన్నాను.

“అవున్రా! చందా కట్టనివారికి కూడా వాళ్ళ సేవలందిస్తున్నారు. ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు వచ్చి వాలిపోతున్నారు. బిజినెస్ ప్లాన్లతో కాకుండా, హృదయపూర్వకమైన ప్రేమతో డబ్బు సంపాదించేస్తోంది ఆ సంస్థ! ప్రజలు వాళ్ళ ప్రేమకు ముగ్ధులైపోయి, అడక్కముందే డబ్బులు కడుతున్నారు, చందాదారులుగా చేరిపోతున్నారు. చాలా బావుంది” నాన్న అన్నారు.

“అవును నాన్నగారూ! ఇది చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. పిల్లలు దూరంగా ఉంటున్న వృద్ధ తల్లిదండ్రులకు బాగా ఉపయోగపడుతోంది. ఇది విదేశాలకు పాకినా ఆశ్చర్యపోనక్కర్లేదు” అన్నాను.

“అవును, ఒంటరిగా ఉంటున్న వాళ్ళకు, పిల్లలకు దూరంగా ఉంటున్న మాలాంటి పెద్దవాళ్లకు, ఇది చాలా ఉపయోగపడుతుంది. అటువంటి వాళ్ళు విదేశాల్లో కూడా ఉంటారు కదా!” అమ్మ అంది.

“ఇది స్థాపించినవాడెవడో గానీ, చాలా మంచి స్టెప్ తీసుకున్నాడు.” నాన్న అన్నారు.

“అవును.” అన్నాను.

“నీ స్టార్టప్ కంపెనీ సంగతేమైందిరా?”

నేను సమాధానం చెప్పే లోపలే కాల్ కట్ అయింది. అప్పటికే చాలా రాత్రి అవడంతో నాన్నగారు ఇంక కాల్ చేయలేదు.

స్టార్టప్ కంపెనీ పనిమీద నేను అమెరికా వెళ్ళవలసిన అవసరం ఏర్పడింది. అమ్మకు, నాన్నకు కూడా వీసా, పాస్పోర్ట్ తీసుకున్నాను. అమెరికా చూడాలన్న నాన్నగారి కోరికను తీర్చడానికి ఇద్దరినీ నాతో పాటు తీసుకువెళ్ళాను.

అక్కడ నా స్నేహితుడొకడికి వాళ్ళిద్దరినీ అప్పజెప్పి, చూడదగిన ప్రదేశాలన్నీ చూపించమని చెప్పాను. నేను నా బిజినెస్ పని చూసుకున్నాను.

వారం రోజులు గడిచేటప్పటికి నాన్న ఫోన్ చేసి, “ఇండియాకు వెళ్ళిపోదాం, నీ పనింకా అవలేదా?” అనడిగారు.

“మీకిష్టమైన దేశం కదా, ఇంకొన్ని రోజులుండి వెళదాం!” అన్నాను.

"సరదాగా వచ్చి చూసి వెళ్ళడానికి ఈ దేశం బాగుంటుంది గానీ, ఎక్కువ రోజులు ఇక్కడ ఉండలేంరా!" అన్నారు.

నేను నవ్వుకున్నాను. ఆయనకు ఆ విషయం తెలియాలనే... నా పని రెండురోజుల క్రితమే అయిపోయినా ఇంకా అక్కడున్నాను.

ఇండియాకి బయలుదేరాం! ఎయిర్పోర్ట్‌లో ఉండగా నాన్న యూట్యూబ్‌లో ఏదో వీడియో చూసి, "యోర్ సంస్థ నీ స్టార్టప్ కంపెనీయా? మనదేశంలో సూపర్ సక్సెస్ అయిన ఆ కంపెనీని, అమెరికాకు విస్తరింపచేయడానికి ఇప్పుడిక్కడకు వచ్చావా? చెప్పలేదేరా?" అంటూ ఆనందంతో కన్నీళ్ళ పర్యంతం అయ్యారు.

"అంత గొప్ప కంపెనీ, ప్రజలకు అంత ప్రేమపంచే కంపెనీ మనదా!!" అంటూ అమ్మ కూడా ఆనందంతో ఏడ్చేసింది.

వాళ్ళిద్దరినీ రెండు చేతులతో పొదివి పట్టుకుని, "అవును" అని చెప్పాను.

"యోర్ అంటే ఏమిటి?" అన్నారు నాన్న.

"వై హెచ్ ఓ ఆర్... యువర్ హెల్త్ ఈజ్ అవర్ రెస్పాన్సిబిలిటీ. మీ ఆరోగ్యం మా బాధ్యత" అన్నాను.

యూజర్ దేశవిదేశాల్లో దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతుంటే, రోజుకో ఛానల్ వారు నన్ను ఇంటర్వ్యూ చేస్తున్నారు. లైవ్‌లో కొందరు ఫోన్ చేసి, తమ తమ ప్రాణాలను మా సంస్థ ఎలా కాపాడిందో... ఆనందం గొంతుకు అడ్డుపడుతుండగా ఉక్కిరిబిక్కిరవుతూ చెబుతుంటే, అమ్మ ఆనందానికి అంతులేదు.

నాన్న ఓ రోజు ఫోన్ చేసి, "నీకు తండ్రిని అయినందుకు గర్వంగా ఉందిరా! ఆరోజు నువ్వు... జీవితానికి ఉపయోగపడాలంటే, నీ జీవితానికి ఉపయోగపడాలంటున్నావనుకున్నాను. మానవజీవితానికి ఉపయోగపడాలన్నావు అనుకోలేదు!" అన్నారు. నా ఆనందాన్ని అశ్రువులుగా మారకుండా అదుపుచేయడం నా వల్ల కాలేదు.

# బహుమతి

డా. మజ్జి భారతి
✆ 9440615206

*ఆమె ప్రసక్తి రాగానే అతనిలోని కోపం కరిగిపోయింది. వెక్కివెక్కి ఏడ్చేసాడు, "ఆమెలేని జీవితం నాకెందుకు" అంటూ.*

*"ఆమె ఎక్కడికి వెళ్ళలేదు. నీలోనే ఉంది. నువ్వు ఆరోగ్యంగా ఉంటూ, తనని నీలో చూసుకుంటావని, నీమీద ఎన్ని ఆశలు పెట్టుకుందో?"*

*"నాలో ఉండడమేమిటి? ఏమ్మాట్లాడుతున్నారు? బాగా ఎక్కిందా?" కోపంగా అన్నాడు.*

*అతనికి సర్జరీ అయిన దగ్గర, చెయ్యి పెట్టి "ఇక్కడుంది" అన్నాను.*

పోస్టుమార్టం చేస్తున్న నాకు, యాక్సిడెంట్లో చనిపోయిన స్త్రీ శరీరాన్ని పరీక్షిస్తున్నప్పుడు, ఆమె గర్భసంచిని చూడగానే, ప్రాణం పట్టేసినట్లయింది. పోయింది ఒక ప్రాణం కాదు. ఆమెలో రూపుదిద్దుకుంటున్న మరొక ప్రాణం కూడా! వృత్తిధర్మంగా ఇటువంటి విషయాలు తెలిసినప్పుడు, అందరిలాగే మా మనసూ 'అయ్యో పాపమని' కొట్టుకుంటుంది.

అయితే నా ముందున్న సమస్య.. ఆమె గర్భవతన్న విషయం ఆమె కుటుంబానికి తెలుసా... తెలియదా? తెలియకపోతే, ఆమె గర్భవతన్న రిపోర్టును చూసి వాళ్లు తట్టుకోగలరా? పెళ్లై సంవత్సరం గడిచి, పాతికేళ్లన్నా నిండని అమ్మాయి చనిపోవడమే, పెద్ద కష్టమనుకుంటే, పోయింది ఒక ప్రాణం కాదు, రెండు ప్రాణాలని తెలిస్తే కుటుంబమేమైపోవాలి? యాక్సిడెంట్లో భార్య చనిపోయి, ఎలాగోలా బ్రతికి బట్ట కట్టిన భర్తకీ విషయం తెలిస్తే ఏమైపోతాడు? దానికి తోడు, ఇది ఒక్క యాక్సిడెంట్ కేసు మాత్రమే కాదు. అవయవ దానం ఇవ్వబోయే కేసు కూడా!

స్పెషల్ మెసెంజర్ ద్వారా, ప్రైవేటు హాస్పిటల్లో పోస్టుమార్టం చెయ్యమని మేజిస్ట్రేట్ నుండి సమన్లు వచ్చిన నుండి, జరుగుతున్న సంఘటనలు నా కళ్ళముందు కదలాడసాగాయి.

★★★

పోస్టుమార్టాలెప్పుడూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో గాని, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోగాని జరుగుతాయి. గాని ఈ కేసు, యాక్సిడెంట్ కేసే గాని, అవయవదానం చెయ్యబోయే కేసు కాబట్టి, ప్రత్యేకంగా పరిగణించి, ట్రీట్మెంట్ ఇచ్చిన హాస్పిటలుకొచ్చి, పోస్టుమార్టం చెయ్యమన్న మేజిస్ట్రేట్ ఆదేశాల ప్రకారం, నేనీ హాస్పిటలుకొచ్చాను.

నాకందిన వివరాల ప్రకారం, మొదటి మ్యారేజ్ యానివర్సరీ జరుపుకోవడానికి అరకు వెళ్లి, మూడురోజులు గడిపి, తిరిగి వస్తుంటే యాక్సిడెంట్ జరిగింది.

యాక్సిడెంటయ్యాక భార్య బ్రెయిన్‌డెడ్‌గా వెంటిలేటర్ మీద ఉంటే, భర్తకు రెండు కిడ్నీలు డ్యామేజై, కిడ్నీ ఫెయిల్యూర్‌తో డయాలసిస్ మీదున్నాడు. అందుకని భార్య ఒక కిడ్నీని ఆమె భర్తకిచ్చేటట్లు, ఆమె అవయవాలను దానం చెయ్యడానికి ఆమె తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. స్పృహ వచ్చిన దగ్గర నుండి భార్య గురించి అడుగుతున్న భర్తకు, ఆమెకు ట్రీట్మెంట్ కోసం ఇంకా పెద్ద ఆసుపత్రికి పంపించామని డాక్టర్లు సమాధానపరుస్తున్నారు. ఇప్పుడు వెంటిలేటర్ తీసి, ఆమె డెత్ డిక్లేర్ చేసి, ఫార్మాలిటీగా పోస్టుమార్టం చేసి, ఒక కిడ్నీ ఆమె భర్తకివ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నేనక్కడికి చేరుకోగానే వెంటిలేటర్ తొలగించారు. డెత్ డిక్లేర్ చేశారు. బాడీని వెంటనే ఆపరేషన్ థియేటరుకు తరలించారు. ఆమె మరణం అనివార్యమని తెలిసినా, వెంటిలేటర్ తీసేసారన్న వార్త బయటకు పొక్కగానే ఏడుపులు మిన్నంటాయి. ఓటీ డ్రెస్ వేసుకొని, నేను థియేటరులోకి వెళ్తూ చుట్టూ చూశాను. ఏడుపుని ఆపుకోవాలని కూడా ప్రయత్నించని ఒకామె, పేషెంట్ తల్లై ఉంటుంది. నోట్లో చెంగు పెట్టుకొని, వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ, దేవుడికి దండం పెట్టుకుంటున్నామె అత్తగారై ఉంటుంది. కొడుకుకైనా, గండం గట్టెక్కాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లుంది.



ఓటీ తలుపు తీసుకుని వెళ్లబోతుంటే, “నొప్పి తెలియకుండా…” దుఃఖంతో గొంతు పూడుకుపోయింది ఆయనకు. చనిపోయినామె తండ్రని తెలిసిపోతోంది.

అదే మామూలు పరిస్థితులలో, చనిపోయిన వాళ్లకి నొప్పేమిటని నవ్వుకునేవాడిని. గాని ఇప్పుడామాట వినగానే నాక్కూడా గుండె బరువైపోయింది. అలాగే అన్నట్టు తలూపాను. దానికే ఆయన కృతజ్ఞతగా చూసాడు.

ఓటి కాంప్లెక్స్‌లో డాక్టర్లప్పటికే సిద్ధంగా ఉన్నారు. అవయవాలను తీసి జాగ్రత్త చెయ్యడానికి ఒక బృందం, ఒక కిడ్నీని చనిపోయినామె భర్తకు మార్పిడి చెయ్యడానికి ఇంకొక బృందం, మిగిలిన అవయవాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించడానికి పారామెడికల్ స్టాఫ్ సిద్ధంగా ఉన్నారు.

పోస్టుమార్టం చేస్తున్న నాకు… ఆమె గర్భసంచి సైజు చూసి, మైండ్ బ్లాకయింది. అది, రెండు నెలల గర్భం సైజులో… అంటే పోయింది ఒక ప్రాణం కాదు, రెండు ప్రాణాలు! విషయం తెలిసిన నేనే ఏదోలా అయిపోతుంటే, కుటుంబం సంగతేమిటి? విషయం కుటుంబానికి తెలుసా! తెలియదా! వాళ్లకీ విషయం తెలియకపోతే, నా పోస్టుమార్టం రిపోర్ట్ చూసాక, నిజం తెలిస్తే తట్టుకోగలరా? అలాగని నేను గర్భసంచి మామూలు సైజులో ఉందని వ్రాస్తే, వాళ్లకిది వరకే విషయం తెలిస్తే, నేనిచ్చిన రిపోర్టు తప్పంటారా? మెడికో లీగల్ కేసు కాబట్టి, రిపోర్టులో వ్రాసిన ప్రతీ సెంటెన్సుకు నేనే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఏమని వ్రాయాలో అన్న డైలమా నాలో… మనసును మందలించి, గబగబా పోస్టుమార్టంను పూర్తి చేశాను.

★★★

కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతమైంది. కోలుకుంటున్నాడు పేషెంట్. భార్య గురించే అడుగుతున్నాడట. “ఆమె గొంతుకు ఆపరేషనయింది. ప్రస్తుతం మాట్లాడలేదు. నువ్వు తొందరగా కోలుకుంటే, దగ్గరుండి ఆమెను చూసుకోవచ్చు” అని అతనికి ధైర్యాన్ని నూరిపోస్తున్నారట. పోస్టుమార్టం రిపోర్టు వ్రాసే ముందు, పేషెంట్ నొక్కసారి చూడాలన్న నా అభ్యర్థనపై, ఈ విషయాలన్నీ చెప్తూ, “పేషెంటుకెట్టి పరిస్థితుల్లోనూ, అతని భార్య గురించి తెలియకూడదు” అని నన్ను హెచ్చరిస్తూ, నేనెక్కువగా మాట్లాడకూడదనేమో, “మీ భార్యకు, ఈ డాక్టరుగారే సర్జరీ చేశారు” అన్న ఫాల్స్ ఐడెంటిటీతో నన్ను పరిచయం చేసేసాడు అక్కడి డాక్టర్.

చేతులు రెండూ జోడించి, “మా సుధకేమీ ఫర్వాలేదు కదా డాక్టర్! గొంతుకు ఆపరేషనన్నారు. ఎన్నిరోజుల్లో మాట్లాడగలదు? ఇప్పుడే వెళ్లి తనని చూడాలనుంది. గాని, మరో రెండు వారాల వరకు నేనిక్కడ నుండి కదలకూడదని అంటున్నారు. వీడియోకాల్ చెయ్యమని అడిగినా, హాస్పిటల్ రూల్స్ ఒప్పుకోవంటున్నారు. తనెలా ఉంది డాక్టర్? నేను బాగానే ఉన్నానని చెప్పండి” అన్నాడతను.

“ఆమె బాగానే ఉంది” అని చెప్తుంటే నాగొంతు నాకే బలహీనంగా వినిపించింది. ఐనా, నేనెందుకొచ్చానో, ఆ విషయమెలా తెలుసుకోవాలో అనుకుంటూ, “మీ వైఫ్ అంటే మీకు చాలా ఇష్టమనుకుంటాను” లేని నవ్వును తెచ్చుకున్నాను.

“నాకే కాదు డాక్టర్! తనకి కూడా, నేనంటే అంతే ఇష్టం!” అతని కళ్ళల్లో మెరుపులు.

“మీ వెడ్డింగ్ యానివర్సరీ మొన్నే అయిందనుకుంటాను” ఈ సందర్భంలో, ఆ విషయం గుర్తుచెయ్యడానికి మొహమాటపడి ఆగాను.

"అవును డాక్టర్! ఎంతో సరదాగా మూడు రోజులు గడిపాం. అంతలోనే ఇలా అవుతుందనుకోలేదు. ఐనా, దేవుడి దయవల్ల నేను కోలుకుంటున్నాను. నేను తొందరగా తన దగ్గరికి వెళ్తే, నన్ను చూసి, తనూ తొందరగా కోలుకుంటుంది" నమ్మకంగా చెప్పాడతను.

నాకు కావలసిన సమాధానం, ఎలా రాబట్టుకోవాలో తెలియడంలేదు. అక్కడి డాక్టర్ చూపులతోనే, నన్ను బయటకు నడవమని చెప్తున్నాడు.

"మీ మ్యారేజ్ డేకి, మీ వైపుకేమి గిఫ్టిచ్చారు?" బలవంతంగా అడిగేసాను.

"తనకి గిఫ్టులేవీ అక్కర్లేదు. పట్టణ రణగొణధ్వనులకు దూరంగా, ప్రకృతి ఒడిలో, మా ఇద్దరమే ఒకరికొకరిమై, రెండురోజులన్నా గడపాలన్నదే పెళ్లైననాటి నుండీ, ఆమెకున్న ఒకేఒక్క కోరిక! అందుకే అరకు వెళ్లాం!" ఏ మధురస్మృతులు గుర్తొచ్చాయో మైమరిచిపోతూ అన్నాడతను.

"ఆమె?" ఈ రెండక్షరాలు పలకడానికి, నాకు చాలా ధైర్యమే కావలసివచ్చింది. నా గుండె శబ్దం నాకే వినిపిస్తుంది. నాలో ఆందోళన. అతనిచ్చే సమాధానం కోసం ఎదురు చూస్తున్నాను. ఇదంతా ఏమిటన్నట్టు, అక్కడి డాక్టర్ కళ్ళతోనే ప్రశ్నిస్తున్నాడు.

మా ఇద్దరి ఆందోళనలను పట్టించుకోకుండా, "మా ఇంటికెళ్ళాక, నాకు మంచి బహుమతి ఇస్తానంది డాక్టర్!" ఆమె ఇవ్వబోయే బహుమతి ఏమై ఉంటుందా అన్న కుతూహలం, దానికోసం ఎదురుచూపు అతని కళ్ళల్లో.

ఆ బహుమతేమిటో నాకు తెలుసు. నాలుగురోజులు పోయాకైనా తానెంతో ప్రేమించే, తననెంతో ప్రేమించే భార్య పోయిందని తెలిసినప్పుడు తట్టుకోవడమే కష్టమైతే, కిడ్నీ మార్పిడి ఆపరేషనైన వ్యక్తి వాడే మందులు, అతని శారీరక ఆరోగ్యం మీద చాలా ప్రభావం చూపిస్తాయి. మానసికంగా కూడా చాలా క్రుంగిపోయి ఉంటాడు. వాటికి తోడు, ఆమె ఇవ్వబోయే బహుమతేమిటోనన్న ఈ నిజం తెలిస్తే, అతను తట్టుకోగలడా? ఇటువంటి సమయంలో ఫోరెన్సిక్ మెడిసిన్ స్పెషలిస్టుగా నా విధ్యుక్తధర్మమేమిటి? ఉన్నదున్నట్లు వ్రాసి, అతనిని మరింత దుఃఖంలోకి నెట్టడమా? లేక, మనిషిగా మనసుతో ఆలోచించి, నిజాన్ని బయటకు చెప్పకపోవడమా! నా యీ అంతర్మథనాన్ని కప్పిపుచ్చుకోవడానికి, ముఖానికి నవ్వు ముసుగును తగిలించి, "విష్ యు స్పీడీ రికవరీ" అని చెప్పి, వడివడిగా బయటికి నడిచాను.

★★★

బార్‌లో ఒంటరిగా కూర్చుని, వగరుగా ఉన్న విస్కీని నెమ్మది నెమ్మదిగా సిప్ చేస్తూ, మత్తులోకి జారడానికి ప్రయత్నిస్తున్నాను. మనసు బాగోలేనప్పుడు తరచుగా నేను చేసే పనది. ఉదయం చేసిన పోస్టుమార్టం మనసును కలిచివేస్తుంటే... ఈరోజూ రెండు ప్రాణాలే! అత్తింటి ఆరళ్ళను భరించలేక, బిడ్డ కడుపులో ఉందనైనా ఆలోచించకుండా, తనని తాను అంతం చేసుకుంది. జీవితాన్ని ఎదుర్కోవడానికి ఆవిడకెన్ని కష్టాలో! జీవితం మీద ఎంత విరక్తి చెందిందో?

ఇటువంటి కేసులు చేసినప్పుడు, ఫోరెన్సిక్ మెడిసిన్ పీజీ ఎందుకు చేశానా... అని నన్ను నేనే తిట్టుకుంటాను. పీజీ చేసినప్పుడు జాబ్ సెక్యూరిటీ, ప్రమోషన్ల గురించి ఆలోచించుకున్నాను గాని, నా మనసు గురించి ఆలోచించుకోలేదు.

ఇప్పుడనుకుని ఏం లాభం? పెగ్గుమీద పెగ్గు గొంతులో దిగుతోంది గాని, ఆలోచనల నుండి బయట పడలేకపోతున్నాను.

“పోస్టుమార్టం రిపోర్ట్ తప్పుగా ఎందుకిచ్చారు?” ఆ స్వరంలో కాఠిన్యం.

తప్పు రిపోర్టా? నేనా? రోజుకి మూడు నాలుగైనా పోస్టుమార్టంలు చేస్తాను. గాని ఏనాడూ తప్పు రిపోర్టివ్వలేదే?

“దేని గురించి మాట్లాడుతున్నారు మీరు?” అంటూ, స్వరం వినిపించిన వైపు తిరిగి చూశాను. చేతిలో విస్కీ గ్లాసుతో ఒకతను.

“దేని గురించా? అంటే తప్పుడు రిపోర్టులు ఎన్నిచ్చుంటావు?” ఈసారి మాటలు చాలా వాడిగా, ఏక వచనంతో... చాలా కోపంగా ఉన్నట్టున్నాడు.

తప్పు రిపోర్టన్న మాట రెండోసారి చెవిన పడగానే, పొలమారాను. నేనిచ్చిన తప్పు రిపోర్ట్... ఒక్కసారే... పరీక్షగా చూశానతనిని. అంతే! ఎక్కుతున్న మత్తు దిగిపోయింది. ఇతనేమిటిక్కడ? నిజం ఇతనికెలా తెలిసింది? ఐనా, సర్జరీ అయి నాలుగు నెలలైనా కాలేదు. ఇలా అయితే అతని ఆరోగ్యపరిస్థితేమిటి? నాలోని డాక్టర్ నిద్ర లేచాడు, “మీరేమిటిక్కడ?” అంటూ.

“నా సంగతి పక్కన పెట్టు? నిజం చెప్పకపోగా, నా భార్యకు ఆపరేషన్ చేసిన డాక్టరునని చెప్తావా?” నా కాలర్ పట్టుకున్నాడు.

అతని చేతులను వదిలించుకుంటూ, అతని ముఖాన్ని జాగ్రత్తగా చూశాను. కళ్ళల్లో ఎరుపు జీరలు. ఉబ్బిపోయి గుండ్రంగా తయారవుతున్న ముఖం. చేతుల్లో చిన్న వణుకు! అతన్ని చూస్తుంటే జాలేసింది. నిజమే కట్టుకున్న భార్య, పుట్టబోయే బిడ్డ... పోతే మనసున్నవాళ్లు, ఇలాకాక మరెలా ఉంటారు? పాపమావిడ! ఇతన్ని అలా చూస్తూ, ఎంత తల్లడిల్లుతుందో?

“నువ్విలా ఉంటే, ఏ లోకంలో ఉందో! ఆమెంత బాధ పడుతుంది!” అనునయంగా అన్నాను.

ఆమె ప్రసక్తి రాగానే అతనిలోని కోపం కరిగిపోయింది. వెక్కివెక్కి ఏడ్చేసాడు, ఆమెలేని జీవితం నాకెందుకంటూ.

“ఆమె ఎక్కడికి వెళ్ళలేదు. నీలోనే ఉంది. నువ్వు ఆరోగ్యంగా ఉంటూ, తనని నీలో చూసుకుంటావని, నీమీద ఎన్ని ఆశలు పెట్టుకుందో?”

“నాలో ఉండడమేమిటి? ఏమ్మాట్లాడుతున్నారు? బాగా ఎక్కిందా?” కోపంగా అన్నాడు.

అతనికి సర్జరీ అయిన దగ్గర, చెయ్యి పెట్టి, “ఇక్కడుంది” అన్నాను.

“ఏమంటున్నారు మీరు?” అయోమయంగా అడిగాడు.

“నేను నిజం చెప్తున్నాను. నీ రూపాన్ని తనలో పెంచి, నీకు బహుమతిగా ఇద్దామనుకుంది. అది కుదరకపోయేసరికి, తన భాగాన్ని నీలో పెట్టి, నీకు పునర్జన్మను, బహుమతిగా యిచ్చింది. నీలో తనని చూసుకుంటావనుకుంది. గాని, నువ్విలా బారుల వెంట తిరిగి, నీకే కాదు, ఆమెకూ దూరమవుతావని ఊహించి ఉండదేమో?” అన్న నా మాటలకు, అతని చెయ్యి వీపు వెనక భాగాన్ని తడిమింది.

“డాక్టర్! ఇది ఆమె నాకిచ్చిన బహుమతా? ఈ విషయం నాకెవ్వరూ చెప్పలేదు. దాత వివరాలు బయట పెట్టకూడదని మాత్రమే చెప్పారు” అన్న అతని మాటలకు, “నేనైనా చెప్పకూడదు. గాని, ఆమె ప్రేమను మీరు గుర్తించ లేకపోతున్నారన్న బాధతో మాత్రమే చెప్పాను. ఆమిచ్చిన బహుమతిని, నువ్వెలా చూసుకుంటావో మరి?” అన్నాను.

“థాంక్యూ డాక్టర్! నా కళ్ళు తెరిపించారు. ఇన్నాళ్లూ, తను లేని జీవితం ఎందుకనుకున్నాను? గాని, తను నాలోనే ఉందనే నిజాన్ని గ్రహించుకోలేక పోయాను. నా సుధ నా దగ్గరుండగా, వేరే సుధ నాకెందుకు?” చేతిలోని గ్లాసును విసిరికొట్టాడు.

అతనికెలా తెలిసిందన్న నా ప్రశ్నకు, సుధ డైరీ చదివాక తెలిసిందని, అప్పటినుండి, నా రిపోర్టులో ఆమె గర్భవతన్న విషయం ఎందుకు మెన్షన్ చెయ్యలేదో కారణం తెలుసుకోవాలనుకుంటున్నానని చెప్పాడు.

“దూరమైంది ఒకరు కాదు, ఇద్దరని తెలిస్తే, మీరింకా బాధపడతారని” అన్న నా సమాధానంతో, అతని ముఖం వివర్ణమైంది.

అంతలోనే తేరుకొని, “థాంక్యూ డాక్టర్ ఫర్ యువర్ కన్సర్న్ దెన్ అండ్ నౌ. నా జీవితంలో మిమ్మల్ని మర్చిపోలేను” అంటూ రెండుచేతులూ జోడించి, అక్కడినుండి వెళ్లిపోయాడు.

ఆమె ఇచ్చిన బహుమతిని, అతను జాగ్రత్తగా కాపాడుకుంటాడన్న నమ్మకంతో, నా బాధ కొంచెం ఉపశమించగా, నేను కూడా అక్కడినుండి బయటపడ్డాను.

# నాన్న నీ మనసే వెన్నా...

సూరిశెట్టి వసంత కుమార్
✆ 6281287659

***"మీకు వచ్చిన కష్టానికి విచారిస్తున్నానమ్మా. ఆఖరి క్షణం వరకూ పనిచేసాడన్న పేరు... మీ నాన్నగారికి మిగిలింది. ఇది అందరికీ దొరకని అదృష్టం. ఆయన చాలా గొప్ప మనిషి. తను చనిపోతానని ముందుగానే తెలుసనుకుంటాను. అందుకే తన ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ నీకిమ్మని రాసి ఇచ్చారు" అంటూ ఇంకా ఏవేవో మాట్లాడుతున్నాడు. 'చచ్చి సాధిస్తున్నాడు. తలకొరివి కూడా దాన్నే పెట్టమంటే సరి!' మనసులో అనుకుంటున్నా నేను.***

"మీ నాన్నగారి పరిస్థితి బాగుండలేదట... నీ కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. పద ఇంటికి!"

నూటపది డిగ్రీల ఎండలో తెగిపోయిన చెప్పులతో తారురోడ్డు మీద పరుగులాంటి నడకతో ఇంటికి వచ్చి చేరాను. అప్పటికే ఇల్లంతా చుట్టు ప్రక్కల వాళ్ళతోనూ, నాన్నగారి ఆఫీసు స్టాఫుతోనూ నిండి ఉంది.

"టైపు చేస్తున్నప్పుడు గుండెనొప్పి వచ్చి పోయారట. పోయేటప్పుడు 'కవితా... కవితా' అంటూ చనిపోయారట!" అన్నాడు శంకర్.

"ఎప్పుడో పోవలసింది" గొణుక్కుంటూ మొఖం తిప్పుకున్నాను.

"రా... ఇంట్లోకి వెళ్దాం! నాన్నగారి బాడీని ఆఫీసు నుంచి వ్యానులో ఇంటికి తెచ్చారు. నీ కోసం అన్ని చోట్లకి మనుషులు వెళ్లారు." అంటూ నా భుజం మీద చెయ్యి వేసి లోపలికి తీసుకుని వెళ్ళాడు శంకర్.

"చస్తే చావనీరా! ఎప్పుడో చచ్చిపోయాడు నాకు సంబంధించినంత వరకూ!"

"ఎంత చెడ్డయినా నాన్న నాన్నే కదా!"

"నాకు మాత్రం కాదు."

"తలకొరివి పెట్టవలసిన వాడివి... నువ్వే ఇలా మాట్లాడడం బాగోలేదురా!"

"ఆ ఉంచుకున్న దాని కూతురు కవిత ఉందిగా, దాన్ని పెట్టమను తలకొరివి!"

"నీ కోపాలూ, తాపాలూ ప్రాణమున్న మనిషి మీద! ఇప్పుడు మీ నాన్నగారు శవమై ఉన్నారు. ఇప్పుడాయిన దైవంతో సమానం! వెళ్ళి చూడు" అంటూ శంకర్ నన్ను ముందుకి తోసాడు.

శంకర్ తొయ్యడంతో ముందుకు వెళ్ళి శవం ముందు నిలబడ్డాను. అందరూ నన్ను చూస్తూ చెవులు కొరుక్కోసాగారు. నన్ను చూసి చెవులు కొరుక్కోవడం ఇది రెండవసారి.

ఆ రోజు జరిగిన సంఘటన ఇప్పటికీ నాకు గుర్తుంది. స్కూల్లో టూరు వెళ్తున్నారని డబ్బులు అడిగితే ఇవ్వకుండా, ఉంచుకున్న ఆమె కూతురుకి స్కూలు ఫీజు కట్టడం కోసం జీతమంతా ఆమె చేతిలో పెట్టి, అమ్మ ముందు తల దించుకుని నిలబడినప్పుడు, షర్టు పట్టుకుని ఒక్క ఊపు ఊపినప్పుడు అనుకోని విధంగా క్రింద పడినప్పుడూ... ఇలాగే అందరూ చెవులు కొరుక్కున్నారు.



"మీ నాన్నగారంటే నీకు కొంచెం కూడా ఇష్టం లేదా?"

"శంకర్! మంచి నాన్న దొరకడం పూర్వజన్మ సుకృతం. మానాన్న ఒక రోగ్. నేను స్కూలులో చదివే రోజుల్లో ఎవరో ఒకామెను తెచ్చి ఉంచుకున్నారు. అదీ పెళ్ళయిన ఆమెని! సగం రోజులు ఇంటికి వచ్చేవాడు కాదు!" కంట్లోంచి ఒక కన్నీటిబొట్టు జలజలా రాలి క్రింద పడింది నాకు తెలీకుండానే!

"దుఃఖం ఆగలేదు చూసావా?"

"ఇవి వట్టి కన్నీళ్లే. చనిపోయినందుకు కావు. ఇక మీదట హింసపెట్టే నాన్న లేడని వచ్చిన ఆనందబాష్పాలు ఇవి."

శవం ముందు అందరూ నిలబడి ఉన్నారు. ఉంచుకున్న ఆమె కూతురూ నిలబడి ఏడుస్తోంది. అమ్మ నన్ను చూడగానే గుండెలు బాదుకుంటూ పరుగెత్తుకు వచ్చి, "మీ నాన్న ఎంత పని చేసారో చూసావా? మనల్ని అనాథల్ని చేసి వెళ్ళిపోయారు!" అంది.

నాన్న శవాన్ని పూలదండల మధ్య హాల్లో ఉంచారు. చూసిన నాకెటువంటి దుఃఖమూ కలగలేదు. అమ్మ ఇంకా పడిపడి ఏడుస్తోంది. అమ్మని చూస్తేనే కష్టంగా ఉంది. అమ్మ ఏడవడం ఇది మొదటిసారి కాదు. ఏదో ఒక వంక పెట్టుకుని నాన్న అమ్మని కొట్టేవాడు. అమ్మ నాతో చెప్పుకుని ఏడ్చేది.

"ఏడవరా ఏడ్వు, దుఃఖాన్ని లోపలే ఉంచుకుంటే పిచ్చెక్కగలదు. ఏడవరా!" అమ్మ గట్టిగా పట్టుకుని ఏడవసాగింది.

"నాకేమీ ఏడుపు రావటం లేదమ్మా!" గొణుక్కుంటూ ఊరుకున్నాను.

ఆమె, కూతురూ ఇద్దరూ అమ్మతో సమానంగా కూర్చుని ఏడవసాగారు. వీధిలో ఉన్నవాళ్ళు ఒక్కొకరుగా వచ్చి పరామర్శించి వెళ్ళిపోతున్నారు.

ఒకసారి నాన్న పర్సులో ఉన్న నూరు రూపాయిల నోటు కనిపించలేదని నన్ను చావచితక్కొట్టారు. ఎంత చెప్పినా వినలేదు.

"పనికిరాని వెధవా! ఏవిరా డబ్బులు? దొంగతనంగా సిగరెట్లు కాల్చడానికి తీసావా?"

"నేనేమీ మీలా కాదు. ఉంచుకున్నదానికి ఇచ్చారేమో" మళ్లీ దెబ్బలు మొదలయ్యాయి.

శవం ముక్కు మీద ఒక ఈగ వాలింది. తరమాలనిపించలేదు. నాకూ నాన్నకీ ఒక్క క్షణం పడేది కాదు.

మరోసారి నాకు ఒక పెద్ద చిట్‌ఫండు కంపెనీలో ఉద్యోగం ఇస్తామన్నారు. నెలకు రెండువేల రూపాయలు జీతం. కానీ దానికి కాషన్ డిపాజిట్టు కింద యాభైవేలు కట్టాలన్నారు. ఎంత అడిగినా నాన్న ఇవ్వలేదు. అమ్మ ఎంతగానో బ్రతిమాలింది. కానీ నాన్న ఒప్పుకోలేదు. పైగా నాకు చదువు ఎక్కలేదని, నేనెందుకూ పనికిరానని నానా తిట్లు తిట్టారు. నాకు దొరకవలసిన ఉద్యోగం నా ఫ్రెండు శంకరానికి పోయింది. నా భవిష్యత్తుని పాడుచేసిన ఇతని కోసం నేనెందుకు ఏడవాలి?

ఏదో కారొచ్చి ఆగింది ఇంటి ముందు. సఫారీ వేసుకుని ఒక అతను కిందికి దిగాడు. చేతిలో పెద్ద పూలదండ. తిన్నగా ఇంటిలోకి వచ్చి నాన్న పాదాల దగ్గర దండనుంచి నమస్కరించాడు.

"మీ నాన్న పనిచేసే కంపెనీ మేనేజర్" అంటూ మెల్లగా చెవిలో చెప్పాడు శంకర్.

ఇంతలో అతను నోరు విప్పి "ఇక్కడ కవిత ఎవరు?" అన్నాడు.

నాకు ఒళ్ళంతా పాములు పాకినట్టయింది.

కవిత ఏడుస్తూ ముందుకు వచ్చి నిలబడింది.

"మీకు వచ్చిన కష్టానికి విచారిస్తున్నానమ్మా. ఆఖరి క్షణం వరకూ పనిచేసాడన్న పేరు... మీ నాన్నగారికి మిగిలింది. ఇది అందరికీ దొరకని అదృష్టం. ఆయన చాలా గొప్ప మనిషి. తను చనిపోతానని ముందుగానే తెలుసనుకుంటాను. అందుకే తన ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ నీకిమ్మని రాసి ఇచ్చారు" అంటూ ఇంకా ఏవేవో మాట్లాడుతున్నాడు.

'చచ్చి సాధిస్తున్నాడు. తలకొరివి కూడా దాన్నే పెట్టమంటే సరి!' మనసులో అనుకుంటున్నా నేను.

"మీ అన్నయ్య ఎక్కడ కవితా?" అన్న ఆయన మాటలతో ఈలోకానికి వచ్చాను. నా దగ్గరగా వచ్చి "పనులన్నీ అయిన తర్వాత ఆఫీసుకి ఒక్కసారి రండి!" అంటూ వెళ్ళిపోయాడు మేనేజర్.

ఎక్కడికైనా పారిపోవాలనిపించింది. శంకరం నన్ను వెళ్ళకుండా అడ్డుకున్నాడు. పాపం అమ్మ. అలా ఏడుస్తూనే ఉంది. తలకొరివి నేనే పెట్టాను. ఆ నిప్పుతో సిగరెట్ వెలిగించుకోవాలనిపించింది.

ఇరవై రోజుల తర్వాత శంకర్ నన్ను చూడడానికి వచ్చాడు. వాడు పనిచేసిన చిట్ ఫండు కంపెనీ దివాళా తీసిందని చెప్పాడు. సరిగ్గా అప్పుడే నాన్నగారి ఆఫీసు నుంచి ఒక ఉత్తరం వచ్చింది. నాన్న చేసిన టైపిస్టు ఉద్యోగం నాకిస్తున్నట్టు, వచ్చి జాయినవమని ఉత్తరంలోని సారాంశం.

ఇష్టం లేకపోయినా, వేరే దారిలేక, అమ్మ బలవంతం వలన వెళ్ళి డ్యూటీలో జాయినయిపోయాను.

రిటైరవడానికి సిద్ధంగా ఉన్న అకౌంటెంట్ ముసలోడు... నన్ను తీసుకుని వెళ్ళి, ఆఖరిశ్వాస వదిలేవరకూ నాన్న కూర్చున్న అదే కుర్ర కుర్చీలో కూర్చోబెట్టాడు. నేను కూర్చోగానే అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "మీ నాన్న చాలా గొప్ప మనిషి. అచ్చం ఆయన కూర్చున్నట్టే ఉంది" అన్నాడు.

ఒక్కొక్కరు వచ్చి చూసి వెళ్ళసాగారు.

"కొంచెం మంచినీళ్ళు తెచ్చి ఇస్తారా?" అన్నాను ప్యూనుతో.

"నాన్నగారు కూడా ఇలాగే కూర్చోగానే మంచినీళ్ళు అడిగేవారు" అంటూ నీళ్ళందించి కళ్ళు తుడుచుకున్నాడు.

మేనేజర్ రూముకి వెళ్ళాను. "సార్! వచ్చి అరగంట అయింది. టైపు చెయ్యడానికి ఏదైనా ఉంటే ఇవ్వండి" అన్నాను.

"అచ్చం నాన్నగారిలా మాట్లాడుతున్నావ్! ఇవాళ ఏ పనీ చెయ్యొద్దు. అందర్నీ పరిచయం చేసుకో" అన్నాడు నవ్వుతూ.

వస్తుంటే స్టెనో ఆపింది. "మీ నాన్నగారు చాలా మంచిమనిషి రఘూ! చేరిన కొత్తలో నా దగ్గర ఒక క్లర్కు తప్పుగా ప్రవర్తించాడు. అది చూసి, మీ నాన్నగారు అతన్ని అందరిముందు దుమ్ము దులిపేసారనుకో! అప్పట్నించీ అతను నేనెక్కడ కనబడినా సిస్టర్... సిస్టర్ అనే పిలుస్తాడు."

క్లర్కు, క్యాషియర్, సూపర్వైజర్ ఇలా ఒక్కొక్కరు వచ్చి మాట్లాడసాగారు.

"నాన్నగారిని చూసినట్టే ఉంది. అదే ముఖం, అదే పొడవు. అలాగే నువ్వు కూర్చున్నప్పుడు కాళ్ళాడిస్తున్నావ్... మాటా అలాగే ఉంది."

"నాన్నగారిలా మధ్యమధ్య మంచినీళ్ళు త్రాగడం, ఆయనలాగే ముఖంమీద పుట్టుమచ్చ. ఆయన జాయినైన కొత్తలో అచ్చం నీలాగే ఉండేవారు."

"నిన్ను చూస్తుంటే ఆయనే తలకి రంగేసుకుని వచ్చినట్టు ఉంది."

"కవిత నాన్నగారూ ఇక్కడే పనిచేసేవారు. ఒకరోజు లారీ గుద్దుకుని చనిపోయాడు. అప్పుడు కవిత చాలా చిన్నపిల్ల. కవిత అమ్మకి చదువు లేనందువల్ల ప్యూన్ ఉద్యోగం ఇచ్చారు. అందరి కళ్ళు ఆమె మీదనే. చాలా రకాలుగా బాధపెట్టేవారు. అవన్నీ మీ నాన్నగారితో చెప్పుకుని ఏడ్చేది. ఒకరోజు సడన్‌గా అందరి ముందూ ఆమెని పెళ్ళి చేసుకుని, "ఇక మీద ఈమె నా భార్య, కవిత నా కూతురు" అని చెప్పి, వాళ్ళ బాధ్యతల్ని కూడా తనే తీసుకున్నారు. ఆఖరివరకూ మాట తప్పలేదు. ఆమెని నిజంగా భార్యగానే చూసారా? లేక తోడుగా ఉండి కాపాడారా? ఎవ్వరికీ తెలీదు గానీ, ఎవరి కళ్ళూ ఆమె మీద పడకుండా మాత్రం చూడగలిగాడు."

గుండెలో ఒకమూల చిన్న బాధ ప్రారంభమయ్యింది.

"మా అబ్బాయికి ఫీజు కోసం మీ నాన్నగారి దగ్గర కొంచెం డబ్బు అప్పుగా తీసుకున్నాను. తర్వాత తిరిగి ఇవ్వబోతుంటే, 'మీ వాడు సంపాదించినప్పుడు తీసుకుంటాలే' అని తీసుకోలేదు."

టూరు వెళ్ళడానికి డబ్బు ఇవ్వకుండా, తనకు పుట్టని కూతురు ఫీజు కోసం ఖర్చు చెయ్యడం ఎంత గొప్పపని! గుండెలో బాధ మరికొంత ఎక్కువయ్యింది.

"నా దగ్గరే చాలా క్లోజ్‌గా ఉంటారు. ఎప్పుడూ నీ గురించే చెప్పేవారు. 'నా కొడుకు నన్ను సరిగ్గా అర్థం చేసుకోలేదయ్యా! వాడి కోసం నేనేమీ చెయ్యలేదు. ఇంకా ఉద్యోగం దొరకలేదు. సర్వీసులో ఉన్నప్పుడే నా ప్రాణాలు పోతే, వాడికి ఉద్యోగమైనా దొరుకుతుంది!' అంటూ ఇంకా చాలా చెప్పేవారు."

కళ్ళల్లోంచి నీరు ధారలా కారసాగింది. ఆపుకోవడానికి ప్రయత్నించలేదు. ముఖాన్ని చేతులతో కప్పుకుని బిగ్గరగా ఏడవసాగాను.

'ప్రాణంతో ఉన్నప్పుడు మిమ్మల్ని అర్థం చేసుకోలేకపోయాను నాన్నగారూ! నన్ను క్షమించరూ! మీలాంటి తండ్రికి పుట్టినందుకు ఎంతో గర్వపడుతున్నాను. ఇకపై మీరు అనుకున్నవన్నీ సాధిస్తాను. మీరే నా దేవుడు' అనుకుంటూ టైపుమిషన్‌లోకి తెల్లకాగితాన్ని దూర్చాను. పైన 'శ్రీరామ జయం!' అని టైపు చెయ్యడానికి బదులు, 'నాన్నగారు' అని టైపు చేసాను.

# మారిన నేల – మారని మనసు

డా. లక్ష్మీ రాఘవ
✆ 9440124700

***ఒక పలకరింపు, ఒక సహాయం అవసరమైనప్పుడు... అది చేయని చోట ఎన్ని సదుపాయాలుంటే ఏమి? పొద్దున లేస్తూనే వీధి తలుపులు తెరిచి ఉంచి ఎవరు వచ్చినా, అందరికీ ఆహ్వానం పలికే సాంప్రదాయంలో పుట్టి పెరిగిన దాన్ని నేను! చచ్చేదేదో అక్కడే చస్తాను! అందుకే నేను వెళ్ళాలి అంటున్నా... వెళ్ళిపోతా!"***

కొడుకు కార్తీక్ ఆఫీసునుండి రాగానే.. దేవమ్మ "కార్తీక్, నేను వెళ్ళిపోతానురా! టికెట్టు బుక్ చెయ్యి" అంటూంటే, ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే నాన్న పోయాక, తల్లి దేవమ్మను తన దగ్గరే ఉంచుకోవాలని అమెరికా తీసుకు వచ్చాడు కార్తీక్.

"ఎందుకమ్మా, నువ్వు వచ్చి రెండు నెలలే అయ్యింది. ఇంకా నాలుగు నెలలు ఉండచ్చు..." అనునయంగా అన్నాడు.

"వద్దురా... ఇంకా ఉండమని చెప్పద్దు."

"అమ్మా, నీకేమైనా ఇబ్బందిగా ఉందా? నీరజ ఏమైనా అందా?" అనుమానంగా అడిగాడు

"ఛ ఛ! అలాగేమీ లేదురా! నీ భార్య మంచిది. నాకే వెళ్ళిపోవాలని ఉంది!"


"అమ్మా, నాన్న పోయాక నిన్ను చూసుకునే బాధ్యత నాది! నువ్వు మాతోనే ఉండాలని నీకు గ్రీన్‌కార్డ్ కోసం ప్రయత్నించాలనే నా కోరిక. ఇక్కడ మాకు తెలిసీ నీకేమీ తక్కువ చెయ్యలేదు కదా, ఇలా వెళ్ళిపోతానంటే ఎలా?" బాధగా అని, లేచి రూమ్‌లోకి వెళ్ళాడు కార్తీక్.

ఎదురుపడిన భార్య నీరజతో "నువ్వు అడిగి చూడు... ఒకసారి" అన్నాడు అమ్మవైపు కళ్ళు తిప్పి.

"వినటం లేదండీ. అలా అని కారణమూ చెప్పటంలేదు. అందుకే నేరుగా మీవరకు వచ్చింది!" అంది నిరాశగా.

కార్తీక్ ఏమి చెయ్యాలో ఆలోచిస్తూ ఉండగా, కార్తీక్ కొడుకు రామ్ స్కూల్‌వర్క్ చేసుకుంటూ కనిపించాడు. వెంటనే, "రామ్, నువ్వు అప్పుడప్పుడూ నానమ్మతో సాయంకాలం వాకింగ్ వెడతావు గదా, నాన్నమ్మ బాగా కబుర్లు చెబుతుందా?" అని అడిగాడు కొడుకుని.

"ఓ… నాకు ఇండియా కబుర్లు చాలా చెబుతుంది. అప్పుడప్పుడూ కథలు కూడా! నేను స్కూల్‌నుండి వచ్చాక, హోమ్‌వర్క్ లేకపోతే నాన్నమ్మతో వాక్ వెళ్ళటం భలే ఉంటుంది. నేను ఇక్కడ అన్నీ ఎంత కొత్తగా ఉంటాయో నాన్నమ్మకు చెబుతాను. అలెక్సా గురించి చెప్పినప్పుడు 'నాకూ నేర్పించు. రోజూ అలెక్సాని నేనూ అడుగుతా' అంది కూడా!"



కొడుకు మాటల్లో ఒక పాయింటు దొరికింది కార్తీక్‌కు. రామ్‌ను తన రూములోకి పిలుచుకుపోయి, "రామ్, నువ్వు నానమ్మకి ఇక్కడ అన్నీ ఎంత బాగున్నాయో చెబుతావా?"

"ఎప్పుడూ చెబుతాను డాడీ! ఎందుకంటే నాన్నమ్మకి తెలియనివి చెబితే ఆశ్చర్యంగా చూస్తుంది. మన ఇల్లు కూడా చాలా పెద్దదని నాన్నమ్మకు ఇష్టం…" తొమ్మిదేళ్ళ రామ్ అలా చెబుతూ వుంటే చాలా ముచ్చటేసింది.

"నీకు రేపు హాలిడే కదా, నానమ్మతో వాకింగ్ వెళ్ళినపుడు ఒక హెల్ప్ చెయ్యాలి!"

"నేను హెల్ప్ చెయ్యాలా?" ఆశ్చర్యంగా చూసాడు రామ్.

"అవును నాన్నా... నాన్నమ్మ వెనక్కి ఊరికి వెళ్ళిపోతానని అంటోంది. తను ఇంకా నాలుగు నెలలు ఉండచ్చు అన్నా, నేను వెళ్ళిపోవాలి అంటోంది. మనం ఇక్కడ బాగా చూసుకుంటాము కదా, ఇప్పుడే ఎందుకు వెళ్ళాలి? అంటే రీజన్ చెప్పకుండా మొండికేస్తోంది. నువ్వు వాకింగ్ వెళ్ళినప్పుడు అడుగు ఉండమని... నీతోనైనా చెబుతుందేమో!"

"ఓ... అలాగే! నేను అడుగుతాను డాడీ!" అన్నాడు రామ్ ఉత్సాహంగా. వాడికీ నాన్నమ్మ ఇక్కడే ఉండాలని ఇష్టం!

అంతా వింటూన్న నీరజ కూడా సంతోషపడింది. నీరజకు అత్తగారు వెళ్ళిపోతాననడం నచ్చలేదు. అమెరికాలో సెటిల్ అయ్యాక, ఎప్పుడూ ఒంటరి సంసారం అనిపించేది. సంవత్సరం క్రితం అత్తగారు, మామగారు వచ్చినప్పుడు ఉన్న ఆరునెలలూ పిల్లలు రామ్, రశ్మి లకు బాగా చేరువయ్యారు. ఇప్పుడు దేవమ్మకు నచ్చజెప్పి గ్రీన్‌కార్డ్ కోసం ప్రయత్నించాలని అనుకుంటూ ఉండగా, ఆమె రెండునెలలకే వెళ్ళిపోతానని అంటోంది. కారణం ఏమిటో తెలిస్తే నచ్చజెప్పాలని ప్రయత్నం!

మరురోజు నాన్నమ్మ వాకింగ్‌కి బయలుదేరగానే, రామ్ నేనూ వస్తానంటూ వెళ్ళాడు. రామ్‌తో వెళ్ళాలంటే దేవమ్మకు ఇష్టం. నాన్‌స్టాపుగా నడుస్తాయి వారిద్దరి మధ్యా కబుర్లు. స్కూలు విషయాలు దేవమ్మకు కొత్తగా ఉంటాయి. ఇండియాలోలాగ కాకుండా, పిల్లలకు విద్య నేర్పే విధానం వేరుగా ఉండటం గమనించింది. కారులో స్కూలు దగ్గర దిగినప్పటినుండి టీచర్లు దింపుకోవడం, మళ్ళీ ఎక్కించడం ఇవన్నీ తెలుసుకుని తను చదివినప్పటి బడి సంగతులు చెప్పేది.

ఈరోజు నాన్నమ్మ మౌనంగా ఉండటం గమనించి, "నానమ్మా! నాన్నలాగా అమెరికా వచ్చిన వాళ్ళు ఎంతమంది ఉన్నారు మన ఊళ్ళో?" అడిగాడు.

"ఇప్పుడు ఇంకో ఇద్దరు వచ్చారు. మీ నాన్నే మొదట వచ్చాడు. మీ తాతకు చాలా గర్వంగా ఉండేది. తన కొడుకు బాగా చదువుకుని మంచి ఉద్యోగం చేస్తున్నాడని! పోయినసారి మేమిద్దరం వచ్చి వెళ్ళాక, కార్తీక్ ఇంత పెద్ద ఇల్లు కొన్నాడనీ, మంచిహోదాలో ఉన్నాడనీ ఎన్నోచెప్పి మురిసిపోయారు ఊరిలో!" అంటూ కళ్ళు తుడుచుకుంది భర్త చనిపోవడం గుర్తుకు చేసుకుంటూ.

"నానమ్మా! నాకూ, రశ్మికి నువ్వంటే లవ్!" ప్రేమగా అన్నాడు.

"నాకు కూడారా నాన్నా! మీరు నా దగ్గరికి వస్తే, ఇన్ని అనుకూలాలు లేవు కదా అనుకుంటాను!"

"ఇక్కడ నీకేమి నచ్చింది?"

"ఎన్నని చెప్పను? మీరందరూ... మీరు ఉన్న ఇల్లు, చుట్టూ ఉన్న పచ్చటిగడ్డీ, దానిని చక్కగా ఉంచడానికి వచ్చే మనుషులూ... ఆఖరికి మన కుక్కల 'పూప్ పికప్' అంటూ రావడం, 'ఆహా!' మేము ఎప్పుడూ వినలేదనుకో!" అంటూ నవ్వింది దేవమ్మ మనసారా.

"ఇంకా..."

"ఇంకా ఏమిటి? ఇంట్లో క్లీనింగు చేసే రోబో గుండ్రంగా తిరుగుతూ దుమ్మే లేకుండా చేస్తుంది. నిముషాల మీద వేడిచేసే మైక్రోవేవ్, బయట చల్లన అయితే, ఇల్లంతా వేడెక్కేలా... బయట వేడైతే లోపల చల్లదనం పెంచుకునేలా ఏర్పాట్లు ఎప్పుడూ

చూడలేదు. ఇక వాషర్లూ, డ్రైయ్యర్‌లూ ఇండియాలోవచ్చాయి. పాత్రలు కడిగే మిషన్లూ ఇంకా కొత్త! సినిమాహాలులో చూసినంతగా మీకూ ఇంట్లోనే హోమ్ థియేటర్ ఉంది. ఇక బయట మీరు చూపించిన సినిమా థియేటర్ లు మరచిపోలేననుకో..."

"మరి ఇన్ని బాగున్నాయి కదా, ఇక్కడే ఉందు నాన్నమ్మా!" ఆశగా అన్నాడు రామ్.

"లేదురా... వెళ్ళిపోవాలి!"

"ఎందుకూ?" అన్న వాడి ప్రశ్నకు జవాబు ఇవ్వకుండా "ఇదిగో ఇంటికి వచ్చేసాం. రేపు ఆదివారమే కదా. నాతో వాకింగ్ వస్తావా?" అంది దేవమ్మ.

"వస్తాను. కానీ నేవు ఇక్కడ ఉండిపోతానంటేనే..." మొండిగా అన్నాడు రామ్ .

"సర్లే రేపు మాట్లాడుదాం!" అంది దేవమ్మ నవ్వుతూ.

ఆదివారం వాకింగుకు కొంచెం ముందుగా బయలుదేరారు బామ్మా, మనమడూ.

"నానమ్మా, నువ్విక్కడే ఉండిపో!" మళ్ళీ మొదలు పెట్టాడు రామ్.

"వద్దురా... నేను వెళ్ళాలి!" అన్న దేవమ్మతో వెంటనే "ఎందుకు?" ఎదురుప్రశ్న వేశాడు.

"ఇంట్లో రోజంతా నేనొక్కదాన్నీ ఉంటాను. మీ అమ్మా, నాన్న ఆఫీసులు, నీ చెల్లికి ప్రీ స్కూలు, మీరు వెనక్కి వచ్చేదాకా ఒంటరిగానే కదా!"

"అయితే ఏమి? నువ్వు టీవీలో ఎన్నో చూస్తావు గదా!"

"నాకు టైమ్‌పాస్ కాదని కాదు..." చెప్పబోయింది.

"ఏమైనా ఎమర్జెన్సీ అయితే 911 కి కాల్ చెయ్యమని కూడా నేర్పించారు కదా" అని బామ్మ వైపు చూసాడు రామ్.

"ఇక్కడ ఇవే నేర్చుకోవాలి. పక్కింటి వాళ్ళతో మాటలూ, పలుకులూ ఉండవు గదా! మొన్న ఒక రోజు పక్క ఇంటికి అంబులెన్స్ వచ్చి హడావిడిగా ఉంటే, పక్కనే ఉన్న మనం వెళ్ళి 'ఏమైందని' అడగాలి కదా?"

"అంబులెన్స్ కాదు నాన్నమ్మా, పారామెడికల్ వాను వస్తుంది మొదట. వాళ్ళు పేషంటును అంతా చెక్ చేస్తారు."

"అదేననుకో... నేను మీ అమ్మకు చెప్పాను. పక్కన ఇంటిలో ఏదో అయ్యింది వెళ్ళి చూడమ్మా అని! మీ అమ్మ వెళ్ళలేదు. నాకు ఎందుకో నచ్చలేదు!" నిరసనగా అంది దేవమ్మ.

"ఇక్కడ అలా వెళ్ళి ఎంక్వైరీ చేస్తే వాళ్ళకు నచ్చదు. అందుకే వెళ్ళదు అమ్మ!"

"ఏమి పద్ధతులో... రోడ్డు మీద ఒక్క మనిషీ నడవరు. ఎప్పుడైనా కొందరు కలిసి నిలబడ్డారు అంటే... కుక్కలను వాకింగ్ తీసుకెళ్ళే వాళ్ళే తప్ప, మనుషుల కోసం కాదు! అన్నట్టు, మొన్న ఏమైందో తెలుసా? నేను రశ్మిని తీసుకుని వాకింగ్‌కి వెళ్ళాను."

"నాకు తెలుసు. ఆరోజు వాన వచ్చింది కదా!"

"..., , , ." రశ్మిని ఎత్తుకున్నా... త్వరగా నడవలేక ఒక ఇంటి ముందున్న పెద్దచెట్టు కింద నిలబడ్డాము. రోడ్డుమీద ఒక్కరూ లేరు. అందరూ తలుపులు మూసుకుని ఉంటారిక్కడ. వర్షం ఇంకా ఎక్కువైంది... తడిసిపోతున్నాం. రశ్మి ఏడవటం మొదలుపెట్టింది. ఇక ఏమిచేయాలో తోచక, నా చీర కొంగు రశ్మి తలమీద కప్పి తడుస్తూ మెల్లిగా రోడ్డు మీద నడుస్తూ ఉండగా... ఎదురుగా ఒక కారు వచ్చింది. ఆపుతారేమో అని చూస్తున్నా, రయ్యమని వెళ్ళిపోయింది. ఎలాగో తడుసుకుంటూ ఇల్లు చేరాము. ఎంత భయమయిందో... రశ్మిని క్షేమంగా ఇల్లు చేరుస్తానా అని!" ఆపింది దేవమ్మ.

"వచ్చేసారు కదా!" కూల్‌గా అంటున్న రామ్ కేసి చూస్తూ, "నీకు అర్థం కాలా, నాకు ఎంత కోపం, బాధా కలిగిందో..."

"కోపం ఎందుకు?"

"కోపం ఎందుకా? వర్షంలో ఒక ముసలామె, చిన్నపిల్ల నడుస్తుంటే, ఒక్కరికీ ఇంట్లోనుండి కనిపించదా? ఎదురుగా చెట్టుకింద నిలబడితే ఇంటివాళ్ళకు కనిపించదా? ఆఖరికి రోడ్డు మీద ఎదురుపడిన కారు వాళ్ళు ఆపి 'ఎక్కడ డ్రాప్ చేయాలి' అని చిన్నమాట అడగరా? ఇదే మా ఊర్లో అయితే వర్షం రాగానే ఎవరైనా తడుస్తూ కనిపిస్తే లోపలకు రమ్మంటారు. చెట్టుకింద నిలబడితే 'అయ్యో! అలా ఎందుకు నేరుగా తలుపు తట్టలేకపోయారా?' అని కూర్చోబెట్టి, తుడుచుకోవడానికి టవల్ ఇచ్చి, వేడివేడి కాఫీ ఇస్తారు. వర్షం తగ్గాక పంపుతారు, లేదా కారు ఉంటే ఇంటి దగ్గర వదిలిపెడతారు. ఇక్కడేమి మనుషులులో... అర్థం కాదు నాకు!"

కోపం, బాధ కలగలుపుగా అంటూన్న నాన్నమ్మతో, "ఇక్కడ కొత్తవారిని పలకరించరు నాన్నమ్మా! కారులో అస్సలు ఎక్కించుకోరు. ఎందుకో తెలుసా? అలా చేస్తే, ఎక్కినవారు ఓనరును కాల్చి కారు పట్టుకుపోతారు అని భయం. అలా జరుగుతాయి ఇక్కడ!"

"ఎప్పుడైనా జరిగి ఉండచ్చు గాక, ఇప్పుడు సాయం కావాల్సిన వాళ్ళెవరు? ఒక ముసలామె, ఒక చిన్న పిల్ల! వీళ్ళు కాల్చి చంపేస్తారా? ఒక పలకరింపు, ఒక సహాయం అవసరమైనప్పుడు... అది చేయని చోట ఎన్ని సదుపాయాలుంటే ఏమి? పొద్దున లేస్తూనే వీధి తలుపులు తెరిచి ఉంచి ఎవరు వచ్చినా, అందరికీ ఆహ్వానం పలికే సాంప్రదాయంలో పుట్టి పెరిగినదాన్ని నేను! చచ్చేదేదో అక్కడే చస్తాను! అందుకే నేను వెళ్ళాలి అంటున్నా... వెళ్ళిపోతా!" కచ్చితంగా చెబుతున్న నాన్నమ్మ బాధ కొద్దిగా అర్థం అయినట్టుగా ఉండిపోయాడు రామ్!

ఆ ఆదివారం వాకింగ్ నుంచి ఇంటికి చేరేసరికి, రామ్ నాన్నమ్మ చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

"నాన్నమ్మా! ఇక్కడ వాళ్లు ఎవర్నీ పలకరించకపోయినా, మన ఊళ్ళోలాగా సహాయం చేయకపోయినా చెడ్డవాళ్ళు కాదు." అని అన్నాడు రామ్ , తన చిన్నమనసుతో పెద్ద మాట చెప్పినట్టు.

దేవమ్మ రామ్ ముఖం వైపు చూసి, "నిజమేరా బాబూ! ప్రతిదేశానికీ, ప్రతి ఊరికీ వారి జీవనరీతి ఉంటుంది. మనకి కొత్తగా, విచిత్రంగా అనిపించేది. వాళ్ళకు సహజం. మనది వాళ్ళకు కొత్త. అందుకే ఎవరిపైనా మనం తీర్పు చెప్పలేం!"

కొన్ని క్షణాలు ఆగి ఆమె మెత్తగా మాట్లాడింది.

"నేను వెళ్ళాలని అనుకోవటం... వాళ్ళిలా ఉన్నారని కాదురా! నా మనసు పాత గడియారంలా, ఎక్కడ మోగితే సుఖంగా ఉంటుందో... అక్కడికే వెళ్ళాలని తపిస్తోంది అంతే!"

కార్తీక్, రామ్ చెప్పిందాన్ని బట్టి దేవమ్మఎందుకు వెళ్ళిపోవాలనుకుంటోందో అర్థం చేసుకున్నాడు. ఆవిడ అలా వెళ్ళిపోవాలనుకోవడం సహజమే అనిపించింది.

ఆరోజు రాత్రి భోజనాల తర్వాత దేవమ్మతో కూర్చుని కార్తీక్ మెల్లిగా అడిగాడు "మా దగ్గరే ఉంటే బాగుంటుందమ్మా" అని!

"మీ ఇంట్లో నాకు ప్రేమ తక్కువ అయిందని కాదు. మీ జీవనం కూడా అందమే. మీ నాన్న తర్వాత నాకు ఆయన తిరుగాడిన ప్రదేశంలో ఉంటే బాగుంటుందనిపించింది. ఇక్కడ నచ్చక ఏదో అసంతృప్తితో వెళ్ళి పోవాలనుకున్నానని అనుకోకు. ఇక్కడ వారి స్వభావాలు, అలవాట్లు, పద్ధతులు వేరు. అవి మంచివో, చెడ్డవో అన్నది అనవసరం!" దేవమ్మ మాటల్లో ఆమె మనసు బయటపడింది.

ఎవరినీ తప్పులు పట్టని దేవమ్మ ఆలోచన కార్తీక్‌ని అబ్బురపరిచింది.

కార్తీక్ వెంటనే మృదువుగా అన్నాడు, "అమ్మా, అర్థం అయ్యింది, నువ్వు ఊరికే వెళ్ళాలనే అంటే ఏర్పాట్లు చేస్తాను. కానీ మన విలువల్ని, మన ఊరి సుగంధాన్ని... మాకు చూపించడానికి నువ్వు వచ్చి, పోతూ ఉండాలి!"

దేవమ్మ చిరునవ్వుతో ఓదార్చింది. "విలువలు ఎక్కడైనా ఒకటేరా! మానవత్వం కొంచెం మారినా, అందరూ తమతమ బాటలో మంచివాళ్ళే. అర్థం చేసుకుంటూ బతికితే, మన ప్రపంచం ఎక్కడైనా ఒక్కటే!" అంటూన్న దేవమ్మ తత్వానికి మనసులో జోహార్లు చెప్పుకున్నాడు కార్తీక్.

# శాలువా


కోనే వెంకట నాగ ఆంజనేయులు
✆ 9290660220


***నేను చేసిన ఈ పనిని శివరావు నిశ్చేష్టుడై అలా చూస్తూ ఉండిపోవడం కనుకొలకులలో నుండి నేను గమనించాను. వాడు ఏం మాట్లాడలేదు. నేను కూడా మౌనంగానే ఉండిపోయాను. తను మనసు పడిన అంత మంచి శాలువాను నేను ఆ ముసలి వాడికి ధర్మం చెయ్యడం శివరావుకి నచ్చలేదని నాకు అర్థమయింది.***

సాయంత్రం ఆరుగంటలకు ఓ ప్రముఖ సాహితీ సంస్థ నిర్వహిస్తున్న సభలో నాతోపాటు నా మిత్రుడు శివరావుకి కూడా సన్మానం జరగబోతోంది. ఇద్దరం చిన్నపాటి రచయితలం. అదీ సన్మానానికి మాకున్న అర్హత! అంతే కాకుండా... మేమిద్దరం చిన్నప్పుడు పాఠశాలలో చదువుకుంటున్నప్పటి నుండీ కూడా స్నేహితులమే. అనుకోకుండా ఒకే ఊళ్ళో ఉద్యోగాలు రావడం, దగ్గర దగ్గర లోనే ఇళ్లు కట్టుకోవడంతో మా ఇద్దరి మధ్య మైత్రి మరింత బలపడింది.

ఈ సందర్భంలో వాడి స్వభావం గురించి కూడా కొంచెం చెప్పాలి. వాడికి అసూయ ఎక్కువ. తను ఇష్టపడినది ఏదైనా ఇతరులదగ్గరఉంటే,సహించలేనిదుర్గుణంఉందివాడిలో!ఏదోవిధంగాదాన్నితనూపొందాలనితహతహలాడుతుంటాడు. ఆ వస్తువు మరెక్కడా దొరకని అరుదైనది అయితే, దొంగతనంగానైనా దాన్ని స్వంతం చేసుకునే స్వభావం శివరావుది. మా చిన్నతనంలో ఓ సారి తన దగ్గర లేని ఓ అరుదైన స్టాంప్‌ని, వాడు నా స్టాంప్స్‌బాక్స్ లోంచి దొంగతనంగా స్వంతం చేసేసుకున్న సంగతి నాకు తెలిసిపోయినా, గుంభనంగా ఉండిపోయాను.. అడిగి వాడిని నొప్పించడం ఇష్టం లేక! అలాగే ఓసారి మా క్లాస్‌మేట్ ఒకడు... వాళ్ళ మావయ్య వాడికి అమెరికా నుండి తీసుకువచ్చి ఇచ్చిన నాణేలు గర్వంగా ప్రదర్శించాడు క్లాస్‌లో! ఆ తరువాత వాడు ఆ నాణేలు లెక్కబెట్టుకుంటే, అందులోంచి కొన్ని నాణేలు మాయమైనట్టు గ్రహించాడు. భోజనాల సమయంలో క్యాంటీన్‌కి వెళ్ళి వచ్చేలోగా, ఆ నాణేలు వాడి పుస్తకాల సంచీలోంచి ఎవరో దొంగిలించారని మాత్రం గ్రహించాడు గానీ, అది ఎవరు చేసారన్న విషయం మాత్రం గ్రహించలేకపోయాడు. అది మా శివరావుగాడి పనే అని తెలిసినా... ఆ విషయం బయటికి చెప్పలేని అశక్తుడినయ్యాను నేను.

అసలు... రచయితగా నాకు వస్తున్న పేరు ప్రఖ్యాతులు చూసి సహించలేకే, వాడు కూడా రచనలు చేయడం మొదలుపెట్టి ఉంటాడని నా అనుమానం. అయినా పట్టుదలతో కృషిచేసి రచయితగా ఇప్పుడిప్పుడే అంతో ఇంతో పేరు తెచ్చుకుంటున్న శివరావుని చూసి నాకు అసూయ కలగలేదు. పైగా సంతోషం కూడా కలుగుతోంది. పోటీ ఎప్పటికైనా మంచే చేస్తుందనే నమ్మకం ఉన్నవాడిని నేను.

సరే... తనకి స్కూటర్ లేకపోవడంతో, సభకి నాతో పాటు నా స్కూటర్ మీద వస్తానని ఫోన్ చేసి చెప్పేడు శివరావు. 'అలాగే ఇద్దరం కలిసే నా స్కూటర్ మీద వెళదాం' అని, నా అంగీకారం తెలియజేసాను.

ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు రెండు వీధుల అవతల ఉన్న శివరావు ఇంటికి స్కూటర్ మీద వెళ్ళేను. అప్పటికే తయారుగా ఉన్న శివరావు నా స్కూటర్ శబ్దం వినగానే బయటికి వచ్చి, స్కూటర్ వెనక సీటు ఎక్కేడు. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సభ జరిగే ఆడిటోరియంకి బయలుదేరేము.

నాలుగు కిలోమీటర్లు వెళ్ళిన తర్వాత... పాతదైన నా స్కూటర్ కాస్త ఇబ్బంది పెట్టి, మొరాయించడంతో కాస్త ఎక్కువ దూరమే నడిపించుకుని మెకానిక్ షెడ్ చేరుకుని, బండి రిపేర్ చేయించుకుని, తిరిగి మా ప్రయాణం కొనసాగించాము. మేము వెళ్ళేసరికి ఆలస్యం కావడంతో, అప్పటికే ఆడిటోరియం మొత్తం ఆహూతులతో కిక్కిరిసిపోయి ఉంది. చివరి వరుసల్లో రెండుచోట్ల రెండు కుర్చీలు మాత్రం ఖాళీగా కనబడితే, వాటిని ఒక్క చోటికి చేర్చి, మేమిద్దరం వాటిని ఆత్రంగా ఆక్రమించుకున్నాం.




యథావిధిగా అన్ని కార్యక్రమాల్లో లాగానే ముఖ్య అతిథి రాక ఆలస్యం కావడంతో, సభ కూడా అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. అసలు మరో కొంపలు మునిగే కార్యక్రమం ఏదీ లేకపోయినా, ముఖ్య అతిథి లేటుగా రావాలి కాబట్టి, వారు కావాలనే అలా ఆలస్యంగా వస్తారేమో అని నా అనుమానం.

ముఖ్యులను వేదిక మీదకు వారి పరిచయంతో సాదరంగా ఆహ్వానించారు కమిటీవారు. వారు పూలగుత్తులు, పళ్ళు అందుకుని వేదిక మీది కుర్చీలలో ఆసీనులయ్యారు. ముఖ్య అతిథి ఉపన్యాసం, మిగతా వక్తల ప్రసంగాల అనంతరం

రచయితలకు సన్మాన కార్యక్రమం మొదలయింది. ఓ ఇరవై మంది వరకూ సన్మానగ్రహీతలం ఉన్నట్టు తెలిసింది. లిస్టులో నా నంబర్ తొమ్మిది అయితే, శివరావుది పదకొండు!

నాకు సన్మానం జరుగుతున్నప్పుడు ఫోటోలు తీయడం వాడి విధి. వాడి సన్మాన సమయంలో ఫోటోలు తీయడం నా కర్తవ్యం. ఇలా ముందుగానే ఒప్పందం కుదుర్చుకున్నాం మేమిద్దరం... సభకి వస్తున్నప్పుడు దారిలోనే!

నా పేరు పిలవగానే నేను స్టేజి మీదకు వెళ్ళేను. సింహాసనంలాంటి కుర్చీలో నన్ను కూర్చోబెట్టి, పూల గుత్తి చేతికిచ్చి, కొన్ని పుస్తకాలు బహూకరించిన తరువాత, శాలువా కప్పేరు నాకు నిర్వాహకులు. శివరావు వాడి ఫోనులో వివిధ భంగిమలలో నా ఫోటోలు తీయసాగేడు.

సన్మానగ్రహీతలు ఎక్కువ మంది ఉండడంతో కాబోలు... నేను స్టేజ్ మీద కుర్చీలో కూర్చుని, శాలువా కప్పించుకుని, ఫోటోలు తీయించుకుంటుండగానే, నా తరువాత సన్మానం అందుకోవలసిన వారి పేరు ప్రకటించేసారు నిర్వాహకులు. ఆయన వేగంగా స్టేజ్ ఎక్కి... ఎంత త్వరగా నేను కుర్చీ ఖాళీ చేస్తానా అన్నట్టు ఎదురు చూస్తుండటంతో, నేను నా పూలగుత్తి, పుస్తకాలు, శాలువా అన్నీ లుంగ చుట్టుకుని కుర్చీ ఖాళీ చేసేసి, గబగబా స్టేజ్ దిగేసాను. నేను ఖాళీచేసిన కుర్చీలో ఆయన కూర్చున్నాడు ఆత్రంగా!

ఆయనకు సన్మానం జరుగుతుండగా... నేను నా సీట్‌లోకి వచ్చేసి, శాలువా మడత పెట్టి నాతో తెచ్చుకున్న సంచీలో పెట్టుకుందామనుకునేంతలో... మా శివరావు పేరు మైకులో అనౌన్స్ చేసేసారు. వాడు హడావిడిగా స్టేజ్ ఎక్కి, అమితమైన ఆనందంతో కుర్చీలో కూర్చున్నాడు. నేను నా ఫోన్‌లో వాడి ఫోటోలు తీస్తున్నాను. వాడి హడావిడి సన్మానం ముగియగానే, వాడు కూడా కుర్చీ ఖాళీ చేసి స్టేజ్ దిగేసాడు.

శివరావు తన శాలువా, జ్ఞాపిక వగైరా సరంజామా సర్దుకుంటూ... నా శాలువా వైపు దృష్టి సారించాడు. వాడికి కప్పిన శాలువా కంటే నా శాలువా నెమలి కంఠం రంగులో మరింత ఆకర్షణీయంగా కనబడుతోంది. అది చూసి వాడు తన శాలువాని, నా శాలువాతో పోల్చి చూసుకుని అసంతృప్తితో పెదవి విరవడం నా దృష్టిని దాటిపోలేదు. వాడి శాలువా కంటే నా శాలువా కాస్త డాబుగా, దర్పంగా కనిపించడం నిజమే గానీ, వాడి శాలువా కూడా తీసి పారేయదగినదేమీ కాదు!

అప్పటికి సమయం రాత్రి తొమ్మిది గంటలు కావడంతో... ఇంకా సన్మాన కార్యక్రమాలు కొనసాగుతుండగానే మేము తిరుగు ప్రయాణమైపోయాము. చలిలో పది కిలోమీటర్లు వెళ్ళాలి మరి... మేము మా ఇళ్ళకు చేరుకోవడానికి!

స్కూటర్ మీద కాస్త దూరం వెళ్లగానే, అప్పటి వరకూ ముభావంగా ఉన్న శివరావు నోరు విప్పేడు.

“చూసావా వాళ్ల పక్షపాతం! నువ్వు నాకంటే పెద్ద రచయితవు కాబట్టి, నీకు మంచి శాలువా కప్పి, నాకు నాసిరకం శాలువా కప్పేరు” అన్నాడు కాసింత బాధ పడుతూ.

నేను నవ్వేను. “అలా ఏం ఉండదురా! వాళ్ళు కొన్న శాలువాల్లో, ఆ సమయానికి ఏది చేతికి దొరికితే ఆ శాలువా కప్పేస్తారు. ఇందులో నా గొప్పతనం గానీ, నీ తక్కువతనం గానీ ఏమీ లేదు!” అని నా గత సన్మానాల అనుభవంతో సముదాయించాను గానీ, వాడి ముఖంలో గానీ, మాటలో గానీ సంతృప్తి కనిపించలేదు నాకు.

ఆ రాత్రిపూట స్కూటర్ మీద వేగంగా వెళుతుంటే శీతాకాలం కావడంతో బాగా చలిగా అనిపిస్తోంది. నేను స్వెట్టర్ వేసుకుని ఉన్నా వణుకుతూనే ఉన్నాను. వాడు స్వెట్టర్ వేసుకు రాకపోవడంతో… తనకు సన్మానంలో కప్పిన శాలువా కవరులోంచి తీసి, వీపు మీద నుంచి భుజాల మీదుగా కప్పుకున్నాడు.

“ఇప్పుడు చలి తగ్గిందా?” అని నేను అడిగినా శివరావు దగ్గర నుండి సమాధానం రాలేదు. ఆ గాలిహోరులో నేను అడిగింది వాడికి వినబడలేదో, లేక శాలువా అసంతృప్తి నుంచి వాడు ఇంకా తేరుకోలేదో… నాకు బోధపడలేదు.

వాడిని వాళ్ల ఇంట్లో దింపి, నేను మా ఇంటికి వెళ్ళాలంటే మెయిల్ రోడ్డులోంచి వెళ్ళాలి. అందుకే స్కూటర్ని పక్క రోడ్డులోంచి, మెయిన్రోడ్డులోకి మళ్ళించాను జాగ్రత్తగా! మేము స్కూటర్ మీద కాస్త ముందుకు వెళ్ళిన తర్వాత.. రోడ్డుకి కొంచెం ఎడంగా కొందరు ముష్టివాళ్ళు ఫుట్ పాత్ మీద వణుకుతూ పడుకుని కనిపించారు. కొందరికి ఒంటిమీద ఏవేవో వస్త్రాలు ఉన్నాయి గానీ, అవి చలిని కాచుకునేలా లేవు.

మరి కొంచెం దూరంలో… రోడ్డుకి దగ్గరలో ఫుట్ పాత్ మీద వీధి లైటు కింద, ఓ ముసలతను పడుకుని ఉన్నాడు చలికి గజ గజా వణికిపోతూ! లైటు వెలుతురులో అతను వణికి పోతుండడం నాకు స్పష్టంగా కనబడుతోంది. అతని ఒంటి మీద చిరిగిపోయిన ఓ పలుచని బనీను తప్ప, కప్పుకోడానికి వేరే వస్త్రం ఏదీ లేదు. నెమ్మదిగా అతనికి దగ్గరలో రోడ్డు పక్కన స్కూటర్ ఆపేను.

“ఇక్కడ ఆపేవేమిటి? మా ఇల్లు ఇంకో రెండు సందుల అవతల కదా?” చెప్పేడు శివరావు.

“మీ ఇంటివరకూ తీసుకు వెళతానులే గానీ కాస్త ఆగు” అని వాడికి చెప్పి, నా సంచీలోంచి సభలో నాకు కప్పిన శాలువా పైకి తీసి విప్పి, ఆ ముసలివాడి శరీరం మీద పూర్తిగా కప్పేను. ఆ ముసలివాడు ఆ నిద్రలోనే “దరమ పెబువులు సల్లగుండాల” అని దీవిస్తూ ఆ శాలువాలోకి పూర్తిగా దూరిపోయాడు. క్షణాల్లో అతని దేహం వణకడం ఆగిపోయింది. అది చూసి నేను సంతృప్తిగా నిట్టూర్చేను.

నేను చేసిన ఈ పనిని శివరావు నిశ్చేష్టుడై అలా చూస్తూ ఉండిపోవడం కనుకొలకులలో నుండి నేను గమనించాను. వాడు ఏం మాట్లాడలేదు. నేను కూడా మౌనంగానే ఉండిపోయాను. తను మనసు పడిన అంత మంచి శాలువాను నేను ఆ ముసలివాడికి ధర్మం చెయ్యడం శివరావుకి నచ్చలేదని నాకు అర్థమయింది.

అనేక సాహితీసభల్లో నాకు సన్మానం చేసి కప్పిన శాలువాలు నా దగ్గర చాలా ఉండిపోతాయి. అలా నా దగ్గర పేరుకుపోయిన శాలువాలను, నేను ఇలా ఎవరో ఒకరికి ఉదారంగా గానీ, బహుమతిగా గానీ ఇచ్చేస్తుంటాను. రాత్రిపూట రైలు, బస్సు ప్రయాణాల్లో కప్పుకోవడం కోసం ఒకటో రెండో శాలువాలు మాత్రం నా కోసం ఉంచుకుంటాను. అన్నీ నేనేం చేసుకుంటాను!

రెండుసందుల తరువాత శివరావుని వాడి ఇంటి దగ్గర దింపేసి ‘శుభరాత్రి’ చెప్పేసి, నేను మా ఇంటి వైపు స్కూటర్ని పోనిచ్చాను.

కొద్ది రోజుల తరువాత... ఓ రోజు రాత్రి బస్సులో మా అమ్మాయి ఇంటికి వెళ్ళి తిరిగి వస్తూ, మా వీధి జంక్షన్‌లో బస్సు దిగి అక్కడికి దగ్గరలోనే ఉన్న శివరావు ఇంటికి వెళ్ళేను.. వాడి దగ్గర ఉండిపోయిన అరుదైన నా పుస్తకం ఒకటి తిరిగి తెచ్చుకోవడానికి. కాలింగ్‌బెల్ శబ్దానికి తలుపు తీసి ఎదురుగా కనిపించిన నన్ను చూస్తూనే వాడు తత్తరపడుతూ హడావిడిగా లోపలికి వెళ్ళిపోయి, అప్పటి వరకూ తన ఒంటి మీద కప్పుకున్న శాలువాను తీసి లోపల పడేసి బనీనుతో బయటికి వచ్చాడు.

ఆ కొద్ది క్షణాల్లోనే నేను గుర్తించాను. అది నేను కొద్ది రోజుల క్రితం ఫుట్‌పాత్ మీద ముసలి బిచ్చగాడికి కప్పిన నెమలి కంఠం రంగు శాలువా! జరిగింది ఏమిటో ఊహించడం నాకు పెద్ద కష్టం కాలేదు. ఎప్పటిలాగే ఇంకేమీ మాట్లాడకుండా, వాడి చేతిలోంచి నా పుస్తకం తీసుకుని, వెంటనే వాడి ఇంట్లోంచి బయటికి వచ్చేసి, మా ఇంటివైపు నడక సాగించాను నేను!

# తింగరి తిక్క కుదిరింది!

మాచిరాజు కామేశ్వర రావు
✆ 9000080396

కథామంజరి
బాలకథ

*"ఒళ్ళు పెద్దది చేసుకుని లాభం ఏం వుంది? అందరినీ భయపెట్టి, ఇంకా దూరం చేసుకోవడం తప్పించి! అయినా అలా పెంచుకోవడం మన చేతిలో లేదు. మనసుని పెద్దది చేసుకో! తింగరి పనులు మాని, అందరితో కలిసి మెలసి వుండు! అప్పుడు అందరూ నిన్ను ప్రేమిస్తారు, నీ స్నేహం చేస్తారు!"*

తిమ్మాపురం అడవిలో తింగరి అనే కోతి ఉండేది. అది పేరుకు తగినట్లు తింగరి పనులు చేస్తూ ఉండేది. తను ఉన్న వెలగచెట్టు మీదకు పక్షులను చేరనిచ్చేది కాదు. "ఇది నా చెట్టు! ఈ చెట్టు మీద ఎటువంటి పిట్టా వాలడానికి వీలు లేదు!" అంటూ చెట్టు మీద వాలబోయిన పక్షులను తరిమేసేది.

ఆ దారిలో వచ్చే చిన్నచిన్న జంతువులను భయపెడుతూ ఉండేది. దూరంగా పోతున్న జంతువులను వెలగకాయలతో కొడుతూ ఉండేది. అది చేసే అల్లరికి ఆ అడవిలో ఉన్న జంతువులన్నీ చిరాకుపడేవి. దానితో ఏ జంతువూ మాట్లాడేది కాదు.

ఇలా ఉండగా... ఒకరోజు అది చెట్టు మీద కూర్చుని ఉండగా, ఒక ఏనుగు ఆ వైపుకు వచ్చింది. అది తన భారీకాయంతో వస్తూ ఉంటే, జంతువులన్నీ భయంతో పక్కకు తప్పుకుని దారి ఇస్తున్నాయి. ఏనుగు తిన్నగా వెలగచెట్టు దగ్గరకు వచ్చింది. దానిని బెదిరించడానికి తింగరికి ధైర్యం చాలలేదు.

"వెలగపళ్ళు తింటావా మామా?" అని భయం భయంగా అడిగింది తింగరి.

ఏనుగు తొండం ఊపుతూ... "ఏమిటా పిచ్చి ప్రశ్న? నాకు వెలగపళ్ళు అంటే ఇష్టం అని తెలియదా నీకు?" అని కోపంగా అడిగింది.

తరువాత అది బోలెడు కొమ్మలు విరిచి, కడుపు నిండా వెలగపళ్ళు తిని, చెరువు కేసి బయలుదేరింది. హుందాగా నడుచుకుంటూ వెళుతున్న ఏనుగును చూస్తే, తను కూడా ఏనుగులా పెద్ద శరీరం పెంచాలని కోరిక పుట్టింది తింగరికి!

అది ఆ ఏనుగును అనుసరిస్తూ వెనకే వెళ్ళి, "ఏనుగు మామా! నీకింత పెద్ద శరీరం ఎలా వచ్చింది? నేను కూడా నీలా పెద్దగా అవ్వాలంటే ఏం చేయాలి?" అని అడిగింది.

ఆ మాటలకు ఏనుగు తనలో తాను నవ్వుకుని, "నేను పూటకు నాలుగు కుండల నీళ్ళు తాగుతాను!" అంది వేళాకోళంగా.

ఆ మాటలు నిజమని నమ్మి, తింగరి వెంటనే చెరువు దగ్గరకు పరుగు తీసి, అతి కష్టం మీద, ఒక కుండడు నీళ్ళు తాగింది.

అంతే... అది ఏనుగులా పెరగలేదు కానీ, దాని పొట్ట మాత్రం గాలి కొట్టిన బుడగలా ఉబ్బి పోయింది. అది ఆయాస పడుతూ, నడవలేక నడవలేక నడుస్తూ, తన చెట్టు వైపుకు వెళుతూ ఉంటే, ఒక కుందేలు చూసి, "ఏమిటి తింగరి బావా, నీకీ తిప్పలు!" అని అడిగింది.



మళ్లీ అదే "ఇదేదో జబ్బులా ఉంది. మందిచ్చే మస్తానమ్మ దగ్గరకు వెళ్ళు!" అని సలహా ఇచ్చి, తన పొదలోకి వెళ్ళిపోయింది.

ఎలుగుబంటి మస్తానమ్మ తింగరిని చూస్తూనే, "నీ పొట్ట ఏమిటి, ఇలా ఉబ్బి పోయింది?" అని అడిగింది.

తింగరి తల దించుకుని, "ఎందుకో తెలియదు! నిద్రలేచేసరికి ఇలా ఉంది. నడవాలంటే ఆయాసం. ఏదైనా పసరుమందు పోసి పుణ్యం కట్టుకో !" అంది

ఎలుగు, తింగరి పొట్ట నొక్కి చూసి, "ఎప్పుడూ వైద్యుడి దగ్గర అసత్యం చెప్పకూడదు. నీ పొట్ట నిండా నీళ్లు ఉన్నాయి. ఇన్ని నీళ్ళు ఎందుకు తాగావో చెప్పు!" అంది కోపంగా.

ఇక తప్పించుకోలేక, జరిగిందంతా చెప్పి, "ఆ ఏనుగులా పెద్ద శరీరం కావాలని ఆశపడి, కుండడు నీళ్ళు కష్టపడి తాగేసాను! ఇప్పుడు పొట్ట బరువు భరించలేక పోతున్నాను!" అంది తింగరి కళ్ళనీళ్ళతో.

దానికి మస్తానమ్మ, "ఒళ్ళు పెద్దది చేసుకుని లాభం ఏం ఉంది? అందరినీ భయపెట్టి, ఇంకా దూరం చేసుకోవడం తప్పించి! అయినా అలా పెంచుకోవడం మన చేతిలో లేదు. మనసుని పెద్దది చేసుకో! తింగరి పనులు మాని, అందరితో కలిసిమెలసి ఉండు! అప్పుడు అందరూ నిన్ను ప్రేమిస్తారు, నీ స్నేహం చేస్తారు!" అంది దాని చేత పసరుమందు తాగిస్తూ.

పసరుమందు తాగాక... పెద్ద వాంతి అయి, ఉబ్బి పోయిన తింగరి పొట్ట మామూలుగా అయింది.

ఈ అనుభవంతో బుద్ధి తెచ్చుకున్న తింగరి... పూర్తిగా మారి, ఆ రోజు నుంచి అన్ని జంతువులతో స్నేహంగా ఉండటం, తోచిన సహాయం చేయడం మొదలుపెట్టింది.

# మేకతల్లి త్యాగం

శ్రీమతి ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి
✆ 9849464017

కథామంజరి
బాలకథ

***చంచల గుహ దగ్గరకి వెళ్ళేసరికి, మేక... పులిని బ్రతిమలాడుతూ కనిపించింది. పులి 'తను చాలా ఆకలిగా ఉన్నానని వదలనని' చెబ్తోంది. చంచల కూడా పులిని ఎంతో బ్రతిమలాడింది. కానీ పులి ఒప్పుకోలేదు.***

***అప్పుడు మేక "సరే పులిరాజా! మీ ఆకలి తీర్చటానికి నా బిడ్డను తెస్తాను. అంతవరకూ దీన్ని తినకండి." అంది. పులితో పాటు నక్కా ఆశ్చర్యంగా చూసింది.***

కనకాపురం అడవిలో చంచల అనే ఒక జిత్తులమారి నక్క ఉండేది. అందరినీ బాధించేది. అవమానించేది. రాజుకు ఇతర జంతువులపై చాడీలు చెప్పేది. శిక్షలు వేయించేది. ఆనందముగా నవ్వుకునేది. కానీ పైకి మాత్రం తీయగా మాట్లాడేది. అయినా దాని గుణాలు కనిపెట్టటం వల్ల ఇతర జంతువులు అన్నీ దానికి దూరముగా ఉండేవి. దాన్ని ఉంచేవి.

ఒక మేక మాత్రం దాని మాయమాటలు నమ్మి, స్నేహముగా ఉండేది. నక్కకూడా తన గొప్పలు చెప్పుకోవటానికి, ఇతరత్రా జంతువులూ తనని దూరముగా ఉంచటముతో... మేకతో స్నేహంగా ఉండేది. నిజానికి నటించేది.

నక్కకి లేకలేక చాలా కాలానికి ఒక పిల్ల పుట్టింది. దానితో దాని గర్వం, గొప్పలు పెరిగిపోయాయి. చాలా గారాబం చేయటం వల్ల, పిల్ల కూడా తల్లిలానే తయారయి... చాడీలు చెప్పటం, కొట్లాటలు పెట్టటం, అల్లరి, ఎవరినీ లెక్క చేయకపోవటం, అమాయకముగా ఉంటే ఏడిపించటం మొదలయినవి చేసేది. దానిమీద ఇతర జంతువులు తల్లి చంచలకి చెప్పినా, అది పట్టించుకోకపోవటం వలన దాని అల్లరి మరింత పెరిగింది. చంచల పట్టించుకోకపోగా, దాని పనులు తెలివితేటలుగా తలచి, తను మురిసిపోవటమే కాక, అందరూ దానిని చూసి అసూయ పడుతున్నారని అనుకునేది, అనేది!

చేసేది ఏమీ లేక, మనస్సులో తిట్టుకున్నా... తల్లీపిల్లలని భరించేవి ఇతర జంతువులు!

చంచల ముఖ్యముగా మేకపిల్లలతో తన పిల్లని పోల్చి, వాటిని తెలివితక్కువవానిగా వర్ణిస్తూ, తన కూతురు గొప్ప చెప్పేది. అంతేకాక స్నేహం నటిస్తూనే, మేకను, దాని పిల్లలని అవమానించేది. తల్లితో కలిసి నక్క పిల్ల కూడా... మేకపిల్లను ఎక్కిరించేది, ఏడిపించేది. కానీ మేక స్నేహధర్మముగా ఊరుకునేది. తను ఊర్కోవటమే కాక... 'అది చిన్నపిల్లని, పెద్దయితే మారుతుందని' పిల్లలని కూడా సముదాయించేది. చంచల చెప్పేది... వాటి మంచికేనని నచ్చచెప్పేది.

ఒకనాడు చంచల ఆహారం తెచ్చేసరికి, పిల్ల కనబడలేదు. అందరినీ అడిగింది. కానీ అవి మాకు తెలియదని చెప్పాయి. మనస్సులో దానికి తగిన శాస్తి జరిగిందని ఆనందించాయి. చంచల ఏడుపుకి అంతులేదు. చాలా సమయము గడిచిన తరువాత, ఒక కోతి హడావిడిగా వచ్చి, చంచల పిల్లని పులితో, ఒక గుహ దగ్గర చూశానని, మేక కూడా అక్కడుందని చెప్పింది.

చంచల మరింత బిగ్గరగా ఏడుస్తూ, తనని ఆ గుహ వద్దకు తీసుకెళ్ళమని కోరింది. రెండూ కలిసి గుహ వద్దకు వెళ్ళాయి. నక్కకి గుహను దూరంనుంచి చూపించి, వెంటవస్తే తనకీ ప్రమాదమని చంచల పిలుస్తున్నా పారిపోయింది కోతి!



చంచల గుహ దగ్గరకి వెళ్ళేసరికి, మేక... పులిని బ్రతిమలాడుతూ కనిపించింది. పులి 'తను చాలా ఆకలిగా ఉన్నానని వదలనని' చెబ్తోంది. చంచల కూడా పులిని ఎంతో బ్రతిమలాడింది. కానీ పులి ఒప్పుకోలేదు.

అప్పుడు మేక "సరే పులిరాజా! మీ ఆకలి తీర్చటానికి నా బిడ్డను తెస్తాను. అంతవరకూ దీన్ని తినకండి." అంది.

పులితో పాటు నక్కా ఆశ్చర్యంగా చూసింది.

"ఏమి... ఆమెకి పిల్లపై ప్రేమ ఉన్నట్లు, నీకు పిల్లలపై లేదా?" అంది పులి వెటకారముగా!

"ఎందుకు లేదు మహారాజా! చాలా ఉంది. ఏ తల్లికి ఉండదు పిల్లలమీద ప్రేమ! నాకు నలుగురు పిల్లలు. పాపం ఆమెకి ఒక్కర్తే కూతురు, ఆమె లేకపోతే బ్రతకలేదు. అందుకే నా తల్లి మనస్సుని చంపుకుంటున్నాను!" అంది.

మేక మాటలకి, స్నేహనిరతికి, త్యాగానికి నక్కకి దిగ్భ్రమ కలిగింది. ఆమెని, పిల్లలని.. తను, పిల్ల ఎంత సతాయించేవి, ఏడిపించి బాధించేవి?

“అంత తల్లి మనస్సు ఉంటే, బిడ్డను ఇవ్వటము ఎందుకు? నువ్వే ఆహారం కావచ్చుగా!” అంది పులి మళ్ళీ వెటకారముగా!

“కావచ్చు రాజా, కానీ నా పిల్లలు చిన్నవాళ్లు. నేను లేకుంటే నలుగురూ అనాథలు అవుతారు. ఏమైనా చంపేస్తాయి కూడా. అందువల్ల నేనుండాలి!” అంది.

ఆమె స్నేహనిరతికి, తల్లిమనస్సుకు, త్యాగబుద్ధికి, మంచి మనస్సుకు ముగ్ధుడైన పులిరాజు, నక్కపిల్లని వదిలెయ్యటమే కాక, మేకపిల్లని కూడా తేనవసరం లేదని చెప్పేసింది.

మూడూ ఆనందముగా తిరుగుదారి పట్టాయి!

బుద్ధి వచ్చిన నక్క, పిల్ల మరెప్పుడూ తమ వక్రబుద్ధితో స్వార్థముతో ఇతర జంతువులను బాధించలేదు.

# నన్ను క్షమించొద్దు!

డా. మద్దాలి ఉషా గాయత్రి

**విశిష్ట అతిథి కథ**

*తండ్రిని ఒక వృద్ధాశ్రమంలో చేర్పడానికి నిర్ణయించుకున్నాడు. దానికయ్యే ఖర్చు అంతా భరిస్తానన్నాడు. ఇప్పుడు మీతో నేను మాట్లాడినట్టే అతను నాతో చాలా సేపు మాట్లాడాడు. ఏదిఏమైనా కట్టుకున్న భార్యని క్షోభ పెట్టిన వాళ్ళకు ఇలాంటి శాస్తే జరగాలి. ఆమె ఉసురు ఇతనికి తప్పకుండా తగిలే వుంటుంది. అందుకే అతను ఇలా...." వెంటనే చటుక్కున నర్సు నోటికి తన చేతిని అడ్డు పెట్టి ఇక ఆపై మాట్లాడొద్దని కళ్ళతో వారించింది.*

"అమ్మా"

కళ్ళు తెరిచింది ప్రభాత.

ఎదురుగా మంచం దగ్గరగా నిలబడి వున్నాడు ప్రదీప్.

"నాన్న ఎక్కడ?" ప్రశ్నను రెట్టించాడు.

మౌనంగా తల తిప్పుకుంది.

"అక్కడే ఆవిడ దగ్గరే వున్నాడా?" అసహనంగా ధ్వనిస్తోంది అతని గొంతు.

సమాధానంగా కన్నీళ్ళు ఉబికాయి.

"నువ్వెందుకు ఊరుకుంటావో నాకస్సలు అర్థం కాని విషయం" అంటూ భుజాలను పట్టుకుని కుదుపుతూ అన్నాడు ప్రదీప్.

ఇంక లాభం లేదన్నట్టుగా తోచి లేచి కూర్చుంది ప్రభాత.

"ఇందులో అర్థం కాని విషయం ఏముంది నాన్నా! నాన్నకు అక్కడ బావుంది. అక్కడే వుంటున్నారు అంతే! ఒకవేళ ఇక్కడున్నా ముళ్ళ మీద ఉన్నట్టుంటారు."

"మరి శాస్త్రబద్ధంగా నీకు వేసిన మూడుముళ్ల మాటేంటి? దానికి కట్టుబడి ఉండక్కర్లేదా?" తండ్రి మీద కోపాన్ని అణిచివేసుకోలేకపోతున్నాడు.

ఎదిగిన కొడుకు వేసే ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పాలో తెలీడం లేదు ప్రభాతకు!

అమెరికాలో ఉంటున్న కొడుకుకి చూచాయిగా ఇక్కడ జరుగుతున్న విషయాలన్నీ కర్ణాకర్ణిగా తెలిసాయి.

అందుకే వున్న పాట్నే బయల్దేరి వచ్చాడు.

తల్లికి కూడా ఓ ఆరెల్లుగా ఒంట్లో బావుండటం లేదు. పైగా ఒంటరిగా ఉంటోంది. ఎవ్వరి దగ్గరా ఉండటానికి సుతరాము ఇష్టపడటం లేదు.

అన్నీ తెలిసిన ప్రదీప్ ఇక ఆగలేక వచ్చేశాడు.

ప్రభాతకు ఇక్కడ సంగతులు కొడుక్కి తెలియడం ఏమాత్రం ఇష్టం లేదు. కానీ తన ప్రమేయం లేకుండా అన్నీ అక్కడికి చేరిపోయాయి.

★★★



ప్రభాత, సూర్యలది ప్రేమ వివాహం. అందర్నీ ఎదిరించి ఆర్యసమాజంలో పెళ్ళిచేసుకున్నారు.

సూర్య ఒక అద్భుతమైన చిత్రకారుడు. అతను వేసిన 'తైలవర్ణ చిత్రాలు' జీవం ఉట్టిపడుతూ వుంటాయి. చాలా చిన్నవయసు నుండి బొమ్మలు వేయడం అతనికబ్బిన కళ. అతి తక్కువ సమయంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. ఎన్నో ఆర్ట్ ఎగ్జిబిషన్స్ పెట్టాడు. చాలా ఉన్నత శిఖరాలను అధిగమించాడు. సమాజంలో ఓ గుర్తింపు లభించింది. అన్ని దిన, వార, మాస పత్రికల్లో సూర్య గీసిన పొలిటికల్ కార్టూన్స్ ఉండేవి.

ఇక కథలకంటూ సూర్య వేసే బొమ్మలు చాలా ప్రత్యేకంగా వుండటంతో, వాటిని పత్రికా సంపాదకులు తమ తమ పత్రికల్లో వేసుకోవటానికి పోటీపడేవారు. అతనికి మంచి పేరు, గుర్తింపు బాగా వచ్చేసరికి, చాలా బిజీ అయిపోయాడు. దాంతో ఇంట్లో కాకుండా ఇంకో చోట ఆఫీసు పెట్టాల్సి వచ్చింది. రోజూ అతన్ని కలవడానికి చాలామంది పడిగాపులు కాసేవారు. ఆ తాకిడికి తట్టుకోవటానికి, ఇంకా తన ఆఫీసు పనులు చూసుకోవటానికి అక్కడ అతనికి ఓ అసిస్టెంట్ కావాల్సివచ్చింది. అలాంటి పరిస్థితుల్లో ప్రవేశించింది సంధ్య.

ముందు ఆఫీసులోకి, మెల్లగా అతని జీవితంలోకి!

సంధ్య రాకతో సూర్యలో కూడా ఊహించని మార్పు వచ్చింది. అలాగే కొత్త కొత్త అలవాట్లు కూడా వచ్చాయి. ముందు ఒక్క సిగరెట్టుతో మొదలెట్టి, క్రమేపి చైన్ స్మోకర్ అయ్యాడు.

మెల్లగా ఒక్క పెగ్గుతో ప్రారంభమై ఫుల్ బాటిల్ తాగడం వరకు అలవాటయ్యింది.

ఇక ఆఖరిది, అత్యంత ప్రమాదకరమైనది పరాయి ఆడదానితో పొత్తు. మొదటి రెండూ ఆరోగ్యాన్ని పాడుచేస్తే, చివరిది జీవితాల్ని నాశనం చేస్తుంది.

సంధ్యతోనే సూర్య జీవితం అయిపోయింది. సూర్యానికున్న పేరు ప్రఖ్యాతులను చూసి, వివాహితుడని తెలిసికూడా అతనికి దగ్గరయింది సంధ్య. ఆఖరికి సంధ్య సూర్యకి ఓ వ్యసనంగా మారింది.

రోజులు గడిచే కొద్దీ ఆఫీసులో పని ఒత్తిడి అని ప్రభాతకు సాకులు చెప్పి, ఆఫీసులోనే సంధ్యతో కాపురం పెట్టేసాడు. ఈ విషయం తెలీక ఆఫీసులో అతన్ని కలవడానికి వచ్చిన వాళ్ళంతా.. సంధ్యనే అతని భార్య అనుకునేవారు.

ప్రభాత, సూర్యానికి మధ్య దూరం బాగా పెరిగింది. ఒకప్పుడు ప్రభాతను ఒక్క నిమిషం కూడా విడిచి ఉండలేనన్న సూర్య, ఇప్పుడు ఒక్క నిమిషం పాటు కూడా ప్రభాతతో గడపడం లేదు.

సూర్యాన్ని ప్రేమించిన నేరానికి, ప్రభాత ఇటువంటి పరిస్థితుల్లో కూడా ఎంతో సహనంగా వ్యవహరించింది.

'ఏడ్చి గొడవపడితే మాత్రం.. ఇష్టం లేని వ్యక్తిని ఎంతవరకు కట్టిపడేయగలం?' అనుకున్నది ప్రభాత.

వీటి ప్రభావం కొడుకు మీద పడకుండా, ఉన్న ఒక్క కొడుకుని విజయవాడలో వున్న తన తల్లిదండ్రుల దగ్గర వుంచి చదివించింది. అక్కడే ఇంజినీరింగ్ పూర్తిచేసుకున్న కొడుకును, తరువాత ఎమ్.ఎస్ చేయడానికి అమెరికాకు పంపించింది.

చదువు ధోరణిలో పడి ఈ విషయాలేవీ ప్రదీప్‌కు అంతగా తెలీలేదు. ఇన్నాళ్ళకు తిరిగివచ్చిన ప్రదీప్‌కు జరుగుతున్న భాగోతం అంతా కూలంకషంగా తెలిసింది. తల్లిని ఆ స్థితిలో చూసి తట్టుకోలేకపోయాడు.

'మూడుముళ్ళు' విరక్తిగా నవ్వుకుంది. తన జీవితాన్ని ముళ్ళబాటలో నడిపిస్తున్న ఆ మూడుముళ్ళు, భర్త తన కంఠం చుట్టూ బిగించాడు.

అది తన ఖర్మ అనుకున్నా, ఇప్పుడు ఇంకో ఆడదాని మైకంలో పడిపోయాడే? ఇది ఒక చిక్కుముడి. దాంట్లో మూడుముళ్ళు కాదు ముప్పై ముళ్ళు ఉంటాయని తెలీదు.

★★★

సంధ్య సూర్యాన్ని చాలా ఇష్టపడేది... నిజానికి తమ మధ్య వయోభేదం ఉన్నప్పటికీ కూడా! చిన్నతనం నుండి సంధ్యకు డబ్బు మీద మోజు ఎక్కువ. జల్సా జీవితం గడపాలన్న ఆశ. సూర్యం యొక్క కీర్తి ప్రతిష్ఠలు చూసి ఏమోమో ఊహించుకుంది. పోగా పోగా కేవలం ప్రేమ కడుపు నింపదని అర్థం చేసుకుంది.

సూర్యకి సంధ్యతో గడపటం అంటే ఎంతో ఇష్టం. అందులోనూ ఇప్పుడు మొదటి భార్య మీద మోజు పూర్తిగా తగ్గిపోయింది.

పైగా తను ఏ గొడవా చేయడం లేదు. తన ఉనికిని పట్టించుకోవడం మానేసి చాలా ఏళ్ళయింది.

తను చదువుకుంది కాబట్టి భర్తపై ఆధారపడకుండా ఒక మంచి ఉద్యోగం చూసుకుంది.

★★★

తన వృత్తిలో కూడా నిజాయితీగా ఉండడం మానేశాడు. అన్న మాట ప్రకారం టైముకు బొమ్మలు వేసి ఇవ్వలేకపోతున్నాడు. కారణం సంధ్యపై ఏర్పడ్డ విపరీతమైన మోజు! అదే తట్టుకోలేకపోయింది సంధ్య. డబ్బు సంపాదించడం మానేసి, ప్రేమా గీమా అంటూ తన వెంటే వుండటం గిట్టడంలేదు. సూర్య పద్ధతి తనకు అస్సలు సరిపోవడంలేదు.

ఒకరోజు సూర్య ఇంటికి వచ్చేటప్పటికి ఇల్లు తాళం వేసి వుంది. వాచ్‌మన్‌ను అడగడంతో ఇంటి తాళం, ఓ కవరు చేతిలో పెట్టాడు.

"అమ్మగారు ఇది మీకిమ్మన్నారు. ఊరెళుతున్నానని చెప్పమన్నారు."

సూర్యానికి ఏమీ అర్థం కాలేదు. పైకెళ్ళి ఇంటి తాళం తెరిచేటప్పటికి ఇల్లంతా ఖాళీగా వుంది. ఏ సామాను లేదు. తన రూమ్ తాళం తన దగ్గరే ఉంది కాబట్టి అందులో సామాన్లు ఏవీ పోవడానికి వీల్లేదు.

వణికే చేతుల్తో కవరు చింపి అందులోని ఉత్తరం బయటకు తీసాడు. అందులో నాలుగే ముక్కలు

సూర్య,

నీతో నాకీ జీవితం నచ్చడం లేదు.

నువ్వసలు నచ్చడం లేదు.

నేను వెళ్లి పోతున్నాను. ఎక్కడికని అడగకు!

సెలవు!

–సంధ్య

సూర్యకి దిమ్మతిరిగి, కళ్ళకి చీకట్లు కమ్ముకున్నాయి.

ఇల్లు, ఇంట్లోని సామాన్లు కాకుండా, సంధ్య తన జీవితాన్ని కూడా సంపూర్ణంగా ఖాళీ చేసి వెళ్ళిపోయిందని గ్రహించాడు.

ఏం జరుగుతుందో తెలిసే లోపలే గట్టిగా కేక పెట్టి ఓ పక్కకు ఒరిగిపోయాడు.

కుడికాలు, కుడి చెయ్యి వంకర తిరిగాయి. మూతి ఓ పక్కకు పోయింది. స్పృహ కోల్పోయాడు. కళ్ళు తెరిచేసరికి ఆసుపత్రిలో ఉన్నాడు. వాచ్‌మెన్ తీసుకొచ్చి అడ్మిట్ చేసాడు. సూర్య సెల్‌లోంచి కొంతమంది వ్యక్తులకు ఫోన్ చేశాడు. అతనికి కూడా సూర్యకి మొదటి భార్య ఉన్నట్లు తెలీదు.

అందులో ఒక ఫోన్ ప్రభాత కెళ్ళింది.

విషయం తెలిసిన ప్రభాత సందిగ్ధంలో పడింది. మాంగల్యం ముందుకు పొమ్మంటుంది. మనసు వెనక్కి లాగుతోంది. ఏది తేల్చుకోలేకపోతోంది. అతడు తనకు చేసిన అన్యాయాన్ని భార్యగా ఏమాత్రం భరించలేకపోతోంది.

ఇన్నేళ్ళ తమ కాపురంలో ఏనాడు భార్యగా తన ధర్మాన్ని గానీ, బాధ్యతను గానీ మర్చిపోలేదు. కానీ సూర్య మాత్రం తనను నమ్ముకుని, తనతోనే జీవితం అనుకొని, అయిన వాళ్ళందర్నీ వదులుకుని వచ్చిన భార్య పట్ల భర్తగా విస్మరించి తన కర్తవ్యాన్ని నిర్వర్తించలేదు. కార్యేషు దాసీ, కరణేషు మంత్రి.. అంటూ ఒక భార్యకు పతివ్రతా ధర్మాన్ని బోధించిన శాస్త్రాలు, ఒక భర్తకు తన భార్యతో ఎలా వ్యవహరించాలో చెప్పలేదే? అన్ని ధర్మాలను ప్రేమతో కూర్చి, అతనితో కలిసి జీవించింది ఇన్నాళ్ళు. కానీ, చివరగా చెప్పేది “క్షమయా ధరిత్రి” మాత్రం కాలంతో పాటు తనలో కరుగుతూ వస్తోంది. కారణం, జరుగుతున్న పరిణామాలు.

కానీ, అన్నేళ్ల సాన్నిహిత్యం, పైగా అతను తన బిడ్డకు తండ్రి అయిన కారణం వల్ల అతన్ని సాటిమనిషి అన్న మానవత్వంతో ఓసారి చూసి రావడం ధర్మం అనుకుంది. అందుకే కొడుక్కి చెప్పకుండా సూర్యాన్ని చూడడానికి హాస్పిటల్‌కి వెళ్ళింది.

సూర్య జనరల్ వార్డులో ఓ మూలగా మంచం మీద పడుకొని వున్నాడు. అతని స్థితి చాలా దయనీయంగా ఉంది. కొన్ని వేల చిత్రాలకు ప్రాణం పోసిన అతని కుడిచేయి చలనం లేకుండా పడివుంది. తన జీవితాన్ని ఎడం కాలితో తన్ని వెళ్ళిపోయిన అతని కుడికాలు నిర్జీవంగా పడివుంది. చూసి తట్టుకోలేకపోయింది. ఎంతైనా అతన్ని ప్రేమించింది. కోరి అతనితో మూడుముళ్ళు వేయించుకుంది. ఏడడుగులు నడిచింది. అతనితో జీవితం అనుకుంది.

పరిచయమైన తొలి రోజుల్లో అతను మాట్లాడుతుంటే అతని కళ్ళల్లో చూస్తుండేది. ఎందుకంటే అతని కళ్ళల్లో ఒక మెరుపుండేది. చురుగ్గా చూసే ఆ చూపులకే తను అతని ఆకర్షణలో పడిపోయింది. ఆ కళ్లే ఇప్పుడు భావహీనంగా, గాజు కళ్లలా మారటం చూసి ప్రభాత కళ్ళల్లో నీళ్ళు ఉబికాయి. నిండైన విగ్రహం. నిజంగా ఆరడుగుల అందగాడు సూర్య నిటారుగా నడిచేవాడు.

ఒక్కసారి పైనుండి కింద వరకు అతన్ని పరిశీలనగా చూసింది. అంత పొడగరి ఇప్పుడు అస్తవ్యస్తంగా పడి వున్నాడు.

కాన్వాస్ మీద చురుగ్గా కదలాడిన అతని వేళ్ళు వంకర్లు పోయి వున్నాయి.

అతని మొహంకేసి తేరిపార చూసింది. మూతి వంకర పోయింది. చిందరవందరగా పెరిగిన గడ్డం వల్ల మరీ రోగగ్రస్తుడుగా కనిపిస్తున్నాడు. ప్రభాతను చూసి సూర్య ఏదో చెప్పాలని తపించాడు. ఆ గాజు కళ్ళల్లో సన్నని నీటి పొర. శరీరంలో ఏ భాగాన్ని కదల్చలేకపోతున్నాడు. క్షమించమని అడగటానికి కూడా నోరు ఎలాగూ పెగలటం లేదు. అరచేతులు రెండూ ఒక్కటవడానికి సహకరించడం లేదు. అంతా గమనిస్తూనే ఉంది ప్రభాత. అతని క్షోభ అర్థమవుతూనే వుంది. ఇంకొక్క నిమిషం అక్కడున్నా తన మనసు కరిగిపోతుందన్న భయం.

'అయినా రేఖాచిత్రాలతో ఆడుకునేవాడు తన నుదుటి రాతను, తాళిని ఎగతాళి చేసాడు' అనే ఆలోచనతో, కరిగిపోతున్న మనసుని, కారే కన్నీటిని అదుపులో పెట్టుకుంటూ వార్డు బయటకు వచ్చింది.

దూరం నుండి యాభై ఏళ్ళకు పైబడి వున్న ఓ నర్సు ప్రభాతను పరీక్షగా చూస్తోంది.

బయటకు వచ్చిన ప్రభాత పక్కగా వచ్చి, "మేడమ్ మీరెవరని నేనడగను. కానీ గత పది పదిహేను రోజుల నుండి ఆ పేషంటుని చూస్తున్నాను. అతని దగ్గరకు వచ్చే జనం, పోయే జనం. అంతా వెళ్ళి సానుభూతి చూపించినవాళ్ళే. కానీ ఎవరూ ఎలాంటి సాయం చేసినట్టు కనిపించలేదు. వాళ్ళు వాళ్ళు మాట్లాడుకునే దాన్ని బట్టి చూస్తే, ఆయనొక గొప్ప చిత్రకారుడని అర్థం అయింది. ఎలాంటి వారికైనా జీవితానికంటూ ఒక ప్రణాళిక వుండాలి. కేవలం ఒక కళ వుండడం, దాంట్లో ఒక ప్రతిభ వుండటం సరిపోదు. మీతో చెప్పచ్చో లేదో కానీ, అతను ఉంచుకున్న ఆడది ఇతని జీవితంపై దెబ్బకొట్టి ఎక్కడికో, ఎవరితోనో ఎగిరిపోయింది. ఇవ్వాళ పొద్దున్న అతని కొడుకు వచ్చాడు. చూసి కన్నీరు కార్చాడు. తండ్రిని ఒక వృద్ధాశ్రమంలో చేర్చడానికి నిర్ణయించుకున్నాడు. దానికయ్యే ఖర్చు అంతా భరిస్తానన్నాడు. ఇప్పుడు మీతో నేను మాట్లాడినట్టే అతను నాతో చాలాసేపు మాట్లాడాడు. ఏదిఏమైనా కట్టుకున్న భార్యని క్షోభపెట్టిన వాళ్ళకు ఇలాంటి శాస్తే జరగాలి. ఆమె ఉసురు ఇతనికి తప్పకుండా తగిలే వుంటుంది. అందుకే అతను ఇలా...." వెంటనే చటుక్కున నర్సు నోటికి తన చేతిని అడ్డుపెట్టి ఇక ఆపై మాట్లాడొద్దని కళ్ళతో వారించింది. ధారాపాతంగా కారుతున్న కన్నీటిని తుడుచుకునే ప్రయత్నం చేయలేదు ప్రభాత.

వెంటనే ఆమె ఎవరో అర్థం అయింది ఆ నర్సుకి. అప్రయత్నంగా చేతులు జోడించి ఆమెకు, ఆమెలోని స్త్రీ మూర్తికి నమస్కరించింది.

వెనక్కు తిరగబోయిన ప్రభాత భుజం పైన ఓ చేయి పడింది.

తల తిప్పి చూసేసరికి ప్రదీప్. కొడుకు భుజంపై తల వాల్చింది.

“నేనిక్కడ ఇంక ఉండలేను నాన్నా, నన్ను నీతోపాటు తీసుకెళ్లు” అంది.

పైకి గాంభీర్యంగాను, కఠినంగాను కనిపించడానికి ప్రయత్నిస్తున్నాడు ప్రదీప్. కానీ లోపల మౌనంగా అతని హృదయం రోదిస్తోంది. తన తండ్రికి పట్టిన ఈ దుస్థితి పగవారికి కూడా రాకూడదనుకున్నాడు. కానీ, ఇన్నేళ్లు తన తల్లి పడ్డ ఆవేదన అంతా ఇంతా కాదు. తన తండ్రి వల్ల ఆమె పడ్డ మానసిక సంఘర్షణ కూడా మర్చిపోయేది కాదు. కన్న కొడుకుగా తండ్రి మరీ రోడ్డున పడకుండా తన వంతు ధర్మాన్ని నిర్వహించాడు. రక్త సంబంధం కాబట్టి అప్రయత్నంగానే ఆ నాలుగు కన్నీటి బొట్లు రాలాయి. ఈ సంగతి తెలిస్తే తల్లిలో మళ్ళీ ఎక్కడ అతని పట్ల ప్రేమాభిమానాలు చిగురిస్తాయేమోనని తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. కానీ, ఇక్కడికి వచ్చి చూస్తే అర్థమైంది.

జీవితంలో తల్లికి దెబ్బ తగలడం మాత్రమే తనకు తెలుసు. అది చేసిన గాయం ఎప్పటికీ మానదని తల్లి నిర్ణయం వల్ల తెలిసొచ్చింది.

తల్లిని అలాగే పొదివి పట్టుకుని ముందుకు నడిచాడు ప్రదీప్.

*(నవ్య వారపత్రిక, కథల పోటీలో ఎంపికైన కథ.. పునర్ముద్రణ )*

# జైలునుండి దేశసేవకుడి శవం బయటకెళ్లింది

## కీ. శే. సోమంచి యజ్ఞన్న శాస్త్రి

**కథా మార్గదర్శి కథ**

*"గౌరవం చేయవలసిన శవాన్ని ఇలా ఉపయోగించుకోవడమా?"*

*"శవాన్ని ఏ విధంగా ఉపయోగించుకున్నా దానికి కష్టం తోచదుగా! కాదూ, కూడదూ మన హృదయాలు దానికి సమాధానం చెప్పుకోవాలంటారూ, మరణించి కూడా గోపాలస్వామి సేవ చేసాడనుకుందాం"*

'సి' క్లాసు ఖైదీలున్న ఆ జైలులో, ఆరకుండా మిగిలి ఉన్న ఒక్క దీపమూ మిణుకు మిణుకుమంటోంది. అదికూడా ఆరిందంటే జైలంతా అంధకారమే!

"దాహం.. మంచినీళ్లు" అన్నాడు వగురుస్తూ గోపాలస్వామి. జ్వరంతో అతని ఒళ్ళు పేలిపోతుంది. మాట వినిపించుకోనట్టు అందరూ ఊరుకున్నారు.

"దాహం" అని గట్టిగా అరిచాడు గోపాలస్వామి.

"ఏమండీ ఇయ్యమంటారా మళ్ళీ నీళ్ళు?" అని సందేహంతో అడిగాడు శేఖర్ తన పక్కన కూర్చున్న రంగనాధంగారిని ఉద్దేశించి.

"జ్వరం మీద తాగకూడదు బాబూ, ఇప్పటికే పది గ్లాసుల నీళ్ళు తాగావు. ఇంకా తాగితే ప్రమాదిస్తుంది" అని రోగికి హితవు చెప్పారు రంగనాధంగారు.

"నోరెండి చచ్చిపోతున్నానండీ, నే బతకలేను" అన్నాడు గోపాలస్వామి మూలుగుతూ.

"ఛీ, ఛీ.. అలాంటి మాటలనకు! చూడూ.. నీళ్ళు లోపలికి తాగకుండా కాస్త నాలిక తడిచేసుకుంటూ ఉండు. ఎలాగో ఈ రాత్రి గడిస్తే రేపు పొద్దున్నే నిన్ను ఆస్పత్రిలో జేర్పిస్తాము!" అన్నారు రంగనాధంగారు.

"అక్కడ మాత్రం మందులేం ఏడిసాయీ.. డిస్టిల్డ్ వాటరన్నా లేదు మన వెధవ జైలు ఆస్పత్రిలో!" గొణిగాడు చంద్రం.

గోపాలస్వామి పెద్దగా మూలగడం ప్రారంభించాడు. వగర్పు కూడా ఎక్కువైంది. మిగతా ఖైదీలంతా లేచి కూర్చున్నారు. ఆ నిశీథసమయంలో చేసేదేదీ పాలుపోకుండా ఉంది.

“మనకి డాక్టర్ వామనరావేగా? ఓ దానికో మందిచ్చి అసలే చంపుతాడు.”

అప్రయత్నంగా అందరూ నవ్వారు.

‘వామనరావు’ ఆ డాక్టర్ గారి అసలు పేరు కాదు. పొట్టిగా ఉండడంవల్ల ఖైదీలే ఆయనకా నామకరణం చేశారు. ఆయన అసలు పేరు ఎవరికీ గుర్తే లేదు. ఆయన కూడా పరధ్యానంలో ‘వామనరావుగారూ’ అంటే ‘ఓ’ అని పలుకుతూ ఉంటాడు.

‘వామనరావు’ జైల్లో చిన్న డాక్టరు. ఆయనకి ఎప్పుడూ ఒకటే తొందర. అరనిమిషం కూడా ఎక్కడా కాలు నిలిచేది కాదు.



తొందర్లో ఒకదానికొకటి చేసేవాడు. ఆయనిచ్చిన మందు పుచ్చుకోవాలంటే భయంగా ఉండేది అందరికీ. కానీ, పెద్దడాక్టరు అసలే కర్కోటకుడవడం వల్ల, భయపడుతూనైనా వామనరావు దగ్గరకి చేరడం తప్పేది కాదు.

గోపాలస్వామి కాళ్ళూ చేతులూ తన్నుకోవడం ప్రారంభించాడు. మూలుగు ఎక్కువైంది. డాక్టర్ కోసం వార్డర్ని పరిగెత్తించడం తప్పింది కాదు.

★★★

"పాపం మహాబాధ పడుతున్నాడు, ఏం జబ్బోగాని!"

గోపాలస్వామి క్రితం రోజునే జైల్లో ప్రవేశించాడు. ఉదయం పది గంటలకు 'అడ్మిషన్'కు వచ్చేసరికి అతనికి జ్వరంగా ఉంది. తిన్నగా నిల్చోడానికి శక్తి లేక, ఓ మూల కూలబడ్డాడు. ప్రవేశపెట్టుకోడానికి జైలు అధికారులొచ్చేసరికి మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. ఆహారం లేకా, జ్వరంవల్లా కళ్ళు తిరగడం ప్రారంభించాయి. తను వచ్చినా.. లేచి నించోని ఖైదీని చూసి మండిపోయాడు జైలరు. 'లేచి నించోలేకుండా ఉన్నానన్నాడు' గోపాలస్వామి.

"వెధవ్వేషాలన్నీని. జైలుకి రాగానే టక్కులు. లేచి నించో" అని, ఒక్క అరుపు అరిచాడు జైలరు.

అతి కష్టమ్మీద లేచి నించున్నాడు గోపాలస్వామి. ఓ గంటసేపటికి గాని అతన్ని 'ప్రవేశపెట్టుకోవడం' పూర్తి కాలేదు. తన 'జాగా' చూసుకుని నడుం వాల్చేసరికి, మరో గంట పట్టింది. రోజంతా కడుపులో ఏమీ పడలేదు. నకనకలాడిపోతోంది. సాయంకాలం అందరితో పాటూ తనూ ఓ ముద్ద పులుసన్నం తినేసాడు, ఆకలిబాధ పడలేక!

రాత్రి జ్వరం ఎక్కువైపోయింది. రాత్రంతా బాధతో మూలుగుతూనే ఉన్నాడు. పొద్దున్న పదిగంటలు దాటిన తరవాత వచ్చాడు పెద్దడాక్టరు.. ఓ మాటు ఖైదీలనందరినీ చూసి పోవడానికి! ఎక్కడ ఆగితే ఎవరి ఫిర్యాదు వినాల్సి వస్తుందో అన్నట్టు, ఎక్కడా కాలు నిలపక, 'మెయిల్ ట్రైన్'లా బ్లాకంతా కలియజుట్టేసి, తన ధర్మం నిర్వర్తించుకున్నట్టు బయటకు దాటెయ్యాలని చూసేవాడు ఆయన ప్రతీరోజూ! ప్రాణాలు విసిగిపోయి, ఆయనతో జబ్బుల గురించి చెప్పుకోవడం మానుకున్నారు ఖైదీలు. ఆయన పలకరించినా పలకకూడదని ఒకప్పుడు ఆ జైల్లో నియమం ఏర్పడింది కూడా!

ఆ రోజున డాక్టరుగారు బ్లాకులో కాలెట్టగానే రంగనాథంగారు ఆయన్ని ఆపి, గోపాలస్వామి సంగతి చెప్పారు. రంగనాథంగారు ఆ బ్లాకులో అజాతశత్రువు. పరుషమైన మాట ఆయన నోటంట ఎన్నడూ వచ్చేది కాదు. నిజమైన సత్యాగ్రాహి ఎవరైనా ఉన్నారా అంటే, ఆయనే అనిపించేది అందరికీ!

"జైల్లోకొచ్చేసరికి తేరగా ఉంటుందని అందరికీ జబ్బులొస్తాయండీ" అన్నాడు పెద్దడాక్టర్ రంగనాథంగారితో.

రంగనాథంగారు తెల్లబోయారు. ఇదివరకూ చాలామంది ఈ డాక్టరుతో ఘర్షణపడ్డ సంగతి ఆయనకు తెలుసు. కానీ, ఆయనంటే చివరికి జైలు సూపరిన్టెంటుకి కూడా గౌరవముంది. ఆయన ఎప్పుడూ ఎవరితోనూ అనవసరంగా మాట పెంచరు. డాక్టర్ ఆ విధంగా తృణీకరించేసరికి, ఆయన తెల్లబోయి, వస్తున్న కోపం అణచుకుని "మీరొచ్చి చూసి, నిజంగా జబ్బుందో లేదో కనిపెట్టే మందివ్వండి" అని వినయంగా జవాబిచ్చారు.

"ఒకవేళ కాస్త జ్వరమున్నా మరేం భయం లేదు. లంకణం పరమౌషధం. మందూ, గిందూ ఏమీ అక్కరలేదు" అన్నాడు డాక్టరు.

"ఇది మామూలు జ్వరం కాదండీ, పాపం ప్రాణి చాలా బాధపడుతున్నాడు"

"జైల్లోకొస్తే అందరికీ పట్టుకునేది ఒకటే జబ్బండీ! అజీర్తీ, కడుపునొప్పీ. పొట్ట ఎక్కొచ్చేలా తినేస్తారు. దాంతో అజీర్తి జ్వరాలూ, రక్తవిరోచనాలూ పట్టుకుంటాయి" అని మళ్ళీ వెటకారంగా మాట్లాడాడు డాక్టరు.

"క్షమించాలి, తిండి లేనివారం కాము మేమెవరమూ.. ఇక్కడ పెట్టే పులుసుముద్ద పంచభక్ష్యపరమాన్నమనుకొని గొంతుదాకా నింపేందుకు! అయినా అనవసరమైన గొడవలెందుకు? మీరు రోగిని చూసి ఏదైనా మందిప్పించండి" అని దారం తుంచేశారు రంగనాథంగారు.

"నే చూడక్కరలేదు. ఆస్పత్రిలో చెప్పి, అజీర్తికి కాస్త మందు తెచ్చి, గొంతుకలో పోయండి. ఓ రోజు తిండి మానమనండి. అదే నయమౌతుంది" అన్నారు పెద్దడాక్టరుగారు.

"మీరు అంత తృణీకారంగా జవాబివ్వడం భావ్యం కాదు" అన్నారు రంగనాథంగారు.

"ఉన్న మాటంటే ఉలుకెక్కువ" అన్న సామెత చదివాడు డాక్టర్.

"తమరు ఒక మాటు రోగిని చూసి మందిచ్చి వెళ్ళాలి, అతనికి చాలా బాధగా ఉంది" అన్నారు రంగనాథంగారు. ఆ మాట వినిపించుకోకుండా...

"ఎందుకండీ అంత బాధపడిపోతారు? భాధపడితే యేం? ఏ బాధా లేకుండా పెళ్లికొడుకులా జైలుకొచ్చి, నాలుగు రోజులు కూచోని, నాయకులమైపోదామనుకున్నారా? మహా దేశసేవ చేస్తున్నామంటున్నారుగా జైలుకొచ్చి! జైలు బాధలన్నీ అనుభవించండి! ఆ మాటకొస్తే, ఇక్కడ ఎంత అనుభవిస్తే మీకంత మంచిది. అంత ఎక్కువ సేవ చేసినట్టు. అసలు మందులెందుకండీ? మీరిక్కడ పోతే మరీ గొప్ప త్యాగం చేసినట్టు. మీరెంతమంది చచ్చిపోతే అంత గొప్ప చెప్పుకోవచ్చు" అన్నాడు చిరునవ్వు పెదాలమీద తాండవింపజేస్తూ.

"తన్నండోయ్ గాడిదకొడుకుని, ఇంకా చూస్తారేం" ఖైదీలందరూ డాక్టర్ని చుట్టుముట్టేశారు.

రంగనాథంగారు అడ్డు తగలకపోతే డాక్టరుగారి రక్తం కళ్ల చూసేవారే!

"ఎందుకు బాబూ మమ్మల్ని అనవసరంగా అవమానం చేయాలని ప్రయత్నం. నువ్వూ ఓ భారతీయుడివి. నీకూ పెళ్ళాం బిడ్డలున్నారు. రోగులకి సేవ చేస్తానని ప్రమాణం తీసుకున్నావు కూడా. దేశ సేవ చేయకపోతే మానిరి, నీ ధర్మమైనా తిన్నగా నిర్వర్తించుకో!" అన్నారు రంగనాథంగారు.

అంతమంది ఖైదీలు ఒక్కమారుగా మీదకు రావడం చూసి, డాక్టర్ గాభరా పడిపోయాడు. ఇదివరకూ ఎన్నోమాట్లు ఆయన ఖైదీల్ని అవమానం చేశాడు గాని, వాళ్ళీ విధంగా ఎదురు తిరగడం ఆయనకి అనుభవం లేదు. కనక వెనక్కి తగ్గి, చరచరా గోపాలస్వామి దగ్గరకి నడిచాడు.

రోగికి నూటనాలుగు డిగ్రీల జ్వరం పేలిపోతోంది. అరనిమిషం పరీక్ష చేసి, కాగితం ముక్కమీద ఏదో గీసి, మాటాడకుండా వెళ్లిపోయాడు, “అయ్యా, వారికి పాలు ఇప్పిస్తారు కదూ” అని రంగనాధంగారు అంటున్న మాట వినిపించుకోకుండా!

ఆరోజున ఏదో మోతాదు మందు పడింది గాని, పాలు మాత్రం రాలేదు. జ్వరం తగ్గుమొహం పట్టిన మరో రోగిని బతిమాలి, అతనికిచ్చిన పాలు కొంచెం తీసుకొచ్చి పోసారు సాయంత్రం.

రాత్రికి జ్వరం మరీ హెచ్చైపోయింది. దాంతో కొత్త లక్షణం.. దాహం కూడా పట్టుకుంది.

“నోరెండుకుపోతోందండోయ్.. నీళ్ళు” అని గుడ్లు తేలేస్తూ, గోపాలస్వామి మళ్ళీ అరిచాడు.

ఉన్న ఒక్క దీపమూ ఒక మాటు టకటక కొట్టుకొని ఆరిపోయింది. చీకటి.. గాఢాంధకారం! జైలు రూల్సు ప్రకారం తెల్లవార్లూ బ్లాకులో రెండు దీపాలు వెలగాలి. దానికి సరిపోయినంత కిరసనాయిలు మంజూరు చేసామని జైలరుగారు అంటారు. కానీ సూపర్నెంటు మొదలు వార్డరు దాకా జైలు ఆఫీసర్లంతా తమతమ భాగాలు భుక్తం చేసుకున్నాక, మిగిలిన కిరసనాయిలుతో ఒక్కదీపం రాత్రి రెండుగంటల దాకానైనా వెలగదు.

గోపాలస్వామికి ఎగశ్వాస ప్రారంభమైంది. డాక్టర్ ఇంకా రాలేదు. భగవంతుడి మీద భారం వేసి వేచి ఉండడం తప్ప, మరేమీ గత్యంతరం కనిపించలేదు. కొన్ని యుగాలైన తరవాత దొర్లుకుంటూ, అతిగాభరాగా వచ్చి పడ్డాడు వామనరావు డాక్టరుగారు. ఆయనతో ఓ దీపమూ వచ్చింది.

“ఏమిటీ గొడవంతా? రాత్రి నన్ను నిద్దరోనివ్వరటండీ” అని దీర్ఘాలు తీశాడు వామనరావు.

ఆ దీర్ఘాలకి అందరూ నవ్వుకోవడం మామూలు. ఆ రోజున అందరి గుడ్లూ ఎర్రబడ్డాయి. “తిన్నని మందు ఇవ్వకపోండి, రేపు మీ సంగతి తెలుస్తుంది” అన్నారొకరు.

వామనరావుది అసలే పిరికిగుండె. అది కాస్తా జారింది.

గోపాలస్వామి దగ్గరకు పరుగెట్టుకెళ్ళి, రోగికంటే తానే ఎక్కువ వగరుస్తూ పరీక్ష ప్రారంభించాడు. అతనికి నాడి ఎక్కడా అందలేదు. వామనరావుకి నిజంగా గాభరా వేసింది. ఏదో మామూలు జబ్బు అనుకున్నాడు గాని, ఇంత ప్రాణం మీదకొచ్చిందనుకోలేదు. వెళ్ళి, ఓ ఇంజక్షన్ తీసుకొచ్చి ఇచ్చాడు. అరగంట అయిన తరవాత మరో ఇంజక్షన్ ఇచ్చాడు. బాధ తగ్గలేదు.

మరో ఇరవై నిమిషాల్లో గోపాలస్వామి కన్నుమూసాడు!

★★★

“ఈ డాక్టర్ని ఈవాళ ఇక్కడ పాతిపెట్టాలండీ” అన్నాడు శేఖర్. “ఇంకా ఎంతమందికి ఈ రాత ఉందో జైలు విడిచే లోపల. వీళ్ళకి బుద్ధి చెప్పాలి.”

రంగనాథంగారి గొంతు రుద్ధమైంది. "గడియొచ్చినప్పుడు డాక్టర్లు ఏం చెయ్యగలరు బాబూ? ఆయుష్షు ఉంటే మన ప్రాణం తియ్యడం డాక్టర్ల వశమా?"

"అలా వేదాంతం మాట్లాడితే ఎలా? మనం చూస్తూ ఉండగానే, మన కళ్లెదుట సరైన వైద్య సహాయం లేక చనిపోయాడు కదా? దీనిక్కూడా భగవంతుని మీద భారం వేస్తే ఎలాగ?"

"మన చేతగానితనమూ, క్రూరత్వమూ వాడి మీద తొయ్యడానికి కాకపోతే ఎందుకనుకున్నారేమిటి భగవంతుడు?" అన్నాడు రామచంద్రన్. రామచంద్రన్ లెఫ్టిస్టు. జైల్లోకొచ్చి భగవద్గీత పారాయణ మొదలుబెట్టిన వారిని చూస్తే అతనికి ఒళ్ళు మంట. వీలైనప్పుడల్లా భగవంతుని మీద దాడి చేసేవాడు.

"ఏమండీ శవాన్ని ఊళ్ళోకి పంపించనిస్తారా దహనానికి.. లేక ఇక్కడే కానిమ్మంటారా?" అన్నాడు చంద్రం.

"ఎక్కడ దహనం చేస్తే ఏమిటి? ఊళ్ళో అయితే ఊరేగింపూ అదీ చెయ్యనిస్తారు గనకనా? ఇక్కడైతే తోటి ఖైదీలందరూ వెళ్ళి, మర్యాదలన్నీ చెయ్యొచ్చు. కాదండీ రంగనాథంగారూ?"

రంగనాథంగారు ఒక్కక్షణం జవాబివ్వలేదు. "ఎవరో పాపం. అతని పుట్టుపూర్వోత్తరాలేమిటో మనకిప్పటిదాకా ఏమీ తెలియదు. ఈమారు స్వతంత్ర సమరంలో ఎక్కడెక్కడివాళ్ళో చొరబడ్డారు. ఇతను నిజంగా మనకి ప్రచ్ఛన్నయోధుడు (unknown soldier). ఊరిలోకి పంపించి ప్రయోజనమేమిటి?" అన్నారు చివరికి.

"ఊరిలోకి పంపిస్తేనే బాగుంటుందండీ" అన్నాడు చంద్ర నసుగుతూ.

"ఎందుకూ, అక్కడ జరపగల అధిక మర్యాదలేమిటి?"

"మర్యాదలకోసం కాదండీ.. మరీ," చంద్రం లేచి, మెల్లగా రంగనాథంగారి చెవి కింద చేరి, గుసగుస మొదలెట్టాడు.

రంగనాథంగారు 'ఛీ ఛీ" అన్నారు.

"ఏమిటోయ్ మమ్మల్ని కూడా విననియ్" అన్నాడు శేఖర్.

"శవాన్నిబయటకు పంపిస్తే, దానితో బాటూ చాలా ఉత్తరాలు కూడా పంపొచ్చంటాడు చంద్రం" అన్నారు రంగనాథంగారు.

అందరూ తెల్లబోయారు. ఒక్కనిమిషం ఎవరూ మాట్లాడలేకపోయారు.

"పట్టుబడితే?" అన్నాడు శేఖర్ చివరికి.

"పట్టుబడవండీ, శవానికి స్నానం చేయించి కొత్తబట్ట కడతాం కదా ఎలాగూ, అప్పుడు శవమ్మీద ఉత్తరాలు పెట్టి బట్ట చుడితేసరి, శవం బట్ట విప్పి, చూస్తాననడుగా సూపర్నెంటు" అన్నాడు చంద్రం మెల్లిగా, కొంచెం సిగ్గు పడుతూ.

"నీకీ ఆలోచన ఎలా పుట్టిందోయ్ అసలు?" అన్నారు రంగనాథంగారు.

ఈమాటు జైలు అధికారులు కక్షకొద్దీ ఖైదీలని పూర్తిగా ఏడిపించి బాధపెట్టాలని, ఉత్తరాలేమీ రాసి బయటకు పంపకూడదని నిషేధించారు. లంచం పుచ్చుకుని ఉత్తరాలు బయటకు తీసుకెళదామని ప్రయత్నించిన ఇద్దరు ముగ్గురు వార్డర్లు పట్టుబడి డిస్మిస్ అయిపోయారు. అందువల్ల ఆ మార్గం కూడా బందైపోయింది. నాలుగునెలలు దాటిపోయింది జైలునుండి ఇళ్లకు ఉత్తరాలు వెళ్ళి! ఉత్తరాలు రాసి పంపించడం కోసరం అందరూ తహతహలాడుతున్నారు.

"నిజంగా పట్టుబడకుండా వెళతాయంటావా?" అడిగాడు శేఖర్.

విత్తనం నాటుకుంది.

"ఆ భయమేమీ ఉండదనే నా నమ్మకం."

"చాలా బాగుందయ్యా నీ ఆలోచన. భగవద్గీత చదివి ఇంత ఉపయోగకరమైన ఆలోచన చెప్తావనుకోలేదయ్యా" అన్నాడు రామచంద్రన్.

రంగనాథంగారు పెదవి విరిచారు. ఆయనకీ ఆలోచన ఏమీ నచ్చలేదు. "గౌరవం చేయవలసిన శవాన్ని ఇలా ఉపయోగించుకోవడమా?"

"శవాన్ని ఏ విధంగా ఉపయోగించుకున్నా దానికి కష్టం తోచదుగా! కాదూ, కూడదూ మన హృదయాలు దానికి సమాధానం చెప్పుకోవాలంటారూ, మరణించి కూడా గోపాలస్వామి సేవ చేసాడనుకుందాం" అన్నాడు రామచంద్రన్.

"ఈ ఆలోచన మొదట తట్టినప్పుడు నాకే సిగ్గేసింది గాని, ఈ నిస్సహాయస్థితిలో ఈ అవకాశం వదులుకోలేము. చూడండి, విశ్వామిత్రుడంతటి వాడు కుక్కమాంసం తినాల్సివచ్చింది" అన్నాడు చంద్రం.

రంగనాథంగారు జవాబు చెప్పకుండా ఊరుకున్నారు.

తెల్లవారగానే జైలరుతో తగాదా. శవాన్ని జైలు ఆవరణలోనే దహనం చేయాలన్నాడట సూపర్నెంటు. శవం బయటకి వెళ్ళి తీరాలని పట్టుబట్టారు రంగనాథంగారు. బయట ఊరేగింపులు ఏమీ జరగవని మాటిచ్చారు. ఆయన మాటంటే చివరికి సూపర్నెంటుకి కూడా గురే. ఆయన మాట మీద శవాన్ని పురజనులకు అప్పజెప్పడానికి సూపర్నెంటు ఒప్పుకున్నాడు.

దేశసేవలో ప్రాణాలర్పించిన గోపాలస్వామి శవాన్ని 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదాలతో జైలు నుంచి బయటకు పంపించారు.

దానితో నాలుగు నెలల నుంచీ ఇంటికి ఉత్తరం పంపలేక తహతహలాడుతున్న ఆరువందలమంది ఖైదీల ఉత్తరాలూ వెళ్ళాయి.

*(వనిత, మాస పత్రిక జూన్ 1991 నుంచి పునర్ముద్రణ)*

కథామంజరి
తెలుగు కథ విస్తృతే ధ్యేయంగా
పనిచేస్తోంది.

ఇది లాభాపేక్ష లేని సంస్థ.
అందుకే ఇక్కడ చందా అవసరం లేదు.

చందా కట్టినా, కట్టకపోయినా
'కథామంజరి' అదే సంచిక.

మీ చందా 'కథామంజరి' కి
చేయూతనిస్తుంది.

కథల మీద మీ స్పందన
కొత్త ఊపిరులు పోస్తుంది.

తెలుగు కథ చదవండి,
చదివించండి.

వార్షిక చందా రూ.200/-
ఉచిత సంచిక కోసం